సంపుటి: 38
సంచిక: 2

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాసపత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

మార్చి, 1984

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

S. L. S. Book Stall
Side: Mohan Das Theatre
PATAMATA, VIJAYAWADA - 520 006

అపరాధ పరిశోధన పోటీ-186

[ఫలితాలు]

జనవరి '84 నెల "అపరాధ పరిశోధన పోటీ—186"కి సరియైన సమాధానాలు:

1. కామన్వెల్తు దేశాధినేతల సభలు.
2. ప్రతిపక్షాలు.
3. పప్పు దినుసులు.
4. ఉల్లిగడ్డ.
5. టెలివిజన్.

పై జవాబుల ప్రకారం ముగ్గురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి ఏప్రెల్ '84 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ ఎస్. లక్ష్మణరావు, మేనేజర్,
పదరన్ ఏజెన్సీస్,
జె. పి. ఎన్. రోడ్,
వరంగల్ - 506 002.

(2) శ్రీ కోనె హరిబాబు,
ఇంటి నెం. 10-1-639 (అప్‌స్టెయిర్స్),
చింతల బస్తీ,
హైదరాబాదు - 500 004.

(3) శ్రీ పి. బసవ పున్నారావు,
c/o. నవభారత్ ఎంటర్‌ప్రైసెస్ లిమిటెడ్,
పోస్టు బాక్సు నెం. 45,
గుంటూరు.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. ఎర్రగులాబి—ప్రతాప రవిశంకర్
16. ఎడిటరు గారూ జాగ్రత్త-పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ
26. మృత్యు భయం— అజీజ్
51. జగమే దొంగల మయం—పి. అరుణ
61. చంపి పుణ్యము కట్టుకోండి—ఎమ్.డి. చైతన్య
68. బంగారపు గొలుసు—చంద్రశేఖర అజాద్
78. ప్రేమలేఖలు—వాణిశ్రీ
86. కరుణించని కరుణ—ఎమ్.వి.వి. సత్యనారాయణ
102. బస్సు దోపిడి—కాశీభట్ట భానుమూర్తి
117. రామ రావణుల స్నేహం—కె.బి.యస్. కుమార్
136. రేపటి వార్త—కృష్ణచైతన్య
153. గుట్టి దర్బారు (సీరియల్)—వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. ముగ్గురు పోటీ—బొమ్మిడి అచ్చారావు
44. మహాప్రస్థానం—పి. చంద్రశేఖర అజాద్
74. చంపకమాల—టెంపోరావ్
112. ఇండియా స్కెలిటన్స్—ప్రతాప రవిశంకర్
157. కళ్యాణ దుర్గం (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

ఎర్ర గులాబి

ప్రతాప రవిశంకర్

S.L.S. BOOK STALL
VJA.6
PATAMATA

సాయంత్రం ఆరు గంటలు దాటుతున్న సమయంలో బీచ్‌లో కారు ఆగింది. అందులోనించి శమంత కిందికి దిగింది—డ్రయివర్ రజాక్ డోర్ తెరచి పట్టుకున్న తర్వాత.

సముద్రం మీదనించి వస్తున్న చల్లని గాలికి ఆమె పమిట తెరచాపలా రెపరెపమని కొట్టుకున్నది.

ఆ రోజు శుక్రవారం - వారానికి రెండు సార్లు సాయంత్రము ఆరుగంటల సమయంలో బీచ్‌కి రావటం శమంతకు అలవాటు. ఈ అలవాటులో ఇంతవరకు మార్పు రాలేదు.

శమంత అందమైనదే కాదు—డిగ్రీవరకు చదువు కున్నది. ఆమె ఓ ఆఫీసరు కూతురు. మరో ఆఫీసరు మనోహరం భార్య. మనోహరం గొప్ప బిజినెస్ మాగ్నెట్ మద్రాసులో—దురదృష్టం ఏమిటంటే మనోహ రంకి పెళ్ళయి ఎనిమిదేళ్ళయినా పిల్లలు పుట్టలేదు.

అప్పటికే బీచ్ రకరకాల మనుషులతో సందడిగా వున్నది.

ఇసుకలో చిన్నగా నడిచి సముద్రానికి చేరువగా వెళ్ళి నిల్చున్నది శమంత.

ఒక్కసారిగా దూసుకు వచ్చిన కెరటం శమంత పాదా లను ముద్దుపెట్టుకుని తిరిగి వెళ్ళిపోయింది.

నవ్వుకున్నది శమంత.

కొంచెం వెనక్కు జరిగి ఇసుకలో కూర్చున్నది.

ఆమెకు కొంచెం దూరంలో వున్న ఒక యువకుడు మరో యువతి ఎదురెదురుగా కూర్చుని చిన్నగా ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు.

శమంతకు పదేళ్ళ క్రితం సంఘటనలు గుర్తుకు వచ్చాయి వాళ్ళని చూస్తూంటే—పదేళ్ళ క్రితం మాధవన్ తనవెంట పడి తిరిగాడు ప్రేమించానంటూ—చివరికి ఓ పంజాబీ అమ్మాయిని పెళ్ళి చేసుకుని యెటో వెళ్ళి పోయాడు.

ఆమె గతం గురించి ఆలోచనలో మునిగిపోయిన తర్వాత క్రమంగా చీకటి పడిపోయింది. అప్పుడు దీపాలు వెలిగాయి.

ఏడు గంటలు దాటింది.

ఆలోచనలవించి తేరుకుని శమంత చేతికున్న వాచీలోకి చూసుకున్నది. ఏడూ ఇరవై ఐదు చూపుతోంది.

ఆమె గబుక్కున లేచి నిల్చుని వెనక్కి తిరిగింది.

కారు దగ్గరకు వచ్చేసరికి డ్రయివర్ రజాక్ సిగరెట్టు కాలుస్తున్నాడు. ఆమెను చూడగానే సిగరెట్టును విసిరి డోర్ తెరిచాడు.

కారులో కూర్చున్నది.

డ్రయివర్ కారును స్టార్టు చెయ్యబోయాడు.

కాని అది స్టార్టు కాలేదు. రెండు నిముషాలు చూసి అతను కారుదిగి బోనెట్ పైకెత్తి లోపలకు చూశాడు.

"ఏమయ్యింది?" అన్నది శమంత.

"కొంచెం రిపేర్ మేడమ్....ఓ అరగంట పడుతుంది."

"అరగంట వెయిట్ చెయ్యాలా....ఐతే నేను టాక్సీలో వెళతాను. నువ్వు తర్వాత వచ్చెయి" అని కార్లోనించి దిగి రెండడుగులు వేసింది.

అక్కడ ఆమెకు ఓ టాక్సీ కనిపించింది. డ్రయివర్ డోర్‌ను ఆనుకుని నిలబడి వున్నాడు.

"టాక్సీ కావాలా అమ్మా" అన్నాడు.

"ఊఁ...." అన్నది శమంత. డ్రయివర్ డోర్ తెరిచాడు. ఆమె కూర్చుని ఎడ్రసు చెప్పింది.

టాక్సీ స్టార్టయి ముందుకు దూకింది.

రద్దీగా వున్నాయి రోడ్లు....రివ్వున దూసుకు పోతున్న వాహనాలు.

శమంత ముందుకు చూస్తోంది.

ఆమె ఆలోచనలు భర్త మనోహరం మీద వున్నాయి. అతను ఎనిమిది గంటలకు ఇంటికి వస్తానని నాలుగు గంటలకు ఫోన్ చేసినప్పుడు చెప్పాడు.

సీటుమీద కొంచెం కదిలింది శమంత. ఆమె చేతికి సీటుమీద ఏదో మెత్తగా తగిలింది. అదేమిటో సులభం

గానే గ్రహించింది శమంత.

గులాబి పువ్వు.

చేతికి తీసుకుని చూసింది. ఎర్ర గులాబి. కొంచెంగా వాడిపోయి వున్నది. దాన్ని ముక్కు దగ్గరగా వుంచుకుని వాసన చూసింది శమంత. ఆమెకు గులాబీలంటే ఎంతో ఇష్టం.

ఎవరో యువతి టాక్సీలోనే మరచిపోయి వుంటుంది ఆ గులాబీని—అనుకున్నది.

వాసన చూసిన రెండు నిముషాలకే శమంత కళ్ళు మూసుకుపోయాయి. స్పృహ తప్పుతున్నట్టుగా అనిపించింది.

"డ్రయివర్" అంటూ ఏదో అనబోయింది. కాని ఆమె చేతిలో ఎర్ర గులాబి జారిపోయి ఆమె స్పృహ లేకుండా సీటుమీదకు జారిపోయింది.

డ్రయివర్ నవ్వుకుని టాక్సీని రోడ్‌కు ఎడమవైపుగా ఇరుకు సందులోకి మళ్ళించాడు.

2

ఉదయం తొమ్మిది గంటలు.

టాక్సీ ఆగింది. అందులోనించి శమంత దిగి ఫేర్ చెల్లించి ముందుకు నడిచింది.

డోర్ తెరుచుకుని లోపలకు వెళ్ళింది. ఎదురుగా రివాల్వింగ్ చెయిర్‌లో కూర్చుని ఓ ఇంగ్లీషు జర్నల్ చదువుతున్న డిటెక్టివ్ చరణ్‌తో "నమస్తే. నా పేరు శమంత. మీ సహాయం కోరి వచ్చాను" అన్నది.

"కూర్చోండి" అన్నాడు చరణ్.

ఆమె అతడి ఎదురుగా కూర్చున్నది.

చరణ్ ఆమెను పరిశీలనగా చూశాడు. ఆమె అందంగా

వున్నది. కాని ఆమె మొహం వాడిపోయి వున్నది.

"చెప్పండి. నేను మీకు ఏ విషయంలో సహాయపడ గలను" అడిగాడు చరణ్ సిగరెట్‌ను యాష్‌ట్రేలో నొక్కుతూ—

శమంత క్రితంరోజు సాయంత్రం తను బీచ్‌కి వెళ్ళి కూర్చున్నది మొదలు ఆ ఎర్రగులాబిని వాసన చూసి స్పృహ కోల్పోవటం వరకు చెప్పింది.

"ఆ తర్వాత ఏం జరిగింది?"

"స్పృహ పోయిన తర్వాత ఏం జరిగిందీ నాకు తెలీదు. మెలకువ వచ్చేసరికి మా ఇంట్లో నా బెడ్ మీద వున్నాను. నా ఎదురుగా వంటమనిషి కనకమ్మ వున్నది. ఎవరో నన్ను టాక్సీలో తీసుకు వచ్చారని టాక్సీలోనే నేను స్పృహతప్పి పడిపోయాననీ—పెద్దగా ప్రమాదం ఏదీ లేదనీ ఓ అరగంటలోనే స్పృహ వస్తుందనీ చెప్పి వెళ్ళిపోయాడుట ఆ మనిషి."

"ఆ మనిషి ఎలా వున్నాడో మీరు కనుక్కున్నారా?"

"ఆ....అడిగాను. గడ్డం బాగా పెరిగి వున్నదిట..... తలమీద ఈవెనింగ్ క్యాప్ పెట్టుకున్నాడుట. డ్రయివర్ యూనిఫాంలో లేడని కాని ఆ కార్లో అతను తప్పించి మరో మనిషి లేడని చెప్పింది కనకమ్మ."

"మీకు స్పృహ వచ్చినప్పుడు టైము యెంతయి వుంటుంది?"

"తొమ్మిది గంటలు."

"అప్పటికి అతను మిమ్మల్ని ఇంట్లో చేర్చి ఎంత సేపయి వుంటుంది?"

"ఇరవై నిమిషాలు....నన్ను అతను టాక్సీలో మా ఇంటికి తీసుకు వచ్చినప్పుడు ఎనిమిదీనలభై అయ్యిందిట.

అప్పుడే కనకమ్మ తైముచూపి లోపల్నించి బయటకు వచ్చిందిట నాకోసం ఎదురుచూస్తూ."

ఒక్క నిమిషం ఆలోచించి "అయితే ఒక గంటసేపట్లో-వాళ్ళు మీకు స్పృహ తప్పించి ఏం చేశారో తెలుసుకోవాలి. అంతేకదూ" అన్నాడు.

"అవును....రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి వస్తానని నాకు ఫోన్ చేసి చెప్పిన ఆయన మళ్ళీ రాత్రి ఏడుగంటలప్పుడు కనకమ్మకు ఫోన్లో తను అర్జంటు పనిమీద ఓ పార్టీతో కలసి కారులో హైద్రాబాద్ వెళుతున్నట్టు రెండ్రోజుల తర్వాత తిరిగి వస్తానని చెప్పాడుట. ఈ విషయం ఆయనకు తెలిస్తే దాని పరిణామం ఎలా వుంటుంది. ఆయన తప్పకుండా నన్ను అనుమానిస్తాడు. ఆ తర్వాత నా జీవితం నరకం అవుతుంది. అసలు ఇదంతా ఎందుకు జరిగింది? ఒక గంట సేపు నాకు స్పృహ తప్పించటంలో వాళ్ళ ఉద్దేశం ఏమిటి? మీరు తెలుసుకోవాలి"

"మీకు స్పృహ వచ్చిన తర్వాత చూసుకుంటే వాళ్ళు మీకు ఏదయినా జరగకూడనిది తలపెట్టినట్టుగా అనిపించిందా?" అడిగాడు చరణ్ మరో సిగరెట్టు వెలిగిస్తూ—

"లేదు. అలాంటిదేమీ జరగలేదని నేను గట్టిగా చెప్పగలను. అంతేకాదు. నా వంటిమీది నగలు కూడా ముట్టుకోలేదు. నా మనీపర్సులో వున్న నూట ఇరవై రూపాయలు అలాగే వున్నాయి. అదే నాకు ఆశ్చర్యంగా వున్నది. నానించి ఏ ప్రయోజనం ఆశించి వాళ్ళు నన్ను స్పృహ తప్పించారు? దయచేసి ఆయన హైద్రాబాద్‌నించి తిరిగి రాకముందే మీరు ఈ విషయంలో పరిశోధన జరపండి. ప్లీజ్. మీ ఫీజు ఎంతయినా సరే నేను ఇచ్చుకుంటాను.

ఇదిగోండి ఎడ్వాన్స్" అంటూ హ్యాండ్ బ్యాగ్ లోనించి రెండువేలు తీసి టేబిల్‌మీద వుంచింది శమంత.

"అధైర్యపడకండి. నేను అంతా తెలుసుకుంటాను. నేనడిగే మరికొన్ని ప్రశ్నలకు మీరు జవాబులు ఇవ్వండి" అన్నాడు.

"అడగండి. చెబుతాను" అన్నది శమంత భారంగా నిట్టూర్చి.

"మీ డ్రయివర్ ఎలాంటి మనిషి? అంటే అతను నమ్మకస్తుడేనా?"

"అతను మూడేళ్ళనించి మా దగ్గర పని చేస్తున్నాడు. ఇంతవరకు అతని గురించి ఎలాంటి రిమార్క్ లేదు....నా దృష్టిలో అతను నమ్మకస్తుడే."

"అతను మీ కారును రిపేర్ చేసుకుని ఎన్ని గంటలకు ఇంటికి తీసుకువచ్చాడు?"

"తొమ్మిదిన్నర దాటింది."

"అతను ఇప్పుడు నా దగ్గరకు రాబోయే ముందు మీకు కనిపించాడా?"

"కనిపించలేదు. ఈరోజు తనకు ఏదో ముఖ్యమైన పని వుందనీ అందువల్ల సెలవు తీసుకుంటున్నట్టుగా తోటమాలి రంగయ్యకు చెప్పి వెళ్ళిపోయాడుట."

"అతడి ఎడ్రసు మీకు తెలుసా?"

"ఆ....వడపళని బస్టాపు దగ్గర్లో వుంటున్నాడుట."

"గుడ్....మీ ఫోన్ నెంబర్—ఎడ్రసు ఇచ్చి మీరు వెళ్ళండి. రాత్రి ఎనిమిదిగంటల లోపున మీకు నేను ఫోన్ చేస్తాను" అన్నాడు డిటెక్టివ్ చరణ్.

అతనికి థాంక్స్ చెప్పి అక్కడినించి బయటకు వెళ్ళింది

శమంత.

శమంత వెళ్ళిన తర్వాత కొంచెం సేపటివరకు ఆమె చెప్పిన విషయాల గురించే ఆలోచిస్తూ వుండిపోయాడు చరణ్.

తర్వాత ఓ నోట్ బుక్ తీసుకుని దాన్లో ఆ కేసుకు సంబంధించిన కొన్ని సందేహాలను వరసగా ఇలా రాసుకున్నాడు.

ఒకటి: బీచ్ వరకు ఎలాంటి ట్రబుల్ లేకుండా వచ్చిన ఎంబాసిడర్ కారు సడన్‌గా ఎందుకు చెడిపోయింది? ఎలా చెడిపోయింది? కారు నిజంగానే చెడిపోయిందా? లేక డ్రయివర్ రజాక్ చెడిపోయినట్టు అబద్ధం చెప్పాడా? ఒక వేళ అబద్ధం చెప్పి వుంటే అతన్ని అలా చెప్పమని ఆదేశించిన వ్యక్తి ఎవరు? ఎవరో రజాక్‌ద్వారా తెలుసుకోగలిగే అవకాశం వుంది.

రెండు: టాక్సీలో వెనుక సీటుమీద వున్న ఎర్ర గులాబిని ఆమె తప్పకుండా వాసన చూస్తుందని ఎలా వూహించగలిగారు? అంటే ఆమె అలవాట్లు అతనికి బాగా తెలుసన్నమాట.

మూడు: నేరస్తులు శమంతకు ఎలాంటి హాని చెయ్యలేదు. ఆమె నగలను దోచుకోలేదు! అందంగా వున్న శమంతను ఏమీ చెయ్యకుండా వదిలేశారు! మరి ఏం ప్రయోజనం ఆశించి ఆమెకు గంటసేపు స్పృహ తప్పించారు.

నాలుగు: శమంతను టాక్సీలో తీసుకువచ్చిన ఆ గడ్డం మనిషి ఎవరు? అతనికి శమంత ఇల్లు ఎలా తెలుసు? ఎలాంటి సంకోచమూ లేకుండా ఇంట్లోకి ఎలా తీసుకు

వచ్చాడు? అతనికి శమంత భర్త ఇంట్లో వుంటే ప్రశ్నలు వేసి వదిలిపెట్టడనే అనుమానం ఎందుకు రాలేదు? స్పృహ తప్పిపోయిన శమంతను ఇంటి బయట వదిలిపోకుండా జాగ్రత్తగా లోపలకు తీసుకువచ్చి వదిలి ఎందుకు వెళ్ళిపోయాడు?

ఈ సందేహా అన్నింటినీ ఒక్కసారి చదువుకున్న తర్వాత ఆ మనిషి లేక మనుషులకు శమంత మీద ప్రేమ వున్నదనీ ఆమెకు అపకారం చెయ్యడం వాళ్ళ ఉద్దేశం కాదని డిటెక్టివ్ చరణ్‌కు అర్థమయ్యింది.

అయితే వాళ్ళు శమంతకు స్పృహ తప్పించి ఏం చేశారు?

తెలుసుకోవాలి. అందుకే ముందుగా చరణ్—రజాక్‌ని కలుసుకోవాలని అనుకున్నాడు.

3

రజాక్ ఇంట్లో లేదని చెప్పింది అతని భార్య.

"ఎక్కడికి వెళ్ళాడు? ఇవాళ డ్యూటీకి వెళ్ళలేదా?" అడిగాడు చరణ్.

"లేదు. ఇవాళ ఉదయమే టాక్సీ డ్రయివర్ ఉస్మాన్ వచ్చి పిలుచుకు వెళ్ళాడు. ఇవాళ డ్యూటీకి వెళ్ళనని చెప్పాడు."

"ఉస్మాన్ ఇల్లు ఎక్కడ?"

ఎడ్రసు చెప్పింది ఆమె—

వెనక్కు తిరిగాడు చరణ్. అతను డ్రయివర్ యూనిఫారంలో వున్నాడు. బయట రోడ్డుమీద ఓ టాక్సీ ఆగి వుంది.

అతను టాక్సీలో ఎక్కి స్టార్టు చేసి ముందుకు దూకిం

చాడు.

పది నిముషాల తర్వాత ఒక రోడ్డులో టాక్సీని ఆపి కిందికి దిగి వరుసగా ఇంటి నెంబర్లు చూసుకుంటూ వెళ్ళి ఒక ఇంటిముందు ఆగి చిన్నగా గేటు నెట్టుకుని లోపలకు వెళ్ళాడు.

ఆ ఇంటి తలుపులు మూసి వున్నాయి.

నిర్మానుష్యంగా వుంది ఆ ప్రాంతమంతా—ఆ వరుస ఇళ్ళలో ఎక్కువగా టాక్సీ డ్రయివర్లే వుంటున్నారు. ఆ సమయంలో ఎవ్వరూ ఇళ్ళలో వుండరు.

తలుపులమీద చిన్నగా చప్పుడు చెయ్యబోయి ఆగి పోయాడు చరణ్.

లోపల్నించి మాటలు వినపడుతున్నాయి. గ్లాసులు కదులుతున్న చప్పుడు వినపడుతోంది.

ఆగిపోయి ఆ మాటలు వింటున్నాడు చరణ్. లోపల వున్న మనుషులెవరో అతడికి తెలిసిపోయింది.

రజాక్—ఉస్మాన్.

ఇద్దరూ మందుకొడుతూ మాట్లాడుకుంటున్నారు.

ఆ సంభాషణంతా అతనికి పూర్తిగా అర్థమయి పోయింది.

ఇంకో గంటలో నేను స్టార్ స్టూడియోకి వెళ్ళాలి" అంటున్నాడు రజాక్.

చరణ్ అక్కడినించి గబగబా టాక్సీ దగ్గరకు వచ్చాడు.

రెండు నిముషాల్లో స్టార్టుచేసి రివ్వున ముందుకు దూకించాడు. ఐదు నిముషాల తర్వాత అతను టాక్సీని స్టార్ ఫోటో స్టుడియో ముందు ఆపి లోపలకు వెళ్ళాడు.

"ఏం కావాలి?" అడిగాడు ప్రొప్రయిటర్.

"నేను రజాక్ ఫ్రెండ్‌ని....రాత్రి మీకు ఇచ్చిన ఫిల్మ్‌ని డెవలప్ చేసి ప్రింటు వేశారా? నన్ను తీసుకు రమ్మన్నాడు" అన్నాడు చరణ్.

"ఆ ఫిల్మా...." అంటూ అదోలా నవ్వి అతను ర్యాక్‌లోనించి ఓ కవరు తీసి చరణ్‌కి ఇచ్చాడు.

"నలభై రూపాయలు ఇవ్వు" అన్నాడు.

చరణ్ నలభై రూపాయలు యిచ్చి కవరుతో బయటకు వచ్చి టాక్సీలో కూర్చున్నాడు.

కూర్చున్న తర్వాత కవర్లో నించి ఫోటోలు బయటకు తీశాడు. అందులో నాలుగు ఫోటోలు వున్నాయి. ఆ నాలుగు ఫోటోల్లోనూ శమంత పూర్తి నగ్నంగా వున్నది. వివిధ భంగిమల్లో-ఐతే నాలుగు ఫోటోల్లోనూ ఆమె నిద్రపోతున్న మనిషిలా వున్నది. నెగెటివ్‌లు కూడా అందులోనే వున్నాయి.

అతను కొంచెం దూరం వెళ్ళి అక్కడి పబ్లిక్ టెలిఫోన్ బూత్‌నించి పోలీసు స్టేషన్‌కి ఫోన్‌చేసి ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్‌తో కొంచెం సేపు మాట్లాడాడు.

తర్వాత అక్కడి నించే శమంతకు ఫోన్ చేశాడు.

"శమంతగారూ నేను డిటెక్టివ్ చరణ్‌ని మాట్లాడుతున్నాను. మీ కేసు పరిశోధన అయిపోయింది. మీరు వెంటనే బయల్దేరి మా ఇంటికి రండి" అని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

* * *

ఆ ఫోటోలను చూడగానే కెవ్వుమన్నది శమంత.

"భయపడకండి. గొప్ప ప్రమాదం తప్పిపోయింది.

రజాక్-ఉస్మాన్ అనే మరో డ్రయివరు కలిపి ఈ ప్లాను వేశారు. ప్లాను ప్రకారం ఎర్ర గులాబితో మీకు స్పృహ తప్పించి మిమ్మల్ని ఉస్మాన్ యింటికి తీసుకువెళ్ళాడు. అక్కడ నగ్నంగా నాలుగు ఫోటోలు తీశాడు ఉస్మాన్.

"మీకు వేరే విధంగా వాళ్ళిద్దరూ అపకారం చెయ్యదల్చుకోలేదు. అలా చేస్తే మీరు పోలీసు కంప్లెయింట్ యిస్తారనీ పోలీసు దర్యాప్తులో వాళ్ళ నేరం బయట పడుతుందనీ భయపడ్డారు. వాళ్ళకు కావలసినంత డబ్బు మీ నగ్న ఫోటోలతో మిమ్మల్ని తర్వాత బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజాలనుకున్నారు. ఇలా స్పృహ తప్పించి ఒక గంట తర్వాత మిమ్మల్ని వదిలిపెడితే మీరు మీ భర్తతో ఏమీ చెప్పుకోరనీ, ఎలాంటి ప్రమాదమూ జరగనందుకు సంతోషపడి వూరుకుంటారనీ వాళ్ళు అనుకున్నారు.

గడ్డం వ్యక్తి వేషంలో మిమ్మల్ని యింటికి చేర్చింది యెవరో కాదు. మీ డ్రయివర్ రజాకే అతను. వాళ్ళిద్దరి మాటల్ని నేను విన్నాను. వస్తూ ఆ ఇద్దర్నీ అరెస్టు చెయ్యమని ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్‌కి ఫోన్‌చేసి వచ్చాను" అన్నాడు డిటెక్టివ్ చరణ్.

"మైగాడ్. రజాక్ యింత దుర్మార్గుడని అనుకోలేదు. చాలా థాంక్స్ చరణ్‌గారూ. నన్నొక బ్లాక్‌మెయిలింగ్ ప్రమాదం నించి రక్షించారు. మిగిలిన మీ ఫీజు యెంతో చెబితే...." అన్నది శమంత కృతజ్ఞతతో.

"ఈ కేసుకు మీ రిచ్చిన రెండు వేలు సరిపోతాయి. నాదో రిక్వెస్టు. ఈ సారి యెక్కడయినా ఎర్ర గులాబి కనబడితే తొందరపడి దాన్ని వాసన చూడకండి" అన్నాడు చరణ్ నవ్వుతూ.

□

ఎడిటరుగారూ జాగ్రత్త!

పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ

మధుమోహన్ కాలుగాలిన పిల్లిలా అటు ఇటు తిరిగి టేబిల్ యెదురుగా కుర్చీలో కూర్చున్నాడు. ఆలోచనల వలన నరాలు చిట్లిపోతాయా అన్నట్లుంది అతని తల పరిస్థితి. మనిషి అసహనంగా వున్నాడు.

ఎదురుగా టేబిల్ మీదనున్న కథల కట్ట అతనిని కది లించలేకపోయింది. ఏ విషయంమీద కూడా దృష్టి నిలవటం లేదు. పదే పదే ఆకాశం రంగు స్కూటర్ గుర్తొస్తున్నది.

క్రితం రోజు ఇంటి దగ్గర వరండాలో పెట్టిన స్కూటర్ ఎలా మాయమైపోయిందో అతనికి అర్థం కాని విషయం.

మధుమోహన్ 'ఆంధ్ర దీపం' వార పత్రికలో సంపా దకుడిగా పని చేస్తున్నాడు. ఇది వరకు ఆ పత్రిక మేనేజి మెంటు వారు ఒక అసమర్థుడ్ని సంపాదకుడిగా వుంచారు. అప్పుడు పత్రిక పాతచింతకాయ పచ్చడిలా పాఠకుల్ని ఏ మాత్రం ఆకట్టుకోకుండా మామూలుగా వుండేది.

మధుమోహన్ వచ్చిన నుండి పత్రిక గెటప్ పూర్తిగా మారిపోయింది. రకరకాల క్రొత్త శీర్షికలను కూడా ప్రవేశ పెట్టాడు. అన్ని వర్గాల పాఠకులను ఆకర్షించటం కోసం అతనెన్నో చిట్కాలను కూడా కనిపెట్టాడు. ఫలితంగా 'ఆంధ్ర దీపం' పత్రిక సంపాదకుడు మారిన తర్వాత సర్క్యులేషన్ కూడా పెరిగింది. అందువలన మేనేజి మెంట్ వారు మధుమోహన్‌ను మెచ్చుకొని జీతం పెంచారు కూడా.

ప్రతిసంవత్సరం కథల పోటీలు నిర్వహించి బహు మతులు యివ్వటం కూడా అతను వచ్చిన దగ్గర నుండీ ఆనవాయితీ అయింది. స్వతహాగా మంచి రచయిత కూడా.

అటువంటి మధుమోహన్ స్కూటర్ క్రితం రోజు యింటి ముందు పార్కు చేసినది - వెనువెంటనే మాయమై పోయింది.

పోయిన స్కూటర్ గురించి వెంటనే పోలీస్ స్టేషన్లో రిపోర్టు యిచ్చాడు. కానీ పోలీసుల సామర్థ్యం మీద అత

నికి నమ్మకం తక్కువ. అందుకే అతను ఏ విషయం మీదా మనస్సును నిలుపలేకపోతున్నాడు కథల పోటీ ఫలితాల తేదీ దగ్గర పడుతున్నది. ఆ విషయమే అతనికి ఆందోళనగా వుంది.

పోయిన స్కూటర్ అంటే అతనికి ఎంతో ప్రాణం. ఆకాశం రంగులో వున్న ఆ స్కూటర్ కొన్న తర్వాతనే అతని అదృష్టం మారింది. కథల పోటీలు నిర్వహించాలన్న ఆలోచన కూడా స్కూటర్ కొన్న తర్వాతనే కలిగింది.

మధుమోహన్ లేచి నిల్చున్నాడు ఎవరైనా వస్తున్నారేమో చూద్దామని. వీధి గుమ్మం వరకూ వెళ్ళి పైకి చూశాడు. ఒక్కసారి కళ్ళు జిగేలుమన్నాయి. తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు.

ఆకాశం రంగులో వున్న స్కూటర్ యింటిముందు నిలబెట్టి వుంది. అతని ఆశ్చర్యానికి అంతులేదు. అరగంట ముందు అక్కడ స్కూటర్ అసలు లేదు. ఎవరో నడిపించుకొని వచ్చి అక్కడ పెట్టేసివుంటారని అనుకొన్నాడు మధుమోహన్.

అతనికి తల వేడంతా తగ్గిపోయింది. సంతోషంతో కేకలు వేస్తూ యింట్లోకి పరుగెత్తాడు.

అతని ఆతృత చూసి అతని భార్య బైటికి వచ్చింది. బయట స్కూటర్ నిలబెట్టి వుండటం చూసి ఆమె కూడా యెంతో ఆనందించింది.

మధుమోహన్ స్కూటర్‌ను సమీపించి ఆత్మీయతతో తడిమి చూశాడు. అనుమానం లేదు. అది అతనిదే. పరిశీలనగా చూస్తున్న అతని దృష్టి స్కూటర్ బేగ్‌కు వున్న కవరు ఆకర్షించింది. ఆతృతగా అందుకుని విప్పాడు.

"శ్రీ మధుమోహన్ గారికి—

నే నెవరో మీకు తెలియదు. కానీ ఒక పత్రికా సంపాదకులుగా మీరు నాకు తెలుసు. మొన్న మా అమ్మ చావు బతుకుల్లో వుంది. ఆ సమయంలో మందుల కోసం బజారుకి వచ్చాను. కావలసిన మందులు కొనడానికి చాలా షాపులు తిరగవలసి వచ్చింది. అందువలన చాలా ఆలస్యమైంది. డాక్టర్ మందులు పట్టుకొని అర్జంటుగా రావాలని చెప్పారు. ఆ సమయంలో నాకు వేరే మార్గం కనిపించలేదు. వస్తుండగా దారిలో మీ యింటిముందు స్కూటర్ కనిపించింది. ఎలాగైనా అమ్మని రక్షించాలన్న తాపత్రయంలో మరేదీ ఆలోచించలేకపోయాను. కీ దానికే వుంది. వెంటనే స్కూటర్ తీసుకొని వెళ్ళిపోయాను.

నేను చేసిన పని తప్పే కావచ్చు. కానీ ఒక నిండు ప్రాణాన్ని రక్షించడానికి ఆ విధంగా చేశాను. మరే దురుద్దేశంతో కాదు. అందుకే స్కూటర్ నిండా పెట్రోలు కొట్టించాను.

మరో విషయం: పి.సి. సర్కారు 'మ్యాజిక్ షో'కు టిక్కెట్లు దొరకక కొట్టుకు చస్తున్నారు. దీనితోపాటు రేపు మీ కోసం నాలుగు టిక్కెట్లు జత చేస్తున్నాను. చూసి ఆనందించండి.

మీకు ఏ విధమైన అసౌకర్యం కల్పించినా క్షమించండి. స్కూటర్ కోసం వెతకవద్దని తిరిగి రిపోర్టు రాయండి. వుంటానండి.

—మీ అజ్ఞాత మిత్రుడు,
భగవాన్"

ఉత్తరం చదువుకొని ఆశ్చర్యంగానూ సంతోషంగానూ నవ్వుకున్నాడు మధుమోహన్. అతని భార్య పిల్లలు కూడా యెంతో ఆనందించారు.

2

మధుమోహన్ టేబిల్ మీద నున్న కథలను చాలా జాగ్రత్తగా చూస్తున్నాడు.

'ఆంధ్ర దీపం' ప్రత్యేక సంచిక ప్రింటింగ్ అయిపో వచ్చింది. మొదటి బహుమతి కథ ప్రచురించాలి. సాధారణ ప్రచురణకు ఎన్నుకొన్న కథల జాబితా కూడా యింకా ప్రచురించాలి.

ఆ రోజు మధ్యాహ్నానికి జాబితా తయారైతే సాయం త్రం ప్రింటింగ్ జరిగిపోతుంది. ఆ మరునాడు పత్రిక కూడా విడుదల అయిపోతుంది.

మధుమోహన్ ప్రథమ బహుమతి కథ ఏమిటో పోటీ పెట్టకముందే నిశ్చయించాడు. రెండవ బహుమతి మూడవ బహుమతీ ఎవరికిస్తే బావుంటుందో కూడా అతనికి తెలుసు. సాధారణ ప్రచురణకు కథల జాబితా అతని మదిలో మెదులుతూనే వుంది.

పత్రిక సంవత్సరానికి ఒకసారి కథల పోటీ పెట్టడం ఐదువేల రూపాయలు బహుమతులు యివ్వాలని నిశ్చ యించటం వలన సంపాదకుడిగా అతని కెంతో ప్రయో జనం వుంది. మారుపేరుతో ప్రతిసారి మొదటి బహుమతి రెండున్నరవేలు అతని కథకే లభిస్తుంది.

మధుమోహన్ బహుమతులు పొందిన వారి పేర్లు, సాధారణ ప్రచురణలో ఎన్నిక చేసిన 107 కథల జాబితా, రెండూ తయారు చేశాడు.

పత్రికాఫీసుకు ఫోను చేసి యెవరినైనా పంపమని అడి

గాడు. ఆఫీసు నుండి బాయ్ వస్తే అతనికి జాబితా కాగితం అందించాడు. ఆ కథలను వరుస మీద బీరువాలో పెట్టాడు.

కథల పోటీ పెట్టిన ప్రతిసారీ సుమారు వంద కథలను ఎంపిక చేసి సంవత్సరం అంతా ప్రచురిస్తారు. ముందుగా లిస్టు ప్రచురించి, ఆ తర్వాత కథలు వరుసగా ప్రచురిస్తారు.

కథల జాబితా పంపించిన తర్వాత మధుమోహన్ హాయిగా గాలి పీల్చుకున్నాడు. ఈ సంవత్సరం కథలపోటీ సందర్భంగా ఇంట్లో విలువైన వస్తువు ఏదైనా కొనాలని అతని ఆలోచన. కథల పోటీ ప్రారంభించిన ప్రతి సంవత్సరం యింట్లోకి ఏదో ఒక విలువైన వస్తువును కొంటూనే వున్నాడు.

3

'ఆంధ్ర దీపం' ప్రత్యేక సంచిక విడుదల అయింది.

మధుమోహన్ ఉదయం అందిన పత్రిక కాపీని చూశాడు. అందులో కథల పోటీలో బహుమతి పొందిన కథల వివరాలు, సాధారణ ప్రచురణకు ఎన్నుకొన్న కథల జాబితా వున్నాయి.

వాటిని చదివి మధుమోహన్ తృప్తిగా నవ్వుకున్నాడు. ఆ కథలు వచ్చేవారం నుండే వరుసగా ప్రారంభం అవుతాయి. తన దగ్గర వున్న ఆ కథలను రేపు ఆఫీసుకు వెళ్ళేటప్పుడు తీసుకువెళ్ళా లనుకున్నాడు.

సాయంత్రం—

"ఏమండీ! మీరు మ్యాజిక్ షో సంగతి మర్చిపోయినట్లున్నారు!" అంది అతని భార్య.

మధుమోహన్‌కి అప్పుడు గుర్తుకొచ్చింది. అజ్ఞాత మిత్రుడు టిక్కెట్లు యిచ్చిన సంగతి.

"అవునవును. ఈ రోజే కదూ! అయితే తొందరగా రెడీ కా" అన్నాడు.

"నాన్నా నేను రెడే" బాబు.

"నేనూను...." పాప.

మరో పావుగంటకు అతని శ్రీమతి కూడా తయారై వచ్చింది. నలుగురు కలిపి పి.సి. సర్కారు మ్యాజిక్ షోకు బయలుదేరారు.

హాలు ముందు చాలా మంది జనం వున్నారు. అలాంటి ప్రపంచ ప్రఖ్యాత మ్యాజిక్ షోకు టిక్కెట్లు సంపాదించి పెట్టిన 'భగవాన్'కి మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకొన్నారు.

ఆనందంగా షో చూశారు.

4

రాత్రి పది గంట లయింది ఇంటికి వచ్చేసరికి.

అందరూ ఎంతో సంతృప్తి చెందారు.

ఆ మరునాడు—

ఉదయం ఆఫీసుకు వెళ్ళడానికి తయారైనాడు మధు మోహన్. ఆ రోజు కథల పోటీ లిస్టులో ప్రకటించిన 107 కథలను ఆఫీసులో ఇచ్చేద్దామనుకున్నాడు.

బీరువా తీశాడు కథల కోసం.

అంతే! స్టన్ అయిపోయాడు.

నిన్న రాత్రి వరుస మీద పెట్టి బీరువాలో దాచిన ఎన్నికైన కథలు కనిపించలేదు. అతను గాబరా ఎత్తిపోయాడు. భార్యను కేకేశాడు. ఆమె ఆతృతగా వచ్చి విషయాన్ని తెల్సుకొంది.

ఇల్లంతా అణువణువు గాలించారు.

అయినా కనిపించలేదు.

మధుమోహన్‌కి కళ్ళు బైర్లు కమ్మినట్లయింది. తన ఆ పత్రికన్నా ఎక్కువైన కథలు ఏమైనట్లు? ఆ కథలు ఎన్నిక అయినట్లు పత్రికలో జాబితా కూడా ప్రకటించారే. ఇప్పుడు ఏం చేయాలి?

ఆలోచనలతో తల పగిలిపోతుంది.

సరిగ్గా అప్పుడు కనిపించింది—టేబిల్ మీద వున్న కవరు.

ఆతృతగా అందుకొని విప్పాడు మధుమోహన్.

"ఆంధ్రదీపం సంపాదకులు
మధుమోహన్ గార్కి—

నేను గుర్తున్నానా?

మీ స్కూటర్‌ను తీసుకు వెళ్ళి మీకు మ్యాజిక్ షో టిక్కెట్లు అందించిన అజ్ఞాత మిత్రుడు భగవాన్‌ని. తెలుగు దేశంలో వర్ధమాన రచయితలు మిమ్మల్ని ఎంతలా గుర్తుంచుకొంటారో, మీరు కూడా నన్నంతలా గుర్తుంచు కొంటారని అనుకొంటాను.

ఎందుకంటే—

మీకు బాధ కలిగే పనిని నేను చేశాను.

'ఆంధ్ర దీపం' యువ రచయితలకు ప్రోత్సాహం అందించటం లేదు. ఎప్పుడూ ప్రముఖుల రచనలే ప్రచురిస్తూ యువతకు ఎంతో అన్యాయాన్ని చేస్తున్నది మీ పత్రికలో క్రొత్త వారి రచనలకు స్థానం వుండటంలేదు.

మీ సంగతి నాకు బాగా తెలుసు.

మీరు నిర్వహిస్తున్న కథల పోటీలు యెలాంటివో ప్రథమ బహుమతి కథ మీదేనని, ఇతర బహుమతులలో కూడా మీరు సగం పారితోషికం ఆ రచయితల నుండి తీసుకోవటం నాకు తెలుసు.

మిమ్మల్ని కలుసుకొని మీకు డబ్బు చెల్లించుకొంటే కథ యెలా వున్నా ఎన్నిక చేస్తుంటారు. మిమ్మల్ని బార్ లకు త్రిప్పి బహుమతులు కొట్టేస్తున్న ఘనుల గురించి కూడా నాకు తెలుసు.

మీ పత్రికలో సామర్థ్యానికి ప్రాధాన్యత లేదు. బంధు ప్రీతి, ఆశ్రిత పక్షపాతం మీలో ఎక్కువ. మీలాంటి కొంత మంది పత్రికా సంపాదకుల వలననే యువ, వర్ధమాన రచయితలు ఎంత సామర్థ్యం వున్నా పైకి రాలేక పోతున్నారు.

నేను వర్ధమాన రచయితను.

ప్రస్తుతం నా పేరు మీకు అనవసరం. కానీ నా కథలు అన్నీ మీ పత్రిక నిరాకరించింది. నేను కథలు బాగా రాయ గలననే నమ్మకం వుంది. మీ పత్రికలో తిరస్కరింపబడిన ప్రతి కథా మిగతా పత్రికలలో ప్రచురింపబడి ఎంతో మంది మెప్పును కూడా పొందాయి.

యువ రచయితల గొంతు నులిమే నిరంకుశ వైఖరి మీలో యింతలా వుంది గాబట్టి, మీకు యువ రచయితల తరఫున నేను విధిస్తున్న శిక్ష ఏమిటో తెలుసునా?

మీరు ఎన్నిక చేసిన 107 కథలను పథకం ప్రకారం తస్కరించాను. ఇప్పుడు మీ పరిస్థితి పగవాడికి కూడా వద్దన్నట్లుంది కదూ?

మీకు అలాంటి శిక్ష కావలసిందే!

కథల జాబితా ప్రచురించిన తర్వాత ఆ కథలను తప్పకుండా ప్రచురించాలి. అందుకు మీరు రచయితలందరికీ సంజాయిషీ యిచ్చుకోవాలి.

ఈ కథలు పోవటం వలన మేనేజిమెంటు వారు మిమ్మల్ని వుద్యోగంలో నుండి తొలగించవచ్చు. మేనేజి

మెంట్ వారు మిమ్మల్ని తొలగించలేదనుకొంటే - మీరు వారికి క్షమాపణలు అయినా చెప్పుకోవాలి. అలాంటప్పుడైనా మీలో మార్పు వస్తుందని, మెరిట్‌ని బట్టే ప్రోత్సాహం అందిస్తారని ఆశిస్తున్నాను.

నా సంగతి తెల్సుకొందామని ప్రయత్నించవద్దు. ఈ ఉత్తరాలు కలం పేరుతో రాశాను. నా రైటింగ్ పోల్చుకుందామనుకుంటారా? అందుకే ఈ ఉత్తరం టైపు చేయించాను.

ఆంధ్ర దీపం ఎడిటరూ జాగ్రత్త!

—భగవాన్"

ఆ ఉత్తరం చదివి కూలబడి పోయాడు మధుమోహన్. □

'బ్రా' దొంగ!



సిగరెట్ ఆఖరి దమ్ము లాగి, ఆ ముక్కను చెక్కనేలపై వత్తి, లేచి నిలుచున్నాడు దశరథ్! పొడవాటి ఆ కింగ్ సైజు పిగరెట్ పొగ తనివితీరా పీల్చడంవల్ల ఇప్పుడు శరీరంలో రవంత వెచ్చదనం వుత్పత్తి అయినట్టు స్ఫురిస్తోంది.

అందుకే ఆ మాత్రం లేచి నిల్చోడానికి సాహసించ గలిగాడు. ఆ భయంకర చలికి పీల్చుకుంటున్న వూపిరి

కూడా లోపల గడ్డ కడుతోందేమో అన్న భ్రాంతి కలిగింది అంతసేపూ. ఒంటిమీద లావుపాటి స్నోకోటూ, తలనీ, చెవుల్నీ, మెడనూ కప్పివేసే ఊలుటోపీ పెట్టుకున్నా, చేతులకు గ్లవుస్, కాళ్ళకు గమ్‌బూట్స్ తొడుక్కున్నా అవేవీ ఆ చలిని తట్టుకోలేకపోతున్నాయి.

చుట్టూ దూర దూరం వరకూ తెల్లగా పడుచున్న మంచు దిబ్బలు, చెట్ల ఆకులు కదిలినా స్పష్టంగా వినిపించే పైశాచిక నిశ్శబ్దం! కనుచూపు మేర వరకూ మానవ మాత్రుడు కానరాని నిర్మానుష్యం! ఇటువంటి పరిస్థితి దాపురిస్తుందని ఏమాత్రం తెలిసి వున్నా జన్మలో ఈ వైపు ప్రయాణమయ్యేవాడు కాదు.

అదృష్టవశాత్తూ మార్గం మధ్య ఈ ఒంటి గది చెక్క కుటీరం కనిపించినందుకు సరిపోయింది. లేకుంటే, మంచులోపడి ఇంకాస్త ముందుకు వెళ్ళి వుంటే ఈపాటికి తన శరీరం కర్రలా బిగుసుకుపోయి, కొద్ది గంటల్లోనే మంచుపొరల్లో పాతుకుపోయేది!

ఎప్పుడో, ఎవరో ఈ చెక్క ఇంట్లో నివసించి వుంటారు. లేదా ఇక్కడ వాతావరణం ఈ సీజన్‌లో ఇలా దుర్భరమౌతుందని తెలిసి, ముందే మరోచోటికి తరలిపోయుంటారు ఏది ఏమయినా ఈ చెక్క గది సమయానికి తనని ఆపద్బాంధవిలా ఆదుకుంది.

దేశంలోని పోలీసులంతా వేట కుక్కల్లా తన కోసం గాలించకుంటే ఈ అనూహ్య పరిస్థితుల్లో యిరుక్కునే వాడా తను? విట్టూర్చాడు దశరథ్! జాతీయస్థాయిలో పేరు మోపిన కిరాయి హంతకుడు తను.

కోరిన డబ్బు చెల్లించి, చంపాల్సిన మనిషిని చూపితే చాలు, ఇహ ఆ మనిషికి ఈ లోకంలో నూకలు చెల్లి

పోయినట్టే. అలా ఎంతమందిని చంపాడో అతనికే సరిగ్గా లెక్క తెలియదు.

ఎన్నికల సమయాలు ఆసన్నమైనప్పుడూ, ప్రత్యర్థి పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడూ, రాజకీయ నాయకులు కూడా తరుచూ అతని సేవలు స్వీకరించి సముచితంగా అతన్ని సత్కరిస్తూ పోలీసులపాలుబడకుండా కాపాడు తుండేవారు.

ఫలానా నగరంలో మత కల్లోలాలుగానీ, దొమ్మీలు గానీ జరిపించాలంటే, అతనే వారిపాలిటి ఆత్మబంధువు. అలాటి సందర్భాల్లో అతను తనతోబాటు మరికొంత మంది కిరాయి హంతకుల్ని కూడగట్టుకుని, అమాయకులనూ, తమతో ఏమాత్రం సంబంధం లేని అనామకులనూ కత్తి పోట్లకు గురిచేసి కల్లోలాలు సృష్టించి, కాగితాల కట్టలు కైవశం చేసుకునేవాడు.

భగవంతుడు సృష్టించిన ప్రాణపూరిత మనుషులకన్నా మనుషులు సృష్టించిన ఆ ప్రాణంలేని కాగితాలే అతనికి పరమప్రియంగా తోచేవి. ఏది మాత్రం ఎన్నాళ్ళు సాగుతుంది?

రాజకీయ నాయకులకూ, గుంట నక్కలకూ పెద్దగా తేడా వుండదనీ, సమయం వస్తే ఊసరవెల్లులకన్నా రెండుమూడు రంగులు ఎక్కువే మార్చగలరనీ పాపం అప్పుడతను వూహించలేకపోయాడు.

ప్రజల పోరూ, పత్రికలపోరూ పడలేక పోలీసు బలగమంతా ఏకమై ఎప్పుడైతే అతనికోసం గాలింపు చర్యలు ప్రారంభించారో, ఏ నాయకుడూ అతన్ని కాపాడటానిగ్గానీ, తమ పంచన ఆశ్రయమివ్వడానికిగ్గానీ సమ్మతించలేదు.

అప్పుడు తెలిసి వచ్చిందతనికి ఈ లోకంలో తను

ఎంతగా ఏకాకి అయ్యాడో! పోలీసుల కళ్ళల్లో దుమ్ము కొడుతూ ఎంతకాలం ఎక్కడని తిరగ గలడు? పైగా అతని ఆచూకీ తెలిపినవారికి పెద్ద మొత్తంలో బహుమతులు కూడా ప్రకటింపబడ్డాయి. దాంతో ప్రజలు కూడా పోలీసులకు తోడయ్యారు.

అప్పుడు తోచిం దతనికా పథకం! ఈ దేశంలో యిక తాను బ్రతికి బట్టకట్టే సూచనలు రోజు రోజుకూ సన్నగిల్లుతున్నాయి. ఏదైనా ఇతరదేశం పారిపోతే! ఎలా! దానికి పాస్‌పోర్టు కావాలి. వీసా కావాలి. విమానం ఎక్కుతూ నలుగురి కంట బడాలి.

ఆ తరువాత కటకటాల వెనక్కి వెళ్ళి, ఆ పిదప వురికంబం ఎక్కాలి. ఆ లంపటాలేవీ లేకుండా తిన్నగా కాలి నడకన దేశం సరిహద్దులు దాటి, పొరుగుదేశం చేరి అక్కడా బ్రతుకుభారమైతే మరోదేశం వుడాయించవచ్చు.

ఐదు దేశాలతో మనకు భూ సరిహద్దు లున్నాయి. చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్. భూటాన్! మొదటి రెండు దేశాలతో మొదటి నించీ మనకున్న వైరం దృష్ట్యా అటువెళ్ళడం కొరివితో తలగోక్కున్నట్టే.

ఈ మధ్య నేపాల్‌తోనూ, బంగ్లాదేశ్‌తోనూ మన సంబంధాలు అంత బాగాలేవు. ఇక మిగిలిందల్లా భూటాన్ ఒక్కటే? ఆ దేశంతో మనకు మంచి మైత్రీ సంబంధా లున్నాయి. అది కొండలూ కోనలతో నిండిన బాగా వెనకపడ్డ దేశం గనక అక్కడి పోలీసులుగానీ, సైనికులుగానీ తనబోటి అనామకుడ్ని అంతగా పట్టించుకోరు.

కారణం అక్కడి నిర్మాణ కార్యక్రమాల్లో ఎంతో మంది విదేశీయులు, ముఖ్యంగా భారతీయులు చాలామంది నివసిస్తున్నారు. ఈ ఆలోచన రాగానే భూటాన్ గురించి

సమగ్ర సమాచారం సేకరించి, ప్రయాణాని కవసరమైన డబ్బుతో రైలెక్కి తిన్నగా అస్సాం జేరాడు దశరథ్.

రంగాప్య స్టేషన్‌లో రైలు దిగి, చలిని తట్టుకునే స్నో క్లోతింగ్, స్లీపింగ్ బ్యాగ్, మార్గం చూడకోడానికి మ్యాపూ, దారి తప్పకుండా దిక్సూచీ, ప్రమాదాలు ఎదుర్కోడానికి ఓ ఆటోమేటిక్ పిస్టల్, కావలసిన తినుబండారాలూ కొని, అవన్నీ ఓ నైలాన్ బ్యాగ్‌లో నింపుకుని ప్రారంభించాడు ప్రయాణం.

క్వాంగ్‌టాయ్ కొండలు దాటాక మొదలైంది మంచు కురవడం. భూటాన్ సరిహద్దు ఇంకా నలభై మైళ్ళుందనగా దూర దూరంవరకూ నేలపై టన్నులకొద్దీ తెల్లని దూది పరచినట్టు పేరుకుపోయింది మంచు.

అప్పుడు కనిపించిందతనికి ఆ మంచు మైదానం మధ్య ఏకాకిగా నిల్చున్న ఆ చెక్క కుటీరం! ఎంతో ప్రయాసపై అక్కడికి జేరి, కుటీరంలో దూరి తలుపు మూసుకున్నాడు. ఆ నిశ్శబ్ద వాతావరణంలో హఠాత్తుగా ఎక్కడో, ఏదో అరుపు వినిపించినట్టయి దశరథ్ ఆలోచనలు చెదిరిపోయాయి.

చెవులు రిక్కించి ఆ అరుపేమిటో వినడానికి ప్రయత్నించాడు.

"రక్షించండి... కాపాడండి....ప్లీజ్! నూతిలోంచి పలికినట్టు లీలగా మళ్ళీ వినిపించాయి కేకలు.

ఆశ్చర్యంతో నెమ్మదిగా కిటికీ వైపు కదిలాడు దశరథ్. మూసి వున్న కిటికీ రెక్కలు కొద్దిగా తెరిచిచూశాడు బైటికి. వెంటనే ఏమీ కనిపించలేదు. కనుచూపు మేర ఎటు చూసినా మంచే కానవస్తోంది.

దూరాన అక్కడక్కడా ఒక్కటీ అరా నింగిని

చుంబిస్తూ నిటారుగా ఎదిగి వున్నాయి యూకలిప్టస్ చెట్లు. వాటి ఆకులమీద కూడా మంచు దట్టంగా పేరుకునుంది.

"హెల్ప్.... హెల్ప్ ప్లీజ్...." మళ్ళీ వినిపించింది గావుకేక.

అప్పుడు కనిపించింది దశరథ్‌కు దూరాన ఓ ఆకారం! మానవాకారం!! మంచులో పడి ఇటే పాకుతూ వస్తున్న సజీవాకారం! అందుకే అతన్ని వెంటనే చూడలేక పోయాడు తను. నిర్జన ప్రదేశంలో ఇల్లు కనిపించేసరికి సహాయం కోసం అరుస్తున్నాడు.

ఏకాంతంలో ఒకరు ఇద్దరయితే కొండంత ధైర్యం పుట్టుకొస్తుంది. ఆనందం, ఉత్సాహం కట్టలు తెంచుకోగా ఒక్క వుదుటున తలుపువైపు నడిచాడు దశరథ్. తలుపును సమీపించగానే జాగ్రత్త అతని కాళ్ళకు సంకెళ్ళు వేసింది.

ఆ వ్యక్తి ఎవరు? అపరిచితులమీద అనవసరంగా జాలిపడితే లేనిపోని లంపలాటం చుట్టుకోదు కదా? అతను భారత సరిహద్దుల్లో గస్తీ తిరిగే బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ జవాను కూడా కావచ్చు. లేదా, సైనిక జవాను కూడా కావచ్చు. గస్తీ తిరుగుతూ దారితప్పి ఇటు వచ్చాడేమో!

అనుకుంటూ తిరిగి కిటికీని సమీపించి, ఆ వ్యక్తి వయిపు పరీక్షగా చూశాడు దశరథ్. ఇప్పుడతను కుటీరానికి ఫర్లాంగు దూరంలో వున్న యూకలిప్టస్ చెట్టు దగ్గరికి పాకి చేతులతో పట్టుకొని, లేచి నిలబడడానికి ప్రయత్నిస్తున్నాడు.

నీరసం వల్లో, అశక్తతవల్లో అతని ప్రయత్నం ఫలించ లేదు. అలాగే బోర్లా పడుకుని ఆయాసపడుతూ ఆశగా

ఇటే చూస్తున్నాడు. బహుశా ఇప్పుడతని ఒంట్లో సహాయం కోసం అరిచే శక్తి కూడా అడుగంటి వుంటుంది.

తన అనుమానం నిజం కాదు. అతని దుస్తులు బార్డర్ సెక్యూరిటీఫోర్స్ జవానుల్లా లేవు. కళ్ళకు స్నోగాగుల్స్ గానీ, చేతిలో తుపాకీగానీ లేవు. మరి ఎవరితను? తనలా కష్టాల్లో కూరుకున్న బాటసారా? బాటసారైతే అతని వీపు మీదగానీ, చేతుల్లోగానీ యెటువంటి సామానూ లేదే?

కావలసిన తిండి పదార్థాలు వెంట తెచ్చుకోకుండా ఈ మంచు మైదానాల వైపు ప్రయాణ మయ్యేవాడు పరమ పామరుడే! ఇప్పుడు తనవద్ద మిగిలిన తినుబండారాలు తనకే సరిగ్గా సరిపోతాయో లేదో! అలాంటప్పుడు మూలిగే నక్క నెత్తిన తాటికాయ పడ్డట్టు అతని భారం కూడా తన మీద వేసుకోడం దేనికి?

ఆలోచిస్తూ అతన్ని పరీక్షగా చూశాడు దశరథ్. అతను తొడుక్కున్న స్నోకోటు చాలా ఎత్తుగా వుబ్బి వున్నట్లు కనిపిస్తోంది. ఆ కోటులోపల ఏవైనా వస్తువులు దాచు కున్నాడా? ఒకసారి వెళ్ళి చూస్తే నష్టం ఏమిటి? అను కుంటూ తలుపు తెరిచి బైట అడుగు పెట్టాడు.

దశరథ్‌ని చూడగానే ఆ వ్యక్తి మొహం వికసించింది. ఏదో అన్నాడు పెదాలు కదలడం తప్ప శబ్దం బైటికి రాలేదు. గబ గబ నడుస్తూ అతన్ని సమీపించాడు దశరథ్.

"హమ్మయ్య.... బ్రతికిపోయాను.... రెండు రోజు ల్నుంచీ నేను మంచినీళ్ళు కూడా తాగలేదు....తినడాని కేమైనా వుంటే....యివ్వండి....కోరినంత....డబ్బిస్తాను" అనగలిగాడా వ్యక్తి అతి కష్టం మీద హిందీలో.

డబ్బు మాట వినగానే దశరథ్ కళ్ళు తళతళమన్నాయి.

తనవద్ద వున్న డబ్బంతా కావలసిన సరుకులు కొనడానికే సరిపోయింది. చేతిలో చిల్లి కానీ లేకుండా బయలుదేరాడు సరిహద్దు వైపు.

ఒకవేళ డబ్బు మిగిలినా అది చిత్తుకాగితాల మూల్యం కూడా చేసేది కాదు. కారణం. భూటాన్‌లో భారత కరెన్సీ ఎలా చెల్లుతుంది? దశరథ్ పలకలేదు. అరనిమిషం అతన్ని పరీక్షగా చూసి, చంకల్లో చేతులు పెట్టి అతి కష్టం మీద భుజాన వేసుకుని బయలుదేరాడు కుటీరం వైపు.

లోనికెళ్ళి అతన్ని కింద పడుకోబెట్టి "ఎవరు నువ్వు? ఎక్కడి వరకూ ప్రయాణం?" అడిగాడు.

జవాబు లేదు.

"నిన్నే?" రెట్టించాడు.

అంతకీ అతను పలకలేదు. కళ్ళు తెరిచి చూడలేదు.

అనుమానం వచ్చి, తల అటూ ఇటూ తిప్పి చూశాడు దశరథ్.

అప్పుడు తెలిసింది ఆ వ్యక్తి మూర్ఛపోయాడని, వూపిరి మాత్రం ఆడుతూనే వుంది. ఆలస్యం చేయకుండా అతని కోటు తడిమి చూశాడు దశరథ్. లోపల నడుంకి ఏదో కట్టుకున్నట్టు తోచి, కోటు జిప్‌లాగి చూశాడు.

నిజంగానే అతని నడుంకి రెండు తోలు సంచీలు కట్టి వున్నాయి. వాటని వూడలాగి విప్పి చూశాడు. అంతే! జగేల్ మన్నాయి దశరథ్ కళ్లు! సంచీల నిండా బంగారం బిస్కెట్లు!! చేత్తో తూకం వేసి చూశాడు. ఒక్క సంచీ సుమారు ఐదుపౌండ్ల బరువుంది. అంటే మొత్తం పది పౌండ్ల బంగారం.

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో దాని ధర పది

వేల డాలర్లు? దశరథ్ గుండె దడదడ కొట్టుకోసాగింది ఉద్వేగంతో. చేతిలో చిల్లికానీ లేకుండా భూటాన్ వెళ్ళి ఏం చెయ్యాలా అని చింతిస్తున్న తనని వూహించనివిధంగా వెదుక్కుంటూ వచ్చింది ధనలక్ష్మి.

అంటే అదృష్ట దేవత అండ నిండుగా తనపైన వుందన్న మాట! అప్పు డర్థమైంది దశరథ్‌కు ఆ వ్యక్తి ఎవ్వరో స్మగ్లర్! దొంగ బంగారంతో దేశ సరిహద్దులు దాటడానికి బయలుదేరి వుంటాడు.

ఐతే విధి అతని బ్రతుక్కి ఇక్కడే ఫుల్‌స్టాప్ పెట్టినట్టుంది. అందుకే తన కంట పడ్డాడు. అనుకుంటూ ఇంకేమైనా దొరుకుతాయేమోనని గబ గబ అతని జేబులన్నీ చూశాడు. ఓ మడతకత్తి, ఓ పర్సు, ఓ సిగరెట్ కేస్ తప్ప మరేమీ లేవు.

వాటిని తన బ్యాగ్‌లో పడేసుకుని, తిరిగి అతన్ని భుజాన ఎత్తి బైటికి తీసికెళ్ళాడు. ఓ చోట కుదేసి, గ్లవుస్ తొడిగిన చేతులతో మంచు తవ్వడం ప్రారంభించాడు. ఆ ప్రక్రియద్వారా ఒంట్లో కాస్త వెచ్చదనం పుడుతున్నట్లు తోచింది.

అరగంటలోగా పెద్ద గొయ్యి తవ్వగలిగాడు. ఆగోతిలో ఆ అనామకుడ్ని తోసి, గబగబ తిరిగి మంచుతో గొయ్యి పూడ్చేశాడు. సహాయం అర్థిస్తూ వచ్చిన పుణ్యానికి ఆ విధంగా మంచులో సజీవ సమాధి అయ్యాడా అదృష్ట జాతకుడు.

ఇక ఆలస్యం చేయకూడదు, తిరిగి ప్రయాణం ప్రారంభించాలి. అనుకుంటూ కుటీరంలోకి నడిచి, మూల వున్న బ్యాగ్‌ను తీసుకుని తగిలించుకుని సరిహద్దువయిపు నడక ప్రారంభించాడు దశరథ్.

2

అనుకోని విధంగా తన డబ్బు సమస్య పరిష్కార మయినందుకు చెప్పలేని హుషారుగా వుందతనికి. ఆ హుషారులో చలిబాధ మర్చిపోడానికి ఈల వెయ్యసాగాడు. త్వర త్వరగా నడిస్తే ఒళ్ళు వెచ్చగానే వుంటుంది. కాని దానివల్ల ఆకలి వుధృత మౌతుంది.

తనవద్ద వున్న తినుబండారాలు కొద్దిసాటే! భూటాన్ సరిహద్దువద్ద బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌వాళ్ళకు చక్మా ఇవ్వడం పెద్ద కష్టం కాదు. ఈ చలిలో వాళ్ళెక్కడో తప్ప తాగి ఒదిగి వుంటారు.

మ్యాపు ప్రకారం ఆ సరిహద్దు దాటి కొన్ని మైళ్ళు నడిస్తే పుంట్ షోలింగ్ అనే నగరం వస్తుంది. అక్క ణ్ణించి భూటాన్ రాజధాని థింపూ చేరడం పెద్ద కష్టంకాదు. అక్కడ ఆ బంగారాన్ని జాగ్రత్తగా డబ్బు చేసుకుంటే ఇక తన బ్రతుకంతా బంగారమే!

ఆలోచిస్తూ చేతిగడియారం చూసుకున్నాడు. ఉదయం పదిన్నర! చీకటి పడేలోపల సగం దూరానికి పైగా దాట వచ్చు. దూరతీరాలవరకూ తెల్లని మంచు తప్ప ప్రాణి వునికి కూడా కానరావడంలేదు. ఆ భీకర నిశ్శబ్దంలో అతని అడుగులు చేసే "షిప్, షిప్" శబ్దం చాలా స్పష్టంగా వినిపిస్తోంది.

అలా మూడుమైళ్ళు నడిచాక, హఠాత్తుగా ఆగిపోయాడు దశరథ్. అతని చెవులు అప్రయత్నంగా నిక్కబొడుచు కున్నాయి. చటుక్కున వెనుదిరిగి చూశాడు. ఎవ్వరూ లేరు! మరి తనకు వినిపించిన శబ్దం ఏమిటి? ఎవ్వరో తన వెనకే వస్తూన్నట్టూ, తనని వెంబడిస్తున్నట్టూ....

భ్రమించాడా? అనుకుంటూ తిరిగి ముందుకు నడిచాడు.

ఐనా, అతని అంతరాత్మ అది భ్రమ కాదనీ, నిజంగానే తనను ఎవ్వరో వెంబడిస్తున్నారనీ హెచ్చరిస్తూనే వుంది. అందుకే, మధ్య మధ్య ఆగుతూ చటుక్కున వెనుదిరిగి చూస్తున్నాడు. ఎక్కడా ఏమీ కనిపించడంలేదు.

అప్పుడు స్ఫురణకు వచ్చిందతనికి, అంత క్రితం తాను ఓ మనిషిని మంచులో సజీవ సమాధి చేసిన సంగతి. ఈ పాటికి అతనికి శ్వాస ఆగిపోయి వుంటుంది. కొంపదీసి అతని ప్రేతాత్మ ప్రతీకారం కోసం తనని వెంబడించడం లేదు కదా?

ఆ ఆలోచన రాగానే నవ్వుకున్నాడు దశరథ్. తన జీవితంలో ఇది తొలి హత్య కాదు. ఇంతవరకు ఎందరో్ని నిర్దయగా చంపేశాడు. ఆ లెక్కన అనేక ప్రేతాత్మలు అనుక్షణం తనని వెంబడించాలి మరి. అదే నిజమైతే ఇంత వరకూ తను ఎలా బ్రతికున్నాడు?

అనుకుంటూ ముందుకు సాగుతున్నవాడల్లా చటుక్కున ఆగి మళ్ళీ వెనుదిరిగి చూశాడు. సందేహం లేదు. ఎవ్వరో తనని వెంబడిస్తున్నారు. కాని ఎవ్వరూ కనిపించడంలేదు. అది ఎంతవరకు నిజమో తెలుసుకునేవరకూ తన మనసుకు నెమ్మది వుండదు. ప్రయాణం సాఫీగా కొనసాగదు.

ఆలోచిస్తూ చుట్టూ కలయజూశాడు. కొద్ది దూరంలో నాలుగైదు యూకలిప్టస్ చెట్ల గుబురుంది. అటు దౌడు తీశాడు దశరథ్. ఆ గుబురు మాటున నక్కి, అంతకు ముందు తను నడిచిన మార్గంమీద కన్నేసి వుంచాడు.

పదిహేను నిమిషాలు గడిచినా ఏమీ కనిపించలేదు. అనవసరంగా అలా కూర్చుంటే శరీరంలోని వేడి తగ్గి, రక్తం గడ్డకట్టవచ్చు అనుకుంటూ లేవబోయి చటుక్కున ఆగిపోయాడు. అప్పుడు కనిపించిందతనికి ఆ వెంటాడిన

ప్రాణి.

తోడేలు! మంచు తోడేలు!!

ఎత్తుగా, బలిష్టంగా, ఒళ్ళంతా తెల్లని జూలుతో, మొన దేలిన పళ్ళ మధ్య నించి పొడవాటి నాలిక బయటికి చాపుతూ ఇటే వస్తోంది. ఆ తెల్లని జూలువలనే మంచులో అంత సేపూ దాన్ని గుర్తించలేకపోయాడు తను. తన అనుమానం అబద్ధం కాలేదు.

భయంతో దశరథ్ గుండె వేగం అందుకుంది. మామూలు తోడేళ్ళ కన్నా మంచు తోడేళ్ళు చాలా బలిష్టంగా వుంటాయనీ, జిత్తులమారి నక్కలకన్నా చాలా తెలివయినవనీ విన్నాడు. మంచు మైదానాల్లో అవి ఆహారం కోసం మైళ్ళ దూరం ప్రయాణించి, ఆకలికి తాళలేక తన కన్నా పెద్ద జంతువుల మీద కూడా దాడిచేసి చంపడానికి ప్రయత్నిస్తాయట.

ఆకలిగొన్న ఆ తోడేలు అందుకే అంతసేపూ తనని వెంబడిస్తూ తన మీద దాడిచెయ్యడానికి తగిన సమయం కోసం ఎదురుచూస్తోందన్నమాట! నెమ్మదిగా కోటు జేబులోకి చెయ్యి పోనిచ్చాడు దశరథ్, అటువంటి పరిస్థితులు దాపురిస్తే ఎదుర్కోడానికే పిస్తోలు కొనుక్కొచ్చాడు తను.

పిస్తోలు సేఫ్టీకాచ్ వెనక్కి లాగి తోడేలు వయిపు గురిపెట్టి రెడీగా కూర్చున్నాడు. నాలికతో పెదాలు తడుపుకుంటూ, జూలు తోక ఊపుకుంటూ ముందుకు సాగుతోంది అది. ఊపిరి బిగబట్టి, ట్రిగ్గర్ వత్తాడు దశరథ్.

అంతే!

తోడేలు ఎగిరి బాణంలా చెట్ల కావలివయిపు గుబురులోకి దూకింది. తన గురి తప్పదు. గుండు తగిలే వుంటుంది దానికి. అయితే చాలా మామూలు గాయం చేసి

వుండాలి. అందుకే అది పారిపోగలిగింది.

అక్కడ మంచుమీద రక్తపు చుక్కలు పడుండాలి. వాటిని చూసుకుంటూ వెళ్ళి గాయపడ్డ స్థితిలోనే దాన్ని అంతం చెయ్యాలి అనుకుంటూ లేచాడు దశరథ్. అంతకు ముందు తోడేలును షూట్ చేసిన చోట పరీక్షగా చూశాడు. ఎటువంటి రక్తపు మరకలూ లేవు. అంటే! గురి తప్పిందన్నమాట!

కాలయాపన చెయ్యడం వలన శరీరం చల్లబడుతోంది. చెట్ల గుబురువయిపు చూశాడు. తోడేలు కనిపించ లేదు. నడక ప్రారంభించాడు సరిహద్దు వైపు. పగటిపూట అది తనపై దాడిచెయ్యకపోవచ్చు. చీకటి పడితేనే ప్రమాదం!

అలా అని చీకట్లో కూడా తను నడుస్తూ ముందుకు సాగడం దుర్లభం! పగటివేళ పైన సూర్యరశ్మి వుంటుంది కనుక మంచు తీవ్రత అంతగా వుండదు. రాత్రి పూట విపరీతంగా మంచు కురుస్తుంది. నిద్రపోవడానికి తను ఏదైనా సురక్షిత ప్రదేశం ఎంచుకుని తీరాలి చీకటి పడక ముందే!

దార్లో ఏదో చెక్క కుటీరం కనిపిస్తే తన అదృష్టం పండినట్టే.

అతని అదృష్టం సంగతి ఎలా వున్నా దార్లో అటువంటి కుటీరం యేదీ కానరాలేదు. చీకటి పడుతుండగా ఓ యూకలిప్టస్ చెట్ల గుబురు దగ్గిర ఆగిపోయాడు దశరథ్. ఆ గుబురు పక్కన ఎత్తైన మంచు దిబ్బ వుంది.

మార్గ మధ్యంలో అనేక సార్లు వెనుదిరిగి చూశాడు. కానీ, తోడేలు ఛాయ కూడా కనిపించలేదు. ఆ మంచు దిబ్బమీద స్లీపింగ్ బ్యాగ్‌లో దూరి పడుకోడం మంచిది అనుకుంటూ దిబ్బ పైకి ఎక్కి బ్యాగ్ తెరిచాడు.

పగలంతా నడవడంవల్ల కడుపులో ఎలకలు పిల్లి మొగ్గలు

వేస్తున్నాయి. బ్యాగ్‌లోంచి కీమా నింపిన రెండు రొట్టెలు తిన్నాడు. అప్పుడే మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. రాత్రి పూట తను మంచి నిద్రలో వుండగా తోడేలు దాడిచేస్తే అత్యంత దయనీయమైన చావు తప్పదు తనకు.

అటువంటి ప్రమాదాన్ని ఎదుర్కోడానికి ఆ ఆలోచన చాలా వుపయోగకారి కావచ్చు అనుకుంటూ బ్యాగ్‌లోంచి కీమా నింపిన సగం రొట్టె ముక్క తీశాడు. తరవాత పొడవాటి నాలుగు గమ్ బూట్ తోలు లేసులు తీసి, ఒక దాని కొకటి ముడివేసాడు. ప్రయాణంలో బూట్ల లేసులు తెగితే పనికొస్తాయని జాగ్రత్త కోసం ముందే వాటిని కొని పెట్టుకున్నాడు.

ఆ లేసు కొసకు రొట్టె ముక్క కట్టి లేచాడు. దిబ్బ కింద వున్న చెట్ల గుబురు దగ్గరికి నడచి పిస్తోలు తీశాడు జేబులోంచి. దాని గొట్టం కింది వైపుండేలా పల్చని ఓ చెట్టు కొమ్మకు కట్టి, లేసు రెండో కొసను ట్రిగ్గర్‌కు ముడి వేసి పెట్టీకాచ్ వెనక్కి లాగాడు.

రొట్టె కట్టి వున్న కొసను పిస్తోలు పైనుంచి కిందికి వేలాడదీశాడు. ఇప్పుడు రొట్టె ముక్క నేలకు కేవలం అడుగు ఎత్తులో వేళాడుతోంది. రాత్రిపూట తోడేలు ఇటు వచ్చి దిబ్బ మీదికి ఎక్కడానికి ప్రయత్నిస్తే ముందు దానికి రొట్టె ముక్క వాసన వేస్తుంది.

దాన్ని నోట కరిచి లాగిన మరుక్షణం ట్రిగ్గర్ వత్తుకు పోయి పిస్తోలు పేలుతుంది. గుండు దానికి తగలకున్నా ఆ పేలుడు శబ్దానికి భయపడి అది మళ్ళీ ఈ పరిసరాలకు రాకుండా పారిపోవచ్చు. ఆ విధంగా తను నిద్ర మేల్కొని జాగ్రత్తపడవచ్చు.

అనుకుంటూ తిరిగి దిబ్బ మీదికి జేరాడు. అప్పటికే

చీకటి పూర్తిగా చుట్టుముట్టేసింది పరిసరాలని. స్లీపింగ్ బ్యాగ్ కింద పరిచి, జిప్ లాగి, లోన దూరాడు. జిప్‌ను తిరిగి పూర్తిగా పైకి లాక్కొని కళ్ళు మూసుకున్నాడు.

రోమాలు నిక్కబొడిచే నిశ్శబ్దం! పైన తోడేలు భయం. ఎలా పడుతుంది నిద్ర? చాలా సేపు చెవులు రిక్కించి ఏదయినా అలికిడవుతుందేమోనని వినడానికి ప్రయత్నించాడు. ఏ అలికిడీ లేదు.

అదే సమయంలో జ్ఞాపకం వచ్చిందతనికి. ఉన్న ఒక్క ఆయుధాన్ని చెట్టుకు కట్టేసి వచ్చాడు. దురదృష్ట వశాత్తూ నిద్రలో తోడేలు దాడిచేస్తే ఏం చెయ్యాలి? అనుకుంటూ లేచి సామాను బ్యాగ్ తెరిచి కత్తి బయటికి తీశాడు. దాన్ని మణికట్టు దగ్గర గడియారం బెల్టులో ఇరికించి తిరిగి స్లీపింగ్ బ్యాగ్‌లో దూరాడు.

రాత్రి బాగా పొద్దుపోయాక సగం నిద్రావస్థలోనూ, సగం జాగ్రదావస్థలోనూ చాలా నెమ్మదిగా దొర్లిపోసాగాయి నిమిషాలు.

3

"కీచ్!" మన్న చప్పుడై తృళ్ళిపడి కళ్ళు తెరిచాడు.

తెలతెలవారుతోంది.

ఆకాశంలో పెద్ద సైజు పక్షుల గుంపు ఎగిరిపోతోంది. అవే అరిచి వుంటాయి అనుకుంటూ చటుక్కున బ్యాగ్ జిప్‌లాగి లేచి కూర్చుని ఆవులిస్తూ ఒళ్ళు విరుచుకున్నాడు.

అంతే!

ఎత్తిన అతని చేతులు అలాగే వుండిపోయాయి. దిబ్బ కింద కేవలం ఇరవై గజాల దూరంలో నిల్చునుంది తోడేలు. బాణంలా వంగి వున్న దాని నడుం, గుండ్రంగా తిరుగుతున్న జూలుతోకా చూడగానే ఏ క్షణంలోనయినా

అది తనపై దూకడానికి సమాయత్తమౌతున్నట్టు గ్రహిం చాడు. మెరుపులా మణికట్టు మీది కత్తి లాగి లేచి నిల్చు న్నాడు.

అంతే!

తోడేలు వెను దిరిగి చెట్ల గుబురు వెనక్కి పారి పోయింది. ఎప్పుడు వచ్చిందిక్కడికి? ఆ రొట్టెముక్కను లాగలేదా? తన అంచనా అమలు కాలేదా? వెంటనే వెళ్ళి పిస్తోలు తీసుకోవాలి అనుకుంటూ జాగ్రత్తగా దిబ్బ దిగి చెట్లని సమీపించి కొయ్యబారిపోయాడు.

వేళాడుతున్న రొట్టె ముక్కగానీ, తోలులేసు గానీ ఏవీ లేవక్కడ! అంతేకాదు, చెట్టుకు కట్టిన పిస్తోలు కొమ్మతో సహా మాయం! అది తోడేలు పనేనా? లేక రాత్రి ఎవ్వ రయినా ఇటు వచ్చారా అనుకుంటూ నేలమీదికి చూశాడు. మంచులో తోడేలు అడుగు జాడలు తప్ప మరే గుర్తులూ లేవు.

మైగాడ్! ఇంత జిత్తులమారా అది. చాకచక్యంతో రొట్టెముక్కనూ, దాన్ని కట్టిన తోలు లేసునూ తినడమే కాక, పిస్తోలు కట్టిన కొమ్మను కూడా పళ్ళతో పీకి తీసి కెళ్ళింది. ఇప్పుడేం చెయ్యాలి? ఎలా దాన్ని ఎదుర్కో వాలి?

అది మీదపడే వరకూ కత్తి నుపయోగించడానికి వీలు లేదు. ఆ స్థితిలో తనూ దాని పంజా దెబ్బలకూ, పళ్ళ గాట్లకూ గురి కాక తప్పదు. పిస్తోలు కోసం ఎదురుచూస్తూ కూర్చుంటే ఏ క్షణంలోనయినా అది మీదపడే అవకాశం వుంది.

అనుకుంటూ వెనుదిరిగి ఉలిక్కిపడ్డాడు. తోడేలు దిబ్బ ఎక్కుతోంది అక్కడున్న తిండి పదార్థాల బ్యాగ్ కాజేయ

దానికి. గొంతు పొర చినిగేలా గావుకేక పెట్టాడు దశరథ్. తోడేలు ఆగింది. వెను దిరిగి చూసింది. పారిపోవడానికి ప్రయత్నించలేదు. బహుశా ఆకలి వలన దానిలో మొండి ధైర్యం వచ్చినట్టుంది.

ఆ బ్యాగ్‌ను గనక అది నోట కరుచుకుపోతే తను పస్తులతో చావక తప్పదు. ఆ ఆలోచన రాగానే తెగింపు వచ్చేసింది దశరథ్‌లో. పిడికత్తి ఝళిపిస్తూ, గావు కేకలు పెడుతూ దిబ్బ వయిపు దౌడు తీశాడు.

సగం దూరం వెళ్ళాడో లేదో తోడేలు ఎగిరి చెట్ల గుబుర్లోకి పారిపోయింది. ఆదరా బాదరా దిబ్బ ఎక్కి సామాను సర్దుకుని బయలుదేరాడు. పిస్తోలు చెట్టుకు కట్టి చాలా పెద్ద పొరపాటు చేశాడు తను. తోడేలు అంత పని చేస్తుందని ఎవడికి తెలుసు.

పిడికత్తి అలాగే చేతిలో ఒడిసి పట్టుకుని వేగంగా అడుగులు వెయ్యసాగాడు. కొంత దూరం నడిచాక చటుక్కున వెనుదిరిగి వణికిపోయాడు. తోడేలు కేవలం వంద అడుగుల దూరాన వెంబడిస్తోంది.

ఇలా అయితే లాభం లేదని పిక్క బలం కొద్దీ పరుగు లంకించాడు. ఫర్లాంగు దూరం పరుగెత్తి వెను దిరిగి చూస్తే తోడేలు ఇప్పటికీ వంద గజాల దూరానే వుంది. అతను ఆగడం చూసి అదీ ఆగిపోయింది.

మంచులో పరుగెత్తడం సామాన్య విషయం కాదు. ఒంట్లోని శక్తి వెంటనే వుడికిపోతుంది. అందుకే తిరిగి మామూలు నడక సాగించాడు. తోడేలు కూడా యథాప్రకారం అతన్ని అనుసరింప సాగింది. దాని పట్టుదల చూస్తుంటే తన మీద దాడిచేసే వరకూ వదిలిపెట్టేలా లేదు.

అయితే ఆ దాడిని తను ఏ మాత్రం ప్రతిఘటించలేననీ, పూర్తిగా నీరసించి పోయాననీ గట్టి నమ్మకం కుదిరాకే దాడి చెయ్యాలని ఓపిగ్గా వెంబడిస్తోంది తనని. చీకటి పడక ముందే ఏదో ఒక సురక్షిత ప్రదేశం చేరుకోవాలి.

అనుకుంటూ నడక వేగాన్ని హెచ్చించాడు. గంటలు గడుస్తున్న కొద్దీ తోడేలుకూ, అతనికీ మధ్య దూరం తరిగి ఇప్పుడు ఎనభై అడుగు లయింది। దడదడలాడే గుండెతో అప్పుడప్పుడూ వెనుదిరిగి చూడసాగాడు. అతను వెను దిరిగినప్పుడల్లా అది మొనదేలిన పళ్ళు బయట పెట్టి గుర్రు మంటోంది.

టైం చూసుకున్నాడు. మధ్యాహ్నం నాలుగ్గంటలు. అంటే చీకటిపడటాని కింకా రెండు గంటలే ఉన్నాయి. దూర దూరం వరకూ ఎక్కడా ఎటువంటి కుటీరం కాన రావడం లేదు. తోడేలును చూస్తూంటే చీకటి పడిన మరు క్షణం తన మీద దూకడానికి సిద్ధంగా ఉన్నట్టు కనిపి స్తోంది.

ఉదయం నించీ కడుపు ఖాళీగా వుండటంవల్ల నీరసం ముంచుకొస్తోం దతనిలో. ఐనా, మృత్యుభయం వల్ల ఆకలి దప్పులు మరిచి ఏకబిగిన ముందుకు సాగుతున్నాడు.

కాసేపట్లో చీకటి పడుతుందనగా దూరాన ఓ చెక్క కుటీరం కనిపించి, ప్రాణం లేచివచ్చింది దశరథ్‌కు. దీన్ని బట్టి యింకా నేలపై తనకు నూకలు చెల్లిపోలేదని స్పష్ట మౌతోంది. పరుగు లంకించాడు ఆ వైపు.

ఆ కుటీరాన్ని అతడు జేరాడంటే, అంతసేపూ తను పడ్డ ప్రయాస వృధా అవుతుందనీ, రుచికరమైన మానవ మాంసం తినాలనే కోరిక మనసులోనే మిగిలిపోతుందనీ తోడేలు కర్థమై వుంటుంది. అందుకే, అదీ వేగంగా అతన్ని

వెన్నంటసాగింది.

క్షణాలు గడుస్తున్న కొద్దీ దానికీ, అతనికీ మధ్యదూరం త్వరితంగా తరిగిపోతోంది. అతనా కుటీరం తలుపులు సమీపించేసరికి తోడేలు కేవలం ముప్పై అడుగుల దూరమే వుంది. భళ్ళున తలుపు తోసి లోనికి దూరాడు.

మెరుపులా తిరిగి తలుపుమూసి గడియ బిగించాడు. ఆయాసం ఆపుకోలేక అమాంతం నేలమీద పడి, గట్టిగా ఊపిరి తీసుకోసాగాడు. తోడేలు తలుపును గిరుతున్న చప్పుడు. తను లోపలికి రావడానికి ఏ మాత్రం ఆలస్యం జేసివున్నా యీ పాటి కది తన కండల్ని భోంచేస్తూ వుండేది.

దేవుడు రక్షించాడు తనని. జీవితంలో మొదటిసారి మృత్యుభయం అంటే ఏమిటో, ప్రాణప్రీతి యెలా వుంటుందో తెలిసివచ్చిందతనికి. ముందే ఆ సంగతి తెలిసి వుంటే అంత మందిని అన్యాయంగా చంపేవాడు కాదు తను.

ఈ రాత్రి నిర్భయంగా నిశ్చితంగా నిదరపోవచ్చు. తోడేలు వుదయం వరకూ లేదా మధ్యాహ్నం వరకూ యిక్కడే తచ్చాడి. నిరాశపడి వెళ్ళిపోతుంది. బాగా పరిగెత్తడంవల్లా, ఉదయం నించి తినకపోవడం వల్లా అతని ఆకలి ఉధృతమైంది.

లేచి, బ్యాగ్ తెరిచి, తినుబండారాలు తీశాడు బైటికి. మూడు పూటల తిండిని ఒకేసారి దట్టించి తినేశాడు పీక దాకా! అప్పుడుగానీ పంచేంద్రియాలు మళ్ళీ మామూలు స్థితికి రాలేదు. మిగిలిన తిండి పదార్థాలు చూసి గతుక్కుమన్నాడు.

రేపొక్క రోజుకే సరిపోతా యవి! భూటాన్ సరిహద్దు

చేరడానికి రేపొక్కరోజు ప్రయాణమే మిగిలింది కదా అన్న ఆలోచన రాగానే మళ్ళీ ఊరట కలిగింది మనసుకు. అంతలో హఠాత్తుగా కుటీరం కప్పుపై చరచరా చప్పుడు వినిపించి అదిరిపడి అటు చూశాడు.

ఉకు చెక్కలతో నిర్మించిన ఆ కప్పు మధ్య ఓ చోట కొద్దిపాటి సందు వుంది. ఆ సందులోంచి సగం వరకూ లోపలికి తొంగి చూస్తూ మీసా లెగరేస్తోంది ఎరుపు రంగు ఉడత! నవ్వుకున్నాడు దశరథ్ తన భయానికి.

పీకవరకూ మెక్కడంవల్ల మత్తు కమ్ముకోసాగింది కళ్ళల్లో. నేలపై స్లీపింగ్ బ్యాగ్ పరిచి, లోనదూరి కళ్ళు మూసుకున్నాడు నిశ్చింతగా.

4

మర్నాడు బాగా పొద్దుపోయాకగానీ అతని నిద్ర మేల్కొలేదు. పైన ఉడత గెంతుతున్నట్టుంది. ఆదమరిచి నిద్రపోవడం వల్ల మనసు మంచి హుషారుగా వుంది.

ఆ హుషారులో తన గమ్యం చేరడం పెద్ద కష్టంకాదు. సామాను సంచీ, స్లీపింగ్ బ్యాగ్ తిరిగి వీపుకు తగిలించుకుని, జాగ్రత్తకోసం కత్తిని మాత్రం చేతిలో పట్టుకుని, గడియ ఎత్తి కొద్దిగా తలుపు తెరిచాడు. చుట్టుపక్కల ఎక్కడా కనిపించలేదు తోడేలు.

ఆ కుటీరం పక్కగా చెట్ల గుబురుంది. అక్కడ యెలాంటి అలికిడీ లేదు. తన అంచనా కరక్టే! ఇక వీడి వెనక సమయం వృధా చేసుకునేబదులు మరో వేటను వెదుక్కోడం మంచిదని వెళ్ళిపోయుంటుంది తోడేలు.

అనుకుంటూ తలుపు యింకాస్త తెరిచి, పూర్తిగా నమ్మకం కుదుర్చుకుని బైట అడుగు పెట్టాడు. నాలుగడుగులు వేశాడో లేదో, కుటీరం కప్పుమీద టక్ మన్న,

చప్పుడై, వెంటనే పైకి చూశాడు, అంతే!

పై నుంచి అమాంతం అతని మీదికి లంఘించుకుంది తోడేలు. ఊహించని ఆ పరిణామంతో గుండె జలదరించి, గావుకేక పెట్టాడు దశరథ్. మొనదేలిన వాడి పళ్ళతో కోటుమీంచి అతని మెడ కరిచిపట్టుకుని, గోళ్ళతో రక్కుతోంది తోడేలు.

చివరి క్షణాల్లో ప్రతిమనిషిలోనూ ప్రతిఘటనా శక్తి తీవ్రమవడం సహజం! తోడేలు బరువుకు తూలి కింద పడ్డాడు దశరథ్. బాలెన్స్ తప్పి అతనితోబాటు అది కూడా మంచుమీద పడింది. అంతే! పిచ్చి ఉద్రేకంతో, కత్తితో యిష్టం వచ్చినట్లు వేట్లు వెయ్యసాగాడు.

నాలుగైదు దెబ్బలకే అది ఎగిరి చెట్ల గుబుర్లోకి పారిపోయింది. మోకాళ్ళ మీద కూర్చుని వణుకుతూ అటే చూడసాగాడు దశరథ్. ఆకుల మధ్య నించి యిటే చూస్తూ గుర్రు మంటోంది తోడేలు. అతికష్టం మీద లేచి వెంటనే కుటీరంలోకి దూరి తలుపు మూసుకున్నాడు.

ఆయాసంతో అతని గుండె తీవ్రంగా కొట్టుకుంటోంది. కూర్చోబోతూ చేతులు చూసుకుని ఉలిక్కిపడ్డాడు. కత్తి? కత్తిలేదు! హడావుడిలో ఖంగారులో బైటే పడిపోయింది. ఏం చెయ్యాలి! ఏం చెయ్యాలిప్పుడు? ఉన్న ఒక్క ఆయుధం, కొండంత ధైర్యాన్ని కూడగట్టుకునే సన్నిధం కోల్పోయాడతను. వెళ్ళి తెచ్చుకుందామా?

అనుకుంటూ గడియ ఎత్తి కొద్దిగా తలుపు లాగాడు. కిర్రుమంది. అంతే!

పాదల దగ్గర గుర్రుమంది తోడేలు!

వెంటనే మళ్ళీ తలుపు మూసి గడియ బిగించి, ఉస్సూరు మంటూనే నేలపై చతికిలబడ్డాడు. ఇంక ఈ రోజంతా బైటి

కెళ్ళడం కుదరదు. గాయపడ్డ క్రూరమృగాలు మరింత ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఈ సారి దాని దాడిని ప్రతిఘటించే శక్తి, ధైర్యం కూడా తనలో లేవిప్పుడు.

ప్రాణభీతి యెంత దయనీయమైనదో యిప్పుడు తెలిసి వస్తోంది. ఆ నాడు యెంతోమంది నిరాయుధల మీదా, తనకే అపకారమూ చెయ్యని అమాయకులమీదా అంత నిర్దయగా యెలా దాడి చెయ్యగలిగాడు? ఒళ్ళు చల్లబడుతున్న కొద్దీ తోడేలు చేసిన గాయాలు సలపడం మొదలుపెట్టాయి.

స్లీపింగ్ బ్యాగ్‌లో దూరి కళ్ళు మూసుకున్నాడు. భయం వల్లా, గాయాల వల్లా ఒళ్ళు కొద్ది కొద్దిగా వేడెక్కుతోంది. జ్వరం వస్తోందా? అదే నిజమైతే ఈ నిర్జన ప్రదేశంలో తనకు దిక్కెవరు? కుక్కచావు తప్ప!

జీవితంలో మొదటి సారి ఏడవా లనిపిస్తోందతనికి. ఏడవాలనుకున్నా కనుకొలుకుల్లో కన్నీరు ఊరడంలేదు. బహుశా, ఆ చలికి అవి కూడా హృదయాంతరాళల్లో యెక్కడో, గడ్డకట్టుకు పోయుంటాయి. మూలుగుతూ అలాగే మగతనిదరలోకి జారిపోయాడు.

మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో నిద్ర మేల్కొని చూస్తే మంచి జ్వరంలో వున్నాడు. ఉదయం జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అతని రోమాలు నిటారుగా నిక్కబొడుచుకుంటున్నాయి. మూలుగుతూ మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

చీకటిపడే సమయాన జ్వరం కాస్త తగ్గుముఖం పట్టినట్టు స్ఫురించింది. ఉదయంనించీ కడుపులో ఏమీ లేక పోవడంవల్ల ఆకలీ, నీరసం రెండూ ఏకమై విజృంభిస్తున్నాయి. లేచి, మిగిలిన తినుబండారాలు తీసి తినసాగాడు.

కడుపు నిండాక చూస్తే బహుకొద్దిపాటి పదార్థాలే మిగి

లాయి. తోడేలంటే తానెలా భయపడుతున్నాడో, ఇప్పుడు తనంటే అది కూడా అలాగే భయపడుతూ వుంటుంది. ఇక తనవెంట పడటం వ్యర్థమని ఈ పాటికి యెటో వెళ్ళిపో యుండాలి.

తెల్లవారగానే సాధ్యమైనంత త్వరగా ఇక్కణ్ణించి బైలుదేరడం మంచిది. అనుకుంటూ తిరిగి స్లీపింగ్ బ్యాగ్‌లో దూరి కళ్ళు మూసుకున్నాడు.

మర్నాడు సూర్యోదయం తరువాతే అతని నిద్ర మేల్కొంది. నిన్నటి జ్వర బాధగానీ, గాయాల బాధగానీ అంతగా లేవిప్పుడు. ప్రయాణం కావచ్చు. ఐతే, బైటికెళ్ళే ముందు చాలా జాగ్రత్తగా తోడేలు సంగతి నిర్ధారణ చేసు కోవాలి. లేదా....

స్లీపింగ్ బ్యాగ్‌లోంచి లేచి, తలుపువైపు అడుగు వేశాడు. అంతే! కప్పుమీద వినిపించిన చప్పుడు అతణ్ణి స్తబ్ధుణ్ణిచేసింది. అది గోళ్ళతో చెక్కలు గీరుతున్నచప్పుడు! తన అంచనాలు తప్పుతున్నాయి. ఆ మొండి ముండ ఇంకా పోలేదు. ఎటూ తోచక చివరి ప్రయత్నంగా కప్పు చెక్కలు గోళ్ళతో ఊడబెరికి లోపలికి దూకడానికి ప్రయ త్నిస్తోంది.

పట్టరాని వుద్రేకంతో చటుక్కున చెయ్యి పైకెత్తాడు. అప్పుడు జ్ఞాపకం వచ్చిందతనికి. తన చేతిలో కత్తి లేదనీ, బైట ఎక్కడో పడిపోయిందనీ! ఇప్పుడు తను నిరాయు ధుడు. నిస్సహాయుడు. భయంతో వెంటనే స్లీపింగ్ బ్యాగ్‌లో దూరి జిప్ లాక్కున్నాడు.

పైన గోళ్ళతో చెక్కలు గీరుతున్న శబ్దం వినిపిస్తూనే వుంది. దశరథ్ గుండెలో గుర్రాలు దౌడు తీస్తూనే వున్నాయి!

5

మూడు నెలల తరవాత, మంచు కురవడం పూర్తిగా నిలిచిపోయాక, ఇద్దరు బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ జవాన్లు పెట్రోలింగ్ జరుపుతూ ఆ వైపు వచ్చారు. మరుక్షణం ఆ కుటీరం చేరువలో వున్న చెట్లగుబురులోంచి ముక్కు బద్దలుకొట్టే దుర్వాసన వేసింది వారికి.

అటు వెళ్ళి ఆశ్చర్యపోయారు. పొదల మధ్య చచ్చి పడున్న ఓ తోడేలునూ, దాని పక్క బొమికల మధ్య పిడి వరకూ దిగివున్న కత్తినీ చూడగానే, "ఇప్పుడు వేటగాళ్ళు తుపాకులు వదిలి కత్తులతో కూడా మృగాలను చంపు తున్నారా?" అడిగాడొకడు తన సహచరుడితో.

"మృగాలు తెగించి మీదపడితే కత్తులతో ఏమిటి, చేతు లతో కూడా దెబ్బతియ్యక తప్పదుమరి!" అంటూ కుటీరం వైపు నడిచాడతను.

కుటీరం తలుపు మూసివుంది. తోసిచూశారు. తెరుచుకో లేదు. లోపల గడియ పెట్టివుంది.

"ఏయ్. ఎవరున్నారు లోపల?" అరిచారు.

జవాబులేదు. ఐతే, లోపల ఎవరో వున్నట్టు మాత్రం శబ్దం వినిపిస్తోంది.

"మర్యాదగా తెరవండి తలుపు!"

ఐనా. జవాబు లేదు.

"ఎవడో స్మగ్లర్ వెధవ దాక్కునుంటాడు లోపల. వదలకూడదు వాణ్ణి!" అంటూ రైఫల్ బట్‌తో తలుపుమీద బాదసాగారు.

కొద్ది ప్రయాసతోనే విరిగిపడింది తలుపు. నేలమీద కని పించిన దృశ్యం చూసి. యిద్దరూ నిర్ఘాంతపోయారు.

నేలపై వెల్లకిలా చచ్చిపడున్నాడు దశరథ్!

అతని పక్కనే ఖాళీ తినుబండారాల సంచి పడుంది.

"ఆకలితో చచ్చాడనుకుంటాను" అన్నాడొకడు.

"అదుగో, అతని మెడమీదా, భుజాలమీదా కోటు చిరిగి వుంది. లోపల గాయాలు కూడా కనిపిస్తున్నాయి" అన్నాడు రెండో గార్డు.

"బహుశా, బైట చచ్చిపడున్న తోడేలును యితనే చంపి వుంటాడు. ఆ పోరాటంలోనే ఆ గాయా లయుంటాయి."

"తోడేలు చచ్చిపోయినా, ఇతను ఆకలితో లోపలెందుకుండిపోయాడు? ఆహారంకోసం యెందుకు బైటికిరాలేదు? జనవాసంవైపు యెందుకు వెళ్ళలేదు? మరిచాను.... ఇంతక్రితం మనకు లోపల వినిపించిన చప్పుడేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు రెండో గార్డు.

సరిగ్గా అదే క్షణంలో కప్పుమీది చెక్కల్ని గోళ్ళతో గీరుతున్న చప్పుడు వినిపించి ఇద్దరూ వులిక్కిపడి పైకి చూశారు. ఓ చెక్క సందులోంచి ఎరుపురంగు ఉడత లోపలికి తొంగి చూసి, వెంటనే అవతలికి పోయింది. మరుక్షణం మళ్ళీ గోళ్ళతో చెక్కలు గీరుతున్న చప్పుడు!

సాలోచనగా తలూపాడు మొదటి గార్డు. "అర్థమైంది అసలు కథ! ఇతని మెడమీది, భుజాలమీది గాయాలనుబట్టి ఆ తోడేలు కప్పుమీంచి దూకి ఇతనిమీద దాడి చేసిందని తెలుస్తోంది. వెంటనే ఇతను దాన్ని కత్తితో దెబ్బతీసి, లోపలికి దూరి తలుపు మూసుకున్నాడు.

ఆ కత్తిపోటుకు పొదల్లోకెళ్ళి ప్రాణం వదిలింది తోడేలు! ఆ సంగతి తెలియని యితను కప్పుపైన గోళ్ళతో చెక్కలు గీరే తుంటరి ఉడతను తోడేలుగానే భ్రమించి, భయంతో లోపలే వుండిపోయాడు. ఆహారపదార్థాలు అయిపోయి, ఆకలికి తాళలేక ప్రాణాలు వదిలాడు!" □

జగమే దొంగలమయం

పి. అరుణ

అమావాస్య రోజు పుట్టిన వాళ్ళంతా దొంగలవుతారో లేదో నాకు తెలియదుకానీ నా భార్య సుందరి మటుకు ఆ విషయాన్ని నిజం చేసుకున్నది.

నా భార్య చేతివాటం సంగతి నాకు పెళ్ళయిన నాలుగు నెలలకు గాని తెలీలేదు. తెలిసిన తర్వాత ఆశ్చర్య పోయాను.

నా పెళ్ళిలో మా బంధువులవి కొన్ని చీరలు మరికొన్ని నగలు కూడా పోయాయి. నాలుగు నెల్ల తర్వాత ఒకసారి సుందరి పుట్టింటికి వెళ్ళివచ్చి కొన్ని చీరలను ఒక వుంగ రాన్ని తీసుకువచ్చింది.

"ఇవ్వన్నీ ఎక్కడివి?" అడిగాను.

"ఎవరో పెళ్ళికి వచ్చిన వాళ్ళు మా ఇంట్లో మరచి పోయారు. ఇప్పుడు ఈ చీరలు యెవరివో మనకు తెలీదు కదా! ఎవరికని తిరిగి ఇస్తాము?" అన్నది.

"మరి ఆ బంగారు వుంగరం?" అన్నాను.

"నాకే సినిమాకు వెళ్ళి వస్తుంటే దొరికింది!" అన్నది.

తర్వాత నేనేమీ అడగలేకపోయాను. కొన్ని రోజులు ఆ చీరలను కట్టుకుని తర్వాత వాటిని స్టీలుసామాన్ల వాళ్ళకు వేసింది.

ఆ తర్వాత నించీ సుందరిని నేను గమనించటం మొదలుపెట్టాను. చిన్నచిన్న దొంగతనాలు చేస్తూ నా కంట పడింది.

ఒకసారి మా ప్రక్కపోర్షన్‌లో వాళ్ళు బావి దగ్గర సబ్బుపెట్టెను వుంచి మరచిపోయారు. ఆ రాత్రి సుందరి ఆ సబ్బుపెట్టెను తీసుకు వచ్చి ఇంట్లో దాచివుంచింది.

"ఇదేమిటి? తప్పు కదూ?" అన్నాను.

"మీకు తెలీదు. మన పక్కపోర్షన్‌లో వుంటున్న వన జాక్షి సామాన్యురాలు కాదు. మొన్న సాయంత్రం నేను బావి దగ్గర స్టీలు గరిట మరచిపోతే తీసుకెళ్ళి యింట్లో పెట్టుకుంది. దానికిదే తగిన శాస్తి" అన్నది.

నేను మళ్ళీ నోరెత్తలేకపోయాను.

ఆ తర్వాత సుందరి పక్కవాళ్ళ దొడ్లో వస్తువు అన్నింటినీ జాతీయం చేయడం మొదలుపెట్టింది. నేను యెంతగా ప్రయత్నించినా ఆమె చేతివాటాన్ని అదుపు చెయ్యలేకపోయాను.

ఒకరోజు రాత్రి ఏడుగంటల సమయంలో నేను ఇంటికి వస్తుంటే మా వీధిలో నాకు ఓ పర్సు దొరికింది. ఆ పర్సును జేబులో పెట్టుకుని యింట్లోకి వచ్చి బయటికి తీశాను.

"ఎక్కడిదీ పర్సు" అన్నది సుందరి.

"మన వీధిలోనే దొరికింది" చెప్పాను అందులో ఉన్న రూపాయనోట్లను బయటకు తీస్తూ—

అందులో మూడువందల ఎనిమిది రూపాయలు వున్నాయి. ఇంకో రూపాయ చిల్లర వున్నది.

"అబ్బ....నెలాఖరు రోజుల్లో బలే దొరికింది లక్కీగా" అన్నది సుందరి సంతోషంగా—

"పాపం: పోగొట్టుకున్నవాళ్ళు యెంత బాధపడతారో" అన్నాను.

"సర్లేండి. అవన్నీ ఆలోచిస్తూ కూర్చుంటే మనం ఏమీ చెయ్యలేము" అన్నది నా భార్య.

అయితే ఓ పది నిముషాలకే నాకు దొరికిన ఆ పర్సు యెవరిదో తెలిసిపోయింది. ఆ పర్సు మా పక్కపోర్షన్‌లో వుంటున్నాయనదే. ఆయన యింటికి వచ్చి తన పర్సు పోయిన సంగతి అందులో యెంత డబ్బున్నదీ భార్యకు చెబుతుంటే మాకు వినిపించింది.

"తీసుకెళ్ళి పర్సును ఆయనకు యిస్తాను" అన్నాను సుందరితో.

"మీకేమయినా మతిపోయిందా? ఇప్పుడు మీరు ఆ పర్సును యిచ్చినా ఆయన మిమ్మల్ని అపార్థం చేసుకో వచ్చు. అయినా ఆయనకేమీ ఫర్వాలేదు. తాలూకా ఆఫీసులో ఉద్యోగం. పై సంపాదన బాగానే వుంటుంది. ఆయనకు యీ మూడొందల రూపాయలు ఒక లెక్కకాదు" అని నా మాటల్ని కొట్టేసింది సుందరి.

నేనా పర్సును పక్కపోర్షనాయనకు యివ్వలేదు.

2

"ఈ రోజు పక్కపోర్షన్ వాళ్ళ పాప పుట్టినరోజు" అన్నది సుందరి ఉదయం నేను లేవటంతోనే—

"అయితే ఏమిటి?" అన్నాను.

"ఏమీలేదు. భారీ ఎత్తున పేరంటం చేస్తారు."

"నిన్ను పిలుస్తారా?"

"పిలవరు. పిలవకపోయినా ఫర్వాలేదు. నేనేమీ అనుకోను" అన్నది.

చాలా రోజుల క్రితమే ఈ దొంగతనాల గురించి వన జాక్షికీ—సుందరికీ తగాదా జరిగింది. అప్పటి నించి ఇద్దరూ మాట్లాడుకోవటంలేదు.

కాని ఆశ్చర్యంగా ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల సమయంలో వనజాక్షి వచ్చి సుందరిని వాళ్ళ నాలుగేళ్ళ పాప పుట్టినరోజు పేరంటానికి రావలసిందిగా పిలిచి వెళ్ళింది.

"చూశావా వనజాక్షి మంచితనం" అన్నాను.

"మంచితనం కాదు. తన గొప్పతనాన్ని చాటుకోవాలనే తాపత్రయం. అందుకే నాకు వనజాక్షిని చూస్తే వళ్ళు మంట. సాయంత్రం ఎంత ఫోజు కొడుతుందో మీకేం తెలుసు?" అన్నది.

"ఇంతకీ సాయంత్రం పేరంటానికి వెళతావా?" అన్నాను.

"తప్పకుండా వెళతాను" అన్నది.

అన్నట్టు ఆ సాయంత్రం సుందరి—వనజాక్షి కూతురు పుట్టినరోజు పేరంటానికి వెళ్ళింది. వాళ్ళింటికి ఆ సాయంత్రము చాలా మంది వచ్చారు.

మొత్తానికి భారీ ఎత్తునే చేసింది వనజాక్షి పాప పుట్టిన రోజు.

"నేను చెప్పినట్టుగానే వనజాక్షి ఎంత ఫోజు కొట్టిందో మీకేం తెలుసు? అసలు నాతో మాట్లాడలేదు. గొప్ప గొప్ప వాళ్ళందరినీ పలకరించటమే ఆ వనజాక్షి ధ్యేయం అనుకుంటాను. పొరపాటున వెళ్ళాను. అయినా వూరికే తిరిగి రాలేదులెండి" అన్నది.

"ఏం చేసుకొచ్చావు? వాళ్ళ పాప మెళ్ళో వున్న బంగారు గొలుసును తీసుకొచ్చావా?" అన్నాను.

"వాళ్ళ పాపగొలుసు కాదు. మరో వాళ్ళ పాపగొలుసు. పాపం. ఈ గొలుసు యెంతో బావుందని వనజాక్షి ఆ పాపను దగ్గరకు తీసుకుని మరీ పొగిడింది. ఈ దెబ్బతో వాళ్ళ అనుమానం వనజాక్షి మీదకు పోతుంది" అన్నది ఆ గొలుసును తీసి నాకు చూపించి.

"ఎంత పని చేశావ్ సుందరీ" అన్నాను.

"మీకు తెలీదులెండి. ఆ వనజాక్షి పొగరు ఇలా అణచవలసిందే. ఇప్పుడుగాని దాని రోగం కుదరదు" అన్నది.

ఆ రాత్రికి సుందరి అన్నంత పనీ జరిగింది. గొలుసు పోగొట్టుకున్న పాప తల్లి-తండ్రి వనజాక్షి యింటిమీదకు పోయిన గొలుసు గురించి దండయాత్రకు వచ్చారు.

3

మా యింటి ఓనరు అరవై ఏళ్ళ ముసలాయన. ఆయనకు ఇద్దరు కొడుకులు వున్నారు. రెండు నెలల క్రితం వరకు ఆయన ఆ ఇద్దరి కొడుకుల దగ్గరా వుంటూవచ్చాడు. కాని కోడళ్ళు ఆయన్ని సరిగా చూడటం లేదని వాళ్ళ దగ్గర్నించి తన సామానంతా తీసుకుని వచ్చేసి వనజాక్షి వాళ్ళు ఖాళీచేసిన పోర్షన్‌లోకి వచ్చేశాడు.

మా ఆవిడ దెబ్బ తట్టుకోలేక రెండు నెలల క్రితమే వనజాక్షి వాళ్ళు ఆ పోర్షను ఖాళీచేసి వెళ్ళిపోయారు.

ఆ ముసలాయనకు అంత పోర్షను నిజానికి ఎక్కువే. కాని యెందుకో అందులో రెండు గదుల్ని మరొకరికి ఆయన అద్దెకు యివ్వదల్చుకోలేదు. ఎప్పుడయినా కొడుకులు వస్తే సరిపోతుందని అనుకున్నాడు.

ఆయనే రోజూ వంట చేసుకునేవాడు. ఆయన కొంచెం జాగ్రత్త మనిషి. అందువల్ల మా సుందరికి ఏవీ దొరకటం లేదు కాజెయ్యటానికి. అందువల్ల దానికి వనజాక్షి వాళ్ల లేని లోటు యిప్పుడు బాగా తెలుస్తోంది.

అయితే నాలుగురోజుల క్రితం మా యింటి ఓనరు స్వగ్రామం నించి ఆయన పొలం చేసే రైతు వచ్చి కౌలు తాలూకు పాతబాకీ కింద కొంత - ధాన్యం అమ్మిన సొమ్ము కింద కొంత - మొత్తం ఎనిమిది వేల రూపాయలు యిచ్చి వెళ్ళిపోయాడు. ఆయన ఆ డబ్బును బీరువాలో వుంచి తాళమేయటం సుందరి చూడనే చూసింది.

అప్పుడే ఆ డబ్బును ఎలాగయినా ఓ ప్లానువేసి దొంగతనం చెయ్యాలనే అయిడియా దానికి వచ్చింది.

ఈ సారి చిన్న దొంగతనాల స్థాయినించి కొంచెం పెద్ద దొంగతనాల స్థాయికి ఎదగాలని అనుకున్నది.

అందుకు అప్పటి కప్పుడే ఓ ప్లానును సిద్ధం చేసుకున్నది.

ఆ ప్లాను ప్రకారం ఆ రోజు రాత్రి ముసలాయన భోజనం చేసే టైముకు సుందరి ఆయన కోసం ప్రత్యేకంగా చేసిన కందకూరను తీసుకెళ్ళి (ముసలాయనకు కందకూరంటే ఇష్టమని సుందరి తెలుసుకున్నది) ఆయనకు ఇస్తుంది. ఆయన దాన్ని ఆప్యాయంగా తినేస్తాడు.

కొంచెం సేపటి తర్వాత ఆ కూరలో కలపబడిన మత్తు మందు ప్రభావంతో ఆయన మంచి నిద్రలోకి వెళ్ళిపోతాడు. అప్పుడు సుందరి మెల్లగా బీరువా తాళం చెవులు తీసుకుని బీరువా తెరిచి ఆ డబ్బును కాజేసి తాళం చెవులను ఆయన పరుపు క్రింద వుంచుతుంది.

ఇదీ ప్లాను.

4

ప్లాను ప్రకారం కొంతవరకు జరిగింది. కందకూరను చూడగానే ముసలాయన కళ్ళు మెరిసాయి. అయితే ఏవో లెక్కలు రాసుకుంటూ కూర్చోవటం వల్ల ఆయన భోజనానికి కూర్చునేసరికి తొమ్మిదిన్నర దాటిపోయింది.

ఆయన భోజనం చేసేసరికి పది గంటలు కావస్తోంది.

ముసలాయన భోజనం చేసి పడుకున్నాడు.

వెంటనే సుందరి మా యింటి తలుపును మూసి గడియ పెట్టింది.

ఇద్దరం ముసలాయన మంచం దగ్గరికి వెళ్ళి దిండు కింద బీరువా తాళం చెవుల కోసం వెతికాము.

దొరికాయి. సంతోషంగా సుందరి గబగబా బీరువా దగ్గరకు వెళ్ళి తాళం తెరిచింది. అందులో ఒక అరలో చిన్న రేకుపెట్టె కనిపించింది. ఆ పెట్టెను తీసి తెరిచింది.

అందులో ఎనిమిదివేల రూపాయలు మరో రెండు వంద రూపాయలనోట్లు విడిగా కనిపించాయి.

అవి తీసుకుని యింకా ఏమయినా విలువైన వస్తువులు ఆ బీరువాలో దొరుకుతాయేమోనని చూసింది సుందరి.

కాని ఏమీ దొరకలేదు. ఎక్కడా మా వేలిముద్రలు పడకుండా చాలా జాగ్రత్తపడ్డాము.

"ఇక చాల్లే....వచ్చెయ్యి....వెళదాం....ఎవరైనా వస్తే ప్రమాదం" అన్నాను.

"బీరువాకు తాళం వేద్దామా?" అన్నది సుందరి.

"వద్దు. దగ్గరకు వేసెయ్యి. తాళం చెవుల్ని ఆ బీరువాలోనే వుంచెయ్యి. ఆయన లేచి చూసుకున్నా యెవరో దొంగలుపడి దోచుకుపోయారని అనుకుంటాడు" అన్నాను.

సుందరి సహచర్యంతో నాలో కూడా దొంగ లక్షణాలు బాగానే వచ్చేశాయి. సుందరిలో చేతివాటాన్ని మార్చాలనుకున్న నేనే దొంగగా మారిపోయాను.

ఇద్దరం మా పోర్షన్‌లోకి వెళ్ళి ఆ డబ్బును జాగ్రత్తగా బీరువాలో పెట్టాము.

మంచం మీద పడుకున్న తర్వాత "అంతా మనం అనుకున్నట్టుగానే జరిగింది" అన్నది సుందరి.

"ముసలాయన తెల్లారిలేచి గొల్లుమంటాడు" అన్నాను.

"అననివ్వండి. ఏం ఫర్వాలేదు. సొంత యిల్లు వుంది. పెన్షన్ వస్తుంది. ఆయనకు ఈ ఎనిమిదివేలు ఒక లెక్కా కాదు" అన్నది తేలిగ్గా—

చేసిన దొంగతనానికి యిలా ఏదో విధంగా సుందరి సమర్థిస్తూనే వున్నది.

ఇద్దరం మెల్లగా నిద్రలోకి జారుకున్నాము.

రాత్రి ఒంటిగంట కావస్తున్నప్పుడు యెవరో తలుపు

మీద చప్పుడు చేసిన శబ్దం వినిపించింది.

మంచం మీద లేచి కూర్చుని "ఎవరు." అన్నాను.

"టెలిగ్రాం సార్" అని వినిపించింది.

నాకు భయమేసింది. టెలిగ్రాం ఎవరు ఇచ్చివుంటారు? ఓ ఐదు రోజుల క్రితం మా మేనమామకు ఒంట్లో బావుండ లేదని ఉత్తరం వచ్చింది. ఒకవేళ ఆయన గుటుక్కు మన్నాడా?

ఆలోచిస్తూనే లేచివెళ్ళి తలుపు తెరిచాను.

అంతే .. నన్ను నెట్టుకుంటూ నలుగురు మనుషులు యింట్లోకి జొరబడ్డారు. వా శ్ళెవరో తెలిసి వణుకుపుట్టింది.

నలుగురూ జెమాజెట్టీల్లాంటి దొంగలు. వాళ్ళను చూడ గానే నాకు నోరు పెగల్లేదు. వాళ్ళ చేతుల్లో కత్తులు— ఒకడి చేతిలో తుపాకి వున్నది.

వాళ్ళే తలుపుల్ని మూశారు.

"అరవకు. అరిచావంటే నిన్ను నీ భార్యను చంపి వెళ్ళిపోతాం" అన్నాడు తుపాకీ పట్టుకున్నవాడు హెచ్చ రికగా—

అప్పటికప్పుడే వాళ్ళు జేబుల్లోనించి నైలాన్‌తాళ్ళు తీసి నిద్రలో వున్న నా భార్య సుందరి చేతులు—కాళ్ళు కట్టే శారు. తర్వాత నోట్లో గుడ్డలు కుక్కేశారు.

నన్ను కూడా కట్టేసి "త్వరగా బీరువా తాళాలు ఎక్కడ వున్నాయో చెప్పు....మాకు టైమ్ లేదు. మళ్ళీ యింకో యింటికి వెళ్ళాలి" అన్నాడు ఒకడు కత్తి చూపించి.

వాళ్ళను విసిగిస్తే ప్రాణానికే ప్రమాదం అని బీరువా తాళంచెవులు ఎక్కడ వున్నదీ చెప్పాను.

నా నోట్లో గుడ్డలు కుక్కి, బీరువా తాళంచెవులు తీసు కుని, బీరువా తెరిచి అందులో మేము ముసలాయన దగ్గర

కాజేసిన ఎనిమిదివేల రెండువందల రూపాయలతో మేము దాచుకున్న వెయ్యి రూపాయలు తీసుకున్నారు. తర్వాత సుందరివి నగలు, నాలుగు పట్టుచీరలు ఇంకా కొన్ని అమెరికన్ జార్జెట్-పాలిస్టర్ చీరలు మూట కట్టుకున్నారు. తర్వాత సుందరి మెళ్ళో వున్న ఒక గొలుసు—చెవులకు వున్న రింగులు, చేతులకు వున్న నాలుగు బంగారుగాజులు, ఒక వుంగరం కూడా లాక్కున్నారు.

టేబిల్‌మీద వున్న నా వాచీ—ట్రాన్సిస్టర్—టేప్ రికార్డర్—నావి ఖరీదైన మూడు ఫ్యాంట్లు—నాలుగు షర్టులు యింకా ఓ వెండి కంచం అన్నీ మూటకట్టేసు కున్నారు.

ఈ లోపలే ఒకడు ముసలాయన పోర్షన్‌లోకి వెళ్ళి ఓ వెండి గ్లాసును తీసుకువచ్చాడు.

అన్నీ సర్దుకోవటం పూర్తయిన తర్వాత "మీరు చాలా మంచివాళ్ళు ... మాకు బాగా సహకరించారు. మీ లాగా బుద్ధిగా వినే మనుషులు వుంటే మా లాంటి దొంగలు వెయ్యేళ్ళు సుఖంగా వర్ధిల్లుతారు.... గుడ్‌నైట్" అని తలుపులు తెరుచుకుని వెళ్ళిపోయారు దొంగలు.

నాకు ఏడుపు వచ్చింది. కాని మగవాడిని కాబట్టి ఏడవ లేకపోయాను. కాని పాపం! సుందరి ఏడ్చేసింది. కళ్ళ వెంట నీళ్ళు బొటబొటా కారిపోయాయి.

ఏంచెయ్యను? ఓదార్చటానికి నా నోరు, చేతులు కూడా వీలుగా లేవు. అందుకే కళ్ళతోనే ఏడవొద్దన్నట్టు సైగ చేశాను.

అయితే నాకు ఒక్కటే అనుమానం—ఈ సంఘటన తర్వాతనైనా సుందరి తన దొంగ బుద్ధిని మార్చుకుం టుందా??

□

చెయిప్పణ్ణింకట్టుకోండి

—ఎం.డి. చైతన్య

కంట్రాక్టర్ హుసేనయ్య గడియారం చూసుకున్నాడు.
ఆరున్నర దాటింది.

ఇంకా రాలేదేమిటీ, అనుకున్నాడు.

అతనికి అసహనంగా వుంది.

పార్కులో జనసమ్మర్దం క్రమంగా క్షీణిస్తుంది, చలి

కాలం కాబట్టి.

హుసేనయ్యకు ఏమీ తోచక గడ్డిపరకలు పీకి పళ్ళ సందులో ఇరికించుకుంటున్నాడు.

పావు తక్కువ ఏడు అవుతుండగా అల్లంత దూరంలో వస్తూ కనిపించాడు రాఘవయ్య.

అతన్ని చూడగానే హుసేనయ్య కళ్ళు ఆనందంతో మెరిసాయి.

రాఘవయ్య పార్కులో అడుగుపెట్టి హుసేనయ్య కోసం నలుదిక్కులా చూసాడు.

హుసేనయ్య క్లాప్స్‌కొట్టి—"రాఘవయ్యగారు రండి, నే నిక్కడున్నాను" అంటూ పిలిచాడు.

రాఘవయ్య అటుకేసి నడిచాడు.

"ఇంత ఆలస్యమైం దేమిటి?" ప్రశ్నించాడు హుసేనయ్య.

రాఘవయ్యగారు లాన్‌లో కూర్చుంటూ—"వూరు నుంచి ఒక మిత్రు డొచ్చాడు. అతనితో మాట్లాడి వచ్చేసరికి ఈ టైమైంది!" అన్నాడు.

"అలాగా."

కొద్దిసేపు మౌనం రాజ్యమేలింది వా రిద్దరి మధ్య.

"ఆఁ చెప్పండి! నేను ఆఫీసు కొస్తే—ఇక్కడొద్దు సాయంత్రం పార్కులో కలుసుకుందామన్నారు."

"ఔను....మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాల్సి వుంది."

"ఏం మాట్లాడినా రెండువేలకంటే ఎక్కువ ఇచ్చుకోలేనండి రాఘవయ్యగారు! మీకు తెలుసుగా నేనేదో చిన్నపాటి కాంట్రాక్టర్‌ను. ఆ బిల్లు పాసైతే రెండు లక్షలు వస్తాయని మాటేగానీ—యస్.ఇ. గారికి, ఇ.ఇ. గారికి,

ఏ.ఇ. లకు అందరికి పోనూ నాకు పెద్దగా ఏమీ మిగలదు" అన్నాడు హుసేనయ్య ప్రతిమలాడుతున్నట్టుగా.

"మీ బిల్లు పాస్‌చేసే బాధ్యత నాది ఆ విషయంలో మీ రేమీ కంగారు పడనవసరంలేదు."

"అలా అన్నారు బావుంది!"

"బిల్లు పాస్ చేసినందుకు మీరు నాకు డబ్బులు యేమీ యివ్వక్కర్లేదు."

కంట్రాక్టర్ హుసేనయ్య ఆశ్చర్యపోయాడు. డబ్బు లేకుండా బిల్లు పాస్‌చేయడమేమిటి? వస్తురూపంలో ఏదైనా కోరుతాడేమో అనుకున్నాడు.

"ప్రతిఫలంగా నన్ను ఏమివ్వమంటారో చెప్పండి!"

క్షణమాగి అన్నాడు రాఘవయ్య.

"నేను కోరే కోరిక మీకు వింతగా ఆశ్చర్యంగా కని పించవచ్చు. మీరు మాత్రం నా కోరిక తీర్చాలి."

"తప్పకుండా తీరుస్తాను. అదేమిటో మీరు సెల వివ్వండి!"

"నన్ను నట్టనడి రోడ్డుమీద. పట్టపగలు హత్యచేసే ఏర్పాటు చేయండి!" అన్నాడు ఎలాగో.

ఆయన కంఠం బాగా ఒణికింది.

హుసేనయ్య షాక్ తిన్నాడు. తన చెవులను తానే నమ్మ లేకపోయాడు. తను యెన్నో హత్యలు చేయించాడు. హత్యలు చేయించమని తన దగ్గరికి అనేకమంది వస్తుం టారు. కానీ ఈ బాపతు కేసు అతనికి ఎదురవ్వడం ఇదే మొదటిసారి. అతను ఆ షాక్‌నుండి తేరుకొని—

"రాఘవయ్యగారు యేమిటి మీ రంటున్నది....?" అన్నాడు.

"ఔను, నన్ను హత్యచేసే ఏర్పాటు చేయండి! ఇందుకు

మీరు ఒప్పుకుంటే రేపే మీ బిల్లు పాస్‌చేస్తాను" అన్నాడు దృఢంగా.

చక్కగా ఆర్. అండ్ బి. లో యు.డి సి గా వుద్యోగం చేసుకుంటున్న యీాయనకు చావాలని యెందుకు బుద్ధి పుట్టిందో హూసేనయ్యకు అర్థం కాలేదు. అదే ప్రశ్న అడిగాడు.

"మీరు చావాలని ఎందుకు అనుకుంటున్నారు?"

"ఆ ప్రశ్న మాత్రం వెయ్యకండి! మీకు అంతగా తెలుసుకోవాలని వుంటే ఈ కవరు మీ దగ్గిర వుంచుకోండి. అందులో అన్ని విషయాలు రాసాను. ఒక్క షరతు యేమిటంటే నేను చనిపోయిన తర్వాతనే ఆ కవరు చించి చదవండి. అంతదాకా ఆ కవరు విప్పవొద్దు" అంటూ కవరు అందించాడు.

తన చావుకు కారణమేమిటి? అనే ప్రశ్న తప్పక వుదయిస్తుందని ఆయన ముందుగానే ఊహించి, దానికి కారణాలు ఆయన కాగితంమీద వ్రాసి కవరులో పెట్టి అతికించాడు.

హూసేనయ్య ఆ కవరు అందుకున్నాడు.

"ఏమంటారు? ఒప్పుకున్నట్లేనా?" రెట్టించాడు రాఘవయ్య.

హూసేనయ్య కొన్ని క్షణాలు యోచించి—

"మీరు అంతగా అడుగుతుంటే ఎలా కాదనగలను. మీ కోరిక ఎటువంటిదయినా అది తీర్చడం నా కనీస కర్తవ్యం. ఎంచేతనంటే మీరు నా బిల్లు పాస్ చేస్తున్నారు. మా వెంకటిగాడితో చెప్పి పని పూర్తి చేయిస్తాను. ఎప్పుడు చేయమంటారో చెప్పండి!"

"రేపు మీ బిల్లు పాస్ అవుతుంది. ఎల్లుండి మధ్యాహ్నం 12 గ॥లకు ఇరానీ హోటల్లో టీ త్రాగి ప్రకాశం

బజారులో నడుస్తుంటాను. అప్పుడు మీ మనిషిని మారువేషంలో వచ్చి పని పూర్తిచేసుకోమని చెప్పండి!"

"తప్పకుండా! అంతా మీరు కోరుకున్నట్లే జరుగుతుంది. మీరు మాత్రం రేపు బిల్లు పాస్ చేసెయ్యండి!"

"అలాగే....యిక వెళ్దామా!" అంటూ లేచాడు రాఘవయ్య.

2

కంట్రాక్టరు హుసేనయ్య బిల్లు పాసయింది.

అతని చేతికి క్యాష్‌కూడా వచ్చింది. రాఘవయ్యను హత్య చేయడంకోసం హుసేనయ్య వెంకటికి చెప్పివుంచాడు. వాడికి అడ్వాన్సుగా అయిదు వందలు యిచ్చాడు.

వెంకటికి రాఘవయ్య బాగా తెలుసు. కాబట్టి ఆయనను గుర్తుపట్టడం ఒక సమస్య కాదు.

వెంకటి యింట్లో తన బటన్ చాకును బాగా నూరుకున్నాడు.

ఆ కత్తి హుసేనయ్య చెప్పితే ఇప్పటికే ఎన్నో ప్రాణాలను తీసేసింది.

ఉదయం 11 గం॥లకు ధైర్యంకోసం బాగా మందుకొట్టి__12 గంటలకల్లా ప్రకాశం బజారు చేరుకున్నాడు.

రాఘవయ్య ఇరానీ హోటల్లో కూర్చొని టీ త్రాగాడు.

అయిదు నిముషాల తర్వాత బయటికి వచ్చి కిళ్ళీకొట్టు దగ్గర ఒక సిగరెట్ కొనుక్కొని వెలిగించాడు. వక్కపొడి నోట్లో వేసుకున్నాడు.

వెంకటి, రాఘవయ్యను అనుసరించాడు.

అతను మారువేషంలో వున్నాడు కాబట్టి ఎవరూ గుర్తు

పట్టణానికి ఆస్కారం లేదు.

"మాష్టారు అగ్గిపెట్టె వుందా?" కొంచెం ముందుకొచ్చి అడిగాడు రాఘవయ్యను.

వెంకటి సిగరెట్ వెలిగించి ఎడమచేత్తో అగ్గిపెట్టె యిస్తూ కుడిచేత్తో తన పదునైన కత్తిని ఆయన కడుపులో దించేసాడు.

రాఘవయ్య పెద్దగా అరుస్తూ నడి రోడ్డుమీద పడి పోయాడు.

ఆయన అరిచేలోగానే వెంకటి ఎవ్వరికీ కనిపించకుండా పారిపోయాడు.

సరాసరి హుసేనయ్య యింటికి వెళ్ళి పని పూర్తి అయిందని చెప్పి మిగతా అయిదు వందలు అడుక్కున్నాడు.

3

మర్నాడు వుదయం హుసేనయ్య పేపరులో పడిన వార్తను చూసి ఆశ్చర్యపోయాడు. రాఘవయ్యగారు ఆస్పత్రిలో కోలుకుంటున్నారట.

"మైగాడ్! ఆయన కోరిక తీరలేదన్నమాట. పాపం, బ్రతకనీలే, పిచ్చివాడు యెందుకో చావాలనుకున్నాడు" అనుకోగానే రాఘవయ్య తనకు యిచ్చిన కవరు గుర్తొచ్చింది.

బీరువాలో పెట్టిన ఆ కవరును తీసుకొచ్చి విప్పి చదవడం మొదలెట్టాడు.

"నేను మరో వారంరోజుల్లో రిటైర్ కాబోతున్నాను. ఎదిగిన కొడుకులున్నారు కానీ వారికి ఉద్యోగాల్లేవు. ఎదిగిన కూతుళ్ళున్నారు కానీ—వాళ్ళకు పెళ్ళిళ్ళు చేయలేక పోయాను.

ఈ వారంరోజుల్లో గనక నేను చనిపోతే—నా పెద్ద బ్బాయికి G.O. Ms No. 1005 ప్రకారం వుద్యోగం దొరుకుతుంది. ఫ్యామిలి బెనిఫిట్ ఫండ్ రూపాయలు 10,000/- దొరుకుతాయి. ప్రావిడెంటుఫండు యెలాగు వస్తుంది. 25,000/- చేపిన ఇన్సురెన్సు డబ్బు వస్తుంది. నేను చచ్చిపోతే అమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేసే ఆర్థికస్థోమత ఏర్పడుతుంది. అబ్బాయికి వుద్యోగం దొరుకుతుంది. నేను చనిపోవడం కూడా నా స్వార్థం కోసమే! కాబట్టి నన్ను చంపి అ పుణ్యం కట్టుకోండి!

—స్వార్థజీవి, రాఘవయ్య."

ఉత్తరం చదువుకున్న హుసేనయ్య "పాపం, రాఘవయ్య!" అనుకొని కళ్ళు తుడుచుకున్నాడు. అతనికి డబ్బు సహాయం చేయాలన్న సంకల్పంతో హాస్పిటల్ వైపు దారి తీసాడు హుసేనయ్య. □

"ఏదో పడింది!"



బంగారపు గొలుసు

—చంద్రశేఖర ఆజాద్

S.L.S. BOOK STALL
VJA.6
PATAMATA

పురంధరామయ్యాగారు గంభీరంగా కూర్చుని వున్నారు.

ఆయన ప్రక్కన సగం త్రాగి వదిలేసిన మంచినీళ్ళ గ్లాసు వుంది. ఆయన ఓసారి పైపంచెతో మొహం తుడుచుకున్నారు. ఆయనకెదురుగా ఆ ఇంటిలో వారందరూ వున్నారు.

తలుపుచాటున మాత్రం లక్ష్మి నిలబడి వుంది. ఆమె కళ్ళు దిగులుగా వున్నాయ్.

పరంధరామయ్యగారే మాట్లాడారు.

"అదీ సంగతి. రాజు నాకిది ఇచ్చి పంపాడు. అమ్మాయికి లెటర్ రాసిచ్చాడు" అంటూ జేబులోనుండి ఓ పొట్లాం తీసి ఇచ్చాడు. దాంతోపాటు ఓ కవర్ అందించాడు.

లక్ష్మి నాన్నగారు వాటిని అందుకున్నారు.

తిరిగి నిశ్శబ్దం.

"మరి నేను వెళ్ళివస్తాను" పరంధరామయ్యగారి కంఠమే తిరిగి నిశ్శబ్దాన్ని చీల్చింది.

"భోంచేసి వెళుదురు" లక్ష్మి తల్లి అంది.

"లేదు. నాకు వేరే పని వుంది. రాజు బలవంతంమీద వచ్చాను. వెంటనే వెళ్ళాలి" అంటూ లేచాడు.

ఇంకేం మాట్లాడలేదెవరూ.

ఆయన లక్ష్మివంక తిరిగి "వెళ్ళొస్తానమ్మా" అన్నారు.

"ఊ" అంది. కాని ఆ శబ్దం నోటినుండి బయటకు రాలేదు. తలమాత్రం కదిలింది అప్రయత్నంగా. పరంధరామయ్యగారు వెళ్ళిపోయారు.

ఇల్లంతా నిశ్శబ్దం. లక్ష్మి నాన్నగారు పొట్లాం, కవర్ ప్రక్కనున్న బల్లమీదుంచి బయటకు వెళ్ళిపోయారు. అమ్మ వంటింట్లోకి వెళ్ళిపోయింది. లక్ష్మి మెల్లగా వచ్చి వాటి నందుకొని తన గదికి వెళ్ళిపోయి తలుపు గడియ వేసుకుంది. మంచంమీద కూర్చుని ముందు పొట్లాం విప్పింది.

గులాబిరంగు కాయితంలో ధగధగలాడుతుంది.

బంగారపు గొలుసు!

2

రాజు లక్ష్మిని చేసుకునే నాటికి ఏ ఉద్యోగం లేదు. ఆ సంగతి తెలిసే లక్ష్మి తల్లిదండ్రులు పెళ్ళిచేశారు. రాజు ఇంటర్ పాసయ్యాడు. ఎక్కడోచోట ఉద్యోగం వేయించు కొంటామనే షరతుతోనే వివాహం చేయటం జరిగింది.

రాజుకు వేరే ఆస్తులేం లేవు. స్వశక్తి మీదే బ్రతకాలి. అంతకు ముందు రెండు సంవత్సరాల క్రితమే చదువు మానుకొని కొన్నిచోట్ల పనిచేసినా పెళ్ళినాటికి ఏ ఉద్యోగం లేదు.

రాజుకు తండ్రి లేడు. తల్లి వుంది. ఆవిడకు ఎప్పుడు చచ్చిపోతానో అని భయం. అందుకే బ్రతికుండగానే రాజు పెళ్ళిచూసి పోవాలని ఆశ. ఈ సంబంధం రాగానే బల వంతం చేయసాగింది.

రాజు ఆమెకు అన్నీ వివరించాడు. ఏదైనా ఆధారం చూసుకున్నాకే పెళ్ళి చేసుకుంటానన్నాడు. ఉద్యోగం విషయం వాళ్ళెటూ చూసుకుంటానంటున్నారు కనుక ఈ పెళ్ళి జరిగి తీరాలని పట్టుబట్టింది. రాజు ఆమె కోర్కెను తిరస్కరించలేకపోయాడు. పెళ్ళి అయింది. లక్ష్మి జీవితం లోకి వచ్చింది. రాజుకు నాలుగు జతల బట్టలొచ్చాయి.

లక్ష్మి మెడలో గొలుసువంక రాజు అద్భుతంగా చూస్తూ వుండేవాడు. రాజు వాళ్ళమ్మకు ఏ గొలుసులూ లేవు. లక్ష్మికి ఆ గొలుసు వాళ్ళమ్మగారే చేయించారు. ఆ గొలు సంటే లక్ష్మికి ప్రాణం. అసలు లక్ష్మికి బంగారమంటేనే ప్రీతి.

పెళ్ళి అయ్యాక ఉద్యోగం విషయం మరిచిపోయారు లక్ష్మి తల్లిదండ్రులు. రాజుకు ఏదో ఒక పని అర్జెంటుగా చూసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఓ కిళ్ళీకొట్టులో

గుమస్తాగా కుదిరాడు. ఆయన నెలకు నూటిరవై రూపా యలు ఇస్తారు. ఆ విధంగా క్రొత్తజీవితం ప్రారంభ మయింది.

ఆ ఊరు అంత పెద్ద పట్నం కాదు. పల్లెకాదు. మొత్తం మీద నూట ఇరవైతోనే సరిపెట్టుకునేవారు. లక్ష్మి పొదుపు గానే వాడుతుంది. డబ్బుకు కొంచెం కష్టం అనిపించినా మొత్తంమీద పెద్ద ఇబ్బందులు లేకుండానే గడిచిపోతోంది.

లక్ష్మి సంసారం గురించి చాలా ఊహించుకొంది. పెద్ద మోతుబరి భార్య నవుదామనుకొంది. లేకుంటే మంచి ఉద్యోగస్థుడు దొరకగలడనుకొంది. అప్పుడు డబ్బులు మిగిల్చి చెవులకు, ముక్కుకు, చేతులకి, కాళ్ళకు, తల మీదకు, నడుంమీదకు బంగారపు వస్తువులు నింపాలను కొంది. నగలంటే అంత ప్రాణం లక్ష్మికి.

అయితే రాజుతో జీవితాన్ని ఎడ్జస్ట్ చేసుకోలేకపోతోంది లక్ష్మి. అయినా తన కోర్కెల్ని బయట పడనిచ్చేది కాదు. రాజు ఎలా అయినా సంపాదిస్తే బాగుండుననిపించేది. పెళ్ళయినాక ఉద్యోగం సంగతి మర్చిపోయిన తన పుట్టింటి వారి గురించి మరిచిపోయింది. వారిని ఇబ్బంది పెట్టకూడ దనుకొంది.

రాజువాళ్ళు పరంధరామయ్యగారింట్లో అద్దెకుంటున్నారు. ఆయన పెద్దమనిషి. మంచివాడు. అద్దె ఇవ్వటంలో కొన్ని నెలలు జాప్యం అయినా వత్తిడి చేసేవాడు కాదు. ఆయన లక్ష్మిపట్ల కూడా ఎంతో అభిమానం చూపించేవారు.

"రాజు ఏనాటికైనా మంచి ఉద్యోగస్థుడవుతాడు కోడలు పిల్లా" అంటుండేవాడు. ఇలా వుండగా అకస్మాత్తుగా ఓ సంఘటన జరిగిపోయింది.

రాజుకు ఓ ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం ఇప్పించగల

నని ఓ వ్యక్తి చెప్పటం జరిగింది. అందుకు మొత్తం రెండువేలివ్వాలి. జీతం అయిదువందలు. నాలుగు నెలలు మనవి కావనుకుంటే సరి అనుకున్నాడు రాజు. మరి డబ్బిదే సమస్య. ఏం చేయాలి?

ఈ విషయం గురించి లక్ష్మితో అన్నాడు. విని పూరు కొంది. రాజుకు అభిమానం ఎక్కువ. ఆ తర్వాత మాట్లాడ కుండా తనకు తెలిసిన, తనను అభిమానించే కొందరినుండి కొంత కొంత చేబదుళ్ళు తీసుకొని ఆ మొత్తం కట్టాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి కనపడటం మానేశాడు. రాజు పరిస్థితి తెలిసినవారు సానుభూతి చూపించటం మొదలుపెట్టారు. అది భరించటం కష్టమయింది.

మొత్తం రెండువేల రూపాయలు బాకీ తీర్చాలి. వేరే మార్గం లేదు. లక్ష్మి మెడలో గొలుసు అమ్మాలని నిర్ణ యించుకున్నాడు. ఈ నిర్ణయం బాధాకరమే అయినా తప్ప లేదు. ఈ విషయం విన్నాక లక్ష్మి గుండె పగిలింది. గొలుసు ఇవ్వటానికి ఆమె ససేమిరా ఒప్పుకోలేదు. ఇంట్లో రగడ మొదలయింది. బంగారం గురించి రోజూ కొట్లాటే. రాజు తల్లి ఏం మాట్లాడలేక ఏడ్చేది. రాజుకు అశాంతి పెరిగిపోయింది.

ఆ రోజు....

"గొలుసు ఇస్తావా....ఇవ్వవా" అన్నాడు రాజు.

"నేనివ్వను" మొండిగా అంది లక్ష్మి.

"ఇవ్వవా" రెట్టించాడు.

"ఇవ్వను."

అకస్మాత్తుగా రాజు చెయ్యి గాల్లోకి లేచింది. అది తగి లితే ఎంత దూరంలో పడేదో రాజు తల్లి వెనెకనుండి పట్టు కొని రాజును ప్రక్కకు నెట్టేసింది. ఈ గలాభాకు పరంధ

రామయ్య గారొచ్చారు. పరిస్థితి గమనించాక లక్ష్మికి నచ్చ చెప్పారు.

"చూడమ్మాయ్ కష్టాలనేవి అందరికీ వస్తుంటాయ్. వాడెవడో మోసం చేశాడు. మీ ఆయన ఉద్యోగం కోసమే కదా ఆరాటపడింది. ఏమైనా తాగి తందానాలాడాడా. ఈ ప్రపంచం అంతా మోసమే. తల్లీ బిడ్డల్నికూడా నమ్మలేకుండా వున్నాం. ఈ రోజు గొలుసుపోతే రేపు చేయించుకుంటాం. పరువుపోతే కష్టం. జీవితాంతం కలిపి వుండాల్సినవారు ఒకరిమీద ఒకరికి నమ్మకం లేకపోతే ఎలా? ఆ మాత్రం సహకరించుకోకపోతే సంసారాలు సాగటం కష్టం. అసలు బంగారాలు పెట్టేది ఎందుకు ఇలాంటి అవసరాలొస్తాయనే" అన్నారాయన.

"నాకంటూ వుంది ఈ ఒక్క గొలుసే" అంది లక్ష్మి. ఇంకా ఏమేమో అనాలనుకుంది—'పెళ్ళయి సంవత్సరం కావస్తూంది. ఒక్క చీరయినా కొన్నారా? ఓ సినిమా చూపించారా? ఏ సరదాలు ఏడ్చాయి. ఉన్న ఈ ఒక్క గొలుసూ పోతే నేనేం కావాలి" అంటూ.

"నిజమేనమ్మా. మరి అవసరం అలాంటిది" అన్నారాయన తిరిగి.

"ఇదిపోతే ఈ జన్మకు గొలుసు రాదండి" అంది లక్ష్మి. రాజు అభిమానం దెబ్బతింది. అసలు గొలుసు తీసుకోకూడదనుకున్నాడు. కానీ అవసరం అలాంటిది.

"వెధవ గొలుసు. సంవత్సరంలోపు చేయించేస్తా" అరిచాడు.

లక్ష్మికి పరంధరామయ్య గారిని కాదనే ధైర్యం లేకపోయింది. మెడలో గొలుసుతీసి ఇచ్చేసింది. అది అమ్మేసి మొత్తం బాకీలు తీర్చేశాడు రాజు. మిగిలిన డబ్బుల్తో ఓ

చీర....మల్లెపూలు కొనుక్కొని ఇంటికి వచ్చాడు.

లక్ష్మి పుట్టింటికి వెళ్ళిపోయింది.

తిరిగి రాగలదనుకున్నాడు. నెలరోజులు గడుస్తున్నా రాలేదు. లక్ష్మి ఇంటినుండి కూడా ఏవిధమైన ప్రతిస్పందన లేదు. ఈ విషయం రాజును ఆశ్చర్యపరిచింది. అయినా రాజు మాత్రం అక్కడకు వెళ్ళలేదు.

3

గొలుసు చూడగానే అంతా గుర్తుకొచ్చింది. వెంటనే మెడలో వేసుకొని అద్దంలో చూసుకొంది. ఎంతో అందంగా వుందనిపించింది. ఒక్కసారి సంతోషంతో పొంగి పోయింది. వెంటనే దిగులు కలిగింది. తిరిగి ఆశ్చర్యం కలిగింది.

ఆరు నెలలలోపు గొలుసెలా చేయించి పంపాడనేది ఆశ్చర్యం. ఈ ఆరు నెలలుగా తల్లితండ్రులు తనపట్ల అనుసరిస్తున్న వైఖరికి దిగులూ కలిగాయి. పెళ్ళి అవగానే ఇంత మారిపోతారా అనిపించింది. తనెన్ని కలలు కంది. అన్నీ ఎండమావులుగా నిలిచిపోయాయి. కనీసం తల్లి తండ్రులయినా ఆదరిస్తారనుకొంది. వాళ్ళు గొలుసు చేయిం చటం అలా వుంచి తిండి పెట్టడమే భారంగా వుందన్నట్లు చూశారు. తొలిసారిగా జీవితం గురించి ఆలోచన ప్రారంభం అయింది. అయినా బంగారంమీద మమకారం తొలగిపోలేదు. ఆ అవమానాల్ని భరించి ఇంట్లోనే వుండి పోయింది.

లక్ష్మి కవర్ చించింది. అందులో తెల్లటి కాయితంమీద రాజు అక్షరాలు మెరుస్తున్నాయ్.

"లక్ష్మికి,

నీ ప్రియమైన గొలుసు అంది వుంటుంది. ఆద

వాళ్ళకు బంగారం అంటే ఇష్టం అని విన్నాను. అయితే కాపురాలే కూల్చుకునేంత ఇష్టమని నీమండి తెలిస్తోంది.

బంగారం కోసం రాజులూ, దేశాలూ యుద్ధం చేసుకొన్నారు. బంగారంకోసం ఖూనీలు జరిగాయి. బంగారానికున్న విలువ తలుచుకుంటే సంతోషం, కోపం, దుఃఖం అన్నీ కలుగుతున్నాయ్. ఈ బంగారానికి ఉద్యోగం ఇప్పించేశక్తి, మోసంచేసే శక్తి, కాపురాలు కూల్చే శక్తి వున్నాయి. ఇంకా బంగారానికున్న అనంతమైన శక్తులు గురించి మనమింకా తెలుసుకోవాల్సి వుంది.

ఏది ఏమైనా నీ జీవితకాలంలోనే నీ గొలుసు నీకు చేరింది. ఆ తర్వాత ఏం చెయ్యాలో ఆలోచించుకోవలసినది నువ్వు. నిన్ను నేను బంగారం కొసం చేసుకోలేదు. మా అమ్మకోసం చేసుకొన్నాను. పెళ్ళయ్యాక ప్రేమించాను. ఇప్పటికీ ప్రేమిస్తున్నాను.

నీమీద కోపంతో దారుణమైన నిర్ణయాలు తీసుకోను.

నువ్వు వస్తే స్వాగతం.

—రాజు"

లక్ష్మి కళ్ళవెంట నీళ్ళు గిరుక్కున తిరిగి, బుగ్గలమీద జారి కాయితంమీద పడ్డాయ్.

4

రాత్రి పన్నెండు గంటలు దాటుతుంది.

ఇంకా నాలుగు గంటలు ప్రయాణం చేస్తేగాని ఊరు

రాదు. లక్ష్మికి రాజును చూడాలనే కోర్కె తీవ్రం అయింది. రాత్రి ప్రయాణం వద్దంటున్నా వినక బయలు దేరింది. తనెంత ఘోరంగా ప్రవర్తించానో తెలుసుకొని కుమిలిపోతోంది. వెళ్ళి గుండెలమీద వాలి క్షమించ మనాలి. రాజు మంచివాడు. డబ్బు లేకపోతేనేం. తన నెంతగా ప్రేమించాడు. నూట ఇరవై రూపాయలైతేనేం ఎంత ఆనందంగా బ్రతికారు. జ్ఞాపకాల్లోకి జారిపోయింది.

బస్సు సడన్ బ్రేకుతో ఆగింది.

రోడ్డు కడ్డంగా రాళ్ళు పేర్చి వున్నాయ్. అంతలోనే మొహాలకు ముసుగులు ధరించి ఆరుగురు ప్రవేశించారు. వారి చేతుల్లో గొడ్డెళ్ళూ, కత్తులూ వున్నాయ్. జనం భయంతో కొయ్యబారిపోయారు.

లక్ష్మి చేతులు భయంగా గొలుసును పట్టుకొన్నాయి. అందులో ఒకడు చూడనే చూశాడు.

"మర్యాదగా ఇటివ్వు" గర్జించాడు.

అప్రయత్నంగా తీసి ఇచ్చేసింది. మొత్తం బస్సంతా దోచి పారిపోయారు. లక్ష్మి మౌనంగా ఏడుస్తోంది. ఏ మొహంతో వెళుతుంది తను. గొలుసుకోసం తను వచ్చింది. మరి గొలుసు లేనిదే రానిస్తాడా?

* * *

తలుపు చప్పుడవుతుంటే రాజు లేచి తలుపు తీశాడు.

ఎదురుగా తలవంచుకొని లక్ష్మి.

"నువ్వా....రా" అన్నాడు రాజు.

అంతే. సుడిగాలిలా రాజు గుండెలమీద వాలిపోయింది వెక్కెక్కి ఏడుస్తూ రాజు తల నిమురుతూ వుండి పోయాడు. ఏడుస్తూనే అంతా చెప్పేసింది.

ఒక్క క్షణం రాజు స్తబ్ధుడయ్యాడు.

"పోతే పోయిందిలే వెధవ గొలుసు. దానికోసం వాళ్ళతో పెనుగులాడి ప్రాణాలు పోగొట్టుకున్నావుకావు" అన్నాడు రాజు.

లక్ష్మి ఆశ్చర్యంగా చూపింది.

"అవునోయ్. నువ్వేం దిగులుపడకు. ఇప్పుడు మన దగ్గరేం లేవు. హృదయాలు తప్పితే" అన్నాడు రాజు.

లక్ష్మి ప్రేమగా చూపింది.

రాజు కళ్ళలో కోటి గొలుసుల కాంతి.

లక్ష్మి అలానే గుండెల్లో వదిగిపోయింది. □

పోరాటం?



ప్రేమవేషిలు

వాణిశ్రీ

నిరంజన్ రిక్షా దిగి యింట్లోకి వస్తూ వుండగా శ్రీరాజ్ బైటకు వస్తున్నాడు. చేతిలో లావుపాటి ఫైల్ వుంది. ఇంటిముందు జీప్ ఆగింది.

"హాయ్ బావా!" అన్నాడు నిరంజన్.

శ్రీరాజ్ తలెత్తి చూసి "ఏమ్ నిరంజన్! ఏమిటీ రాక? కార్డు ముక్కయినా లేకుండా?" ఆశ్చర్యం ప్రకటించాడు.

"మీ వూళ్ళో అర్జెంటు పని తగిలింది. అది సరేగాని ఇంకా పది కాకుండానే ఆఫీసుకి బయల్దేరడం ఏమిటి? ఈ జీప్ ఎవరిది? జూనియర్ ఇంజనీర్స్‌కి గూడా జీప్‌లు ఇచ్చారా గవర్న్‌మెంట్‌వారు?"

శ్రీరాజ్ పకపక నవ్వాడు.

"మన కంట్రీ యింకా అంత భాగ్యవంతం కాలేదు లేవోయ్! ఇన్‌స్పెక్షన్‌కి ఎస్.ఐ. గారు వస్తున్నారు. అందుకు మనకీ వాహనయోగం పట్టింది. అంతకంటే మరేం లేదు."

"అంతేనా? నే నింకా జీప్‌లో షికార్లు కొట్టొచ్చనను కున్నానే!"

"నేను సాయంకాలం వచ్చాక మాట్లాడుకుందాం. నువ్వు స్నానంచేసి రెస్ట్ తీసుకో" అంటూనే శ్రీరాజ్ జీప్ ఎక్కి వెళ్ళిపోయాడు.

తేజ వాకిట్లోకి వచ్చి చిరునవ్వు నవ్వింది. అన్నయ్యను చూడగానే ఆమె ముఖం వెలిగింది. నిరంజన్ చేతిలో బ్యాగ్ అందుకుని యింట్లోకి దారితీసింది.

"ఏమిటమ్మా? అర్జెంట్‌గా రమ్మని లెటర్ రాశావు?" ప్రశ్నించాడు నిరంజన్.

"ముందు స్నానం చేద్దువుగాని పద. తర్వాత చెప్తాను" అంది తేజ.

"స్నానానికి తొందర ఏముందిలే! ముందు సంగతి ఏమిటో చెప్పు. నీ లెటర్ వచ్చిన దగ్గర్నుంచి టెన్షన్‌గా వుంది."

"అన్నయ్యా!...." అంటూ బావురుమంది.

నిరంజన్ షాక్ తిన్నవాడిలా బిగుసుకుపోయాడు.

"అరే ...! ఏం జరిగిందమ్మా?ఎందుకు ఏడుస్తున్నావు? ఛ....ఛ....చిన్నపిల్లలా ఆ ఏడుపేమిటి? నాకు చెప్పు అసలు సంగతి ఏమిటి?" అంటూ నిరంజన్ ఆమెను బుజ్జగించాడు. కన్నీళ్ళు తుడిచాడు.

తేజ ఏడుపు ఆపుకుని చెప్పింది.

"అన్నయ్యా! ప్రసాద్ తమ్ముడు శంకర్ నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. పదివేలు యివ్వకపోతే నీ ప్రేమ లేఖలన్నీ మీ ఆయనకి చూపిస్తాను అని బెదిరిస్తున్నాడు. పదిరోజులు గడువు అని చెప్పాడు. అన్నయ్యా! నాకు భయంగా వుంది. మీ బావగారికి తెలిస్తే ఇంకేముంది?" తేజకి ఏడుపు ఆగలేదు.

నిరంజన్‌కి అసలు సంగతి అర్థమైంది.

తేజకి పెళ్ళి కాకముందు ప్రసాద్‌ని ప్రేమించింది. ప్రసాద్ యమ్.బి.బి.యస్. ప్యాసయ్యాడు. రెండులక్షలు కట్నం యిచ్చే సంబంధం వచ్చేసరికి అతని తల్లి ప్రభావతికి ఆశ పుట్టింది. తేజతో పెళ్ళికి ఒప్పుకోలేదు. ప్రసాద్ తండ్రి వెంకటరత్నం మంచివాడు. తేజ తన కోడలు కావడం ఆయనకు ఇష్టమే. కాని ప్రభావతి మొండిపట్టు పట్టింది. ఈ పెళ్ళి జరిగితే విషం తిని చచ్చిపోతానని బెదిరించింది.

ప్రసాద్ గూడా నిస్సహాయు డయ్యాడు. రెండులక్షల కట్నంతో అతనికి పెళ్ళయింది. తర్వాత అతని మామగారు అమెరికా పంపించాడు.

ఆ రోజుల్లో తేజ, ప్రసాద్‌కి వ్రాసిన ప్రేమలేఖలు అతని తమ్ముడు శంకర్ చేజిక్కించుకున్నాడన్నమాట.

వాటివి చూపించి తేజని బెదిరిస్తున్నాడు. రాస్కెల్!

నిరంజన్ కోపంతో పళ్ళు కొరికాడు.

"అన్నయ్యా! పదివేలు ఇచ్చి వాడి పీడ నాకు లేకుండా చెయ్యి. లేకపోతే నేను బ్రతకలేను" బొంగురుపోయిన గొంతుతో అంది తేజ.

"పదివేలు యిచ్చినందువల్ల యీ సమస్య పరిష్కారం కాదమ్మా?"

"మరి?"

"నువ్వు ప్రసాద్ కి యెన్ని లెటర్సు వ్రాశావో నీకు గుర్తుందా?"

తేజ తల అడ్డంగా వూపింది.

"పదివేలు తీసుకుని నాలుగు లెటర్స్ ఇస్తాడు. కొన్నాళ్ళ తర్వాత మరో పదివేలు ఇమ్మంటాడు. రుచి మరిగి పాతిక వేలు ఇమ్మంటాడు."

తేజ ఆందోళనగా చూపి "మరి యెలా అన్నయ్యా?" అంది.

"దీనికి శాశ్వత పరిష్కార మార్గం ఆలోచించాలి" అన్నాడు నిరంజన్.

"వాడిని చూస్తేనే నాకు వణుకు పుడుతున్నది అన్నయ్యా! ఇది వరకు ఎట్లా వుండేవాడు? పిల్లిలా ఉండేవాడు. ఇప్పుడు పులిలా మారిపోయాడు."

"కాల మహిమ. సరే! ఇక నిశ్చింతగా వుండు. వాడి సంగతి నేను చూసుకుంటాను" అన్నాడు నిరంజన్. అతని ముఖంలో క్రౌర్యం నిండివుంది. కోపంతో కళ్ళు ఎర్రబడి భయంకరంగా కనిపిస్తున్నాయి.

"వాడిని ఏమైనా చేస్తావా?"

"ఏదొకటి చెయ్యాలిగా. వాడే తెలివైనవాడినని అనుకుంటున్నాడు దొంగ రాస్కెల్."

"కొంపతీసి చంపుతావా ఏం?" తేజ భయంతో వణికింది.

"నేనేం చేస్తానో నీకు అనవసరం. వాడు మళ్ళీ నీ దగ్గరకు రాడు. సరేనా?" అంటూ నిరంజన్ పకపకనవ్వాడు.

తేజ గుండె వేగంగా కొట్టుకుంది.

2

నిరంజన్‌ని చూసి "హాయ్! నిరంజన్!" అన్నాడు శంకర్.

"ఎక్కడికి బయల్దేరావు? కాలేజీకా?" అన్నాడు నిరంజన్.

"అవును."

"నీ చదువెట్లా సాగుతోంది?"

"ఫైన్."

"ఈ మధ్య నువ్వు తేజ దగ్గరికి వెళ్ళావటగా?"

"యస్. అయితే అంతా చెప్పిందన్న మాట."

"ఊఁ ...పద. ఇంట్లోకి వెళ్ళి మాట్లాడుకుందాం."

ఇద్దరూ లోపలకు వెళ్ళారు.

శంకర్ అతన్ని తన గదిలోకి తీసికెళ్ళాడు.

"డబ్బు తెచ్చావా?" అతృతగా అడిగాడు శంకర్.

"ఊఁ. నీ దగ్గర ఎన్ని లెటర్స్ వున్నాయి?"

"పది."

"అంతేనా? దాదాపు వంద వుండాలని తేజ చెప్పింది."

"నాకు అంతవరకే దొరికాయి."

"ష్యూర్!"

"ష్యూర్!"

"అయితే సరే! మీ అమ్మగారిని పిలువు."

"ఎందుకు?" తెల్లబోయాడు శంకర్.

"డబ్బు యివ్వడానికి" అన్నాడు నిరంజన్.

"డబ్బు మా అమ్మకు యిస్తావా? అలా ఎందుకు? నాకే ఇవ్వు. లెటర్స్ నా దగ్గరే వున్నాయి."

"డబ్బు మీ అమ్మకు యివ్వడానికి కాదు."

"మరి?"

"తీసుకోవడానికి."

"డబ్బు మా అమ్మ దగ్గర తీసుకుంటావా?" శంకర్‌కి ఏమీ అర్థం కావడం లేదు.

"అవును."

"అదేమిటి?"

"అది అంతే."

"నాకు అర్థం కావడంలేదు."

అర్థమయ్యేటట్లు చెప్పమంటావా?

"ఊఁ."

"పదివేలు మీ అమ్మ దగ్గర వసూలుచేసి నీకు ఇస్తాను."

"అదేమిటి? మా అమ్మ డబ్బు ఎందు కివ్వాలి?"

"మా చెల్లాయి నీకు డబ్బు ఎందుకివ్వాలి?"

"మీ చెల్లాయి మా అన్నయ్యకు లౌ లెటర్స్ రాసినందుకు."

"లౌ లెటర్స్ రాస్తే డబ్బివ్వాలా?"

"ఇవ్వాలి గదా! అవి మీ బావ చూస్తే డేంజర్ గదా!"

"అలాగా!" అని నిరంజన్ జేబులోంచి ఒక కవరు తీసి అందులో వున్న కాగితాలు బైటపెట్టాడు.

"ఏమిటివి?"

"శాంపిల్‌గా ఒకటి చదువు."

శంకర్ అందుకుని చదివాడు. చదువుతున్నంత సేపూ అతని ముఖం వెలాతెలా పోయింది. చదివిన తర్వాత

S. L. S. Book Stall
Side: Mohandas Theatre
PATAMATA, VIJAYAWADA - 520 006

ముఖం నల్లబడింది.

"ఇప్పుడు అర్థమైందా మీ అమ్మ డబ్బు యెందు కివ్వాలో?" అన్నాడు నిరంజన్.

శంకర్ మాట్లాడలేదు. షాక్ తిన్నవాడిలా బిగుసుకు పోయాడు.

"త్వరగా మీ అమ్మను పిలువు. డబ్బు వసూలుచేసి నీ కిస్తాను. లేకపోతే ఈ లెటర్స్...."

"వద్దు." అని శంకర్ నిరంజన్ చేతిని పట్టుకున్నాడు.

"చూడు శంకర్! వయసులో వున్నవాళ్ళు ఆకర్షణకు లోనై ప్రేమలేఖలు రాసుకోవడం సహజం. ప్రేమించు కున్న వాళ్ళందరికీ పెళ్ళిళ్ళు కావు, అర్థమైందా?"

శంకర్ తల వూపాడు.

శంకర్ అన్నాడు.

"ఐ యామ్ సారీ!"

3

"నాకు గొప్ప సస్పెన్స్‌గా వుంది. శంకర్‌ని ఏం చేస్తావోనని హడలిపోతున్నాను" నిరంజన్‌ని చూడగానే అంది తేజ.

ఆమె ఆనందంగా వుంది. ముఖం తేటగా కనిపిస్తోంది.

"మళ్ళీ వచ్చాడా శంకర్!"

"వుహూఁ రాలేదు. అదే సస్పెన్స్. వాడ్నేం చేశావు?"

నిరంజన్ నవ్వాడు.

"షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చాను. ఈ జన్మకు మళ్ళీ బ్లాక్‌మెయిల్ చెయ్యడు."

"షాక్ ట్రీట్‌మెంటా?"

నిరంజన్ తలవూపి కవరులో నుంచి కొన్ని కాగితాలు తీసి ఆమె ముందు పెట్టాడు.

"ఏమిటి?" ఆశ్చర్యంగా అంది తేజ.

"చదువు." అన్నాడు నిరంజన్ తాపీగా సోఫాలో పడుకుంటూ.

తేజ అవి చదివి కొయ్యబారిపోయింది.

"ఏమిటివి?"

"ప్రేమ లేఖలు." నవ్వుతూ అన్నాడు.

"అది సరే శంకర్ వాళ్ళ అక్కయ్య శాంతి నీకు ప్రేమలేఖలు వ్రాసిందా?" ఆశ్చర్యంతో అడిగింది తేజ.

తల వూపాడు నిరంజన్.

తేజ నవ్వి "నేను నమ్మను" అంది.

"నీకు తెలుసుగదా శాంతి నాకు క్లోజ్ ఫ్రెండ్. ఇప్పుడు బలార్షాలో వుంటోంది. శాంతి భర్త అక్కడ సిమెంట్ ఫ్యాక్టరీలో ఇంజనీర్. నా కథలు పత్రికలలో పడినప్పుడల్లా శాంతి చదివి కామెంట్స్ వ్రాస్తూ వుంటుంది. నేనూ జవాబులు ఇస్తుంటాను.

శంకర్ నన్ను బ్లాక్ మెయిలింగ్ చేస్తున్నాడన్న విషయం ఆమెకు వ్రాశాను. నన్ను వెంటనే రమ్మని లెటర్ వ్రాసింది. వెళ్ళాను. మేము చదువుకుంటున్న రోజుల్లోవి తారీఖులు వేసి నాకు ప్రేమలేఖలు వ్రాసినట్లు కొన్ని తయారు చేసింది. అవి శంకర్‌కి చూపించి బెదిరించమని సలహా యిచ్చింది. స్వయంగా తన అక్క వ్రాసిన ప్రేమలేఖలు చూసి శంకర్ బెదిరిపోయాడు. కథ సుఖాంతం" నిరంజన్ నవ్వాడు.

"శాంతికి థాంక్స్ చెప్పాలి" అంది తేజ.

"నేను ఇదంతా ఒక కథ వ్రాయాలనుకుంటున్నాను" అన్నాడు నిరంజన్.

□

కరుణించని కరుణ

ఎమ్.వి.వి.సత్యనారాయణ

S.L.S. BOOKSTALL
VJA.6
PATAMATA

ఈదురుగాలి బలంగా కిటికీలోంచి లోపలకు దూసుకు వస్తోంది. గాలి తాకిడికి బస్సులోని కిటికీ తెరలు

ప్రక్కనున్న కమ్మీలకు టపటప కొట్టుకుంటున్నాయి. ఘాట్ రోడ్లో తన మానాన తాను పోతోంది బస్సు.

హెడ్ లైట్స్ కాంతి చీకటిని రెండు పాయలుగా చీల్చు తోంది.

బస్సులో దీపం వెలుగుతోంది.

"వచ్చేది అనంతగిరి" అంటున్నా రెవరో.

బస్సులో అందరూ ముడిచిపెట్టుకుకూర్చున్నారు. టవలో, మఫ్లరో చెవులకు చుట్టుకొని జోగుతున్నారు. బస్సులో చివరికంటూ వెళ్ళవలసినవాళ్ళు నిశ్చింతగా నిద్రపోతు న్నారు.

శంకరం నిస్సహాయంగా చీకట్లోకి చూశాడు. బస్సు వైజాగ్ నుండి బయలుదేరడమే ఆలస్యంగా బయలు దేరింది. అందుకు తోడు ఎస్ కోట దాటాక ఎదురు వస్తోన్న లారీ ఒకటి ప్రక్కకు దొర్లిపోయింది. లారీలో పదిమందివరకూ వున్నారని అంచనా వేశారు బస్సు డ్రైవరూ కండక్టరూ.

చీకటిలో తిరగబడి వుంది లారీ. లారీలో వున్న మనుషులను తిరిగి రోడ్డు మీదకు తీసుకురావాలని బస్సు ప్రయాణీకులు ప్రయత్నించారు. రెండు గంటలపాటు చీక టిలో శ్రమపడి అందరినీ వైజాగ్ వెళ్ళే బస్సులో పంపారు.

శంకరరావు నిట్టూర్చాడు. ఎవరో చస్తున్నారని మనమూ చచ్చిపోతామా? మధ్యలో రెండు గంటలు వ్యర్థం గాక పోతే తాను కనీసం రాత్రి ఎనిమిదీ తొమ్మిది గంటల కయినా అనంతగిరి చేరుకునేవాడు. బస్స్టాప్ నుండి అయిదు కిలోమీటర్లు నడవాలి.

పదకొండు గంటలకు బస్సు ఆగింది.

కండక్టర్ వెనక్కి తిరిగి, "అనంతగిరి ఎవరయినా దిగుతారా?" అన్నాడు.

శంకరరావు గుండె దిటవు చేసుకుని బస్సు దిగాడు. ప్రయాణీకులు ఎవరి ధోరణిలో వాళ్ళు నిర్లక్ష్యంగా చూస్తున్నారు. శంకర్రావుకు వాళ్ళమీద విపరీతమైన అసూయా, కసి, ద్వేషమూ పుట్టుకు వచ్చాయి. బస్సు కదిలింది. శంకరరావును చీకటిలో వదిలిపెట్టి నిర్దాక్షిణ్యంగా బస్సు వెళ్ళిపోయింది.

శంకరరావు ఎయిర్‌బాగ్ భుజాన సర్దుకున్నాడు. చుట్టూ చూశాడు. కారు చీకటి వ్యాపించి వుంది. చీకటిలో అక్కడక్కడా శపించబడిన అహల్యల్లాగా గుడిసెలు నిద్రోతున్నాయి. వాటిలో ఒక పగటి టీకొట్టు, మరొకటి కిళ్ళీబడ్డి. దూరంగా వున్న గుడిసె సారాయి దుకాణం. దాని ప్రక్కనుండే డొంకదారిన అనంతగిరి గ్రామానికి వెళ్ళాలి.

శంకరరావు మెల్లగా నడవసాగాడు. సారాయిదుకాణం దాటి కాలి బాటకు వచ్చాడు.

చీకటిలో ఎవరో నవ్వినట్టయింది. ఆ వెనుకనే గాజులు గల గల లాడాయి.

మర్రిచెట్టు ప్రక్క ఎవరో కదిలారు. శంకరరావుకు గుండెలు గుబగుబ లాడాయి. అర్ధరాత్రి. చిమ్మచీకటి. ఒంటరితనం.

"ఎవరు?" అడిగాడు శంకరరావు, గొంతు కీచుగా వచ్చి తనకే అసహ్యంగా వినిపించింది.

అతడి ముందు ఆకారం ప్రత్యక్షమయింది. చీకటిలో తెల్లచీర స్పష్టంగా కనిపిస్తోంది యిప్పుడు.

అతడికి గొంతు పొడారిపోయింది. అతడు నిత్య జీవి

తంలో మహాక్రూరుడు. పైగా దెయ్యాలలో నమ్మకం లేనివాడు. ఎదుట ప్రత్యక్షమైన స్త్రీ మూర్తిని ఏమని అంచనా కట్టగలడు? ఆమె దెయ్యం కాకపోతే యింత అర్థ రాత్రి యీ చిమ్మ చీకటిలో ఎలా వుండ గలిగింది?

నాన్సెన్స్! దెయ్యాలకు గొంతు వుండదు. ఆకారం వుండదు. పైగా దెయ్యాలకు తెల్లచీర ఎక్కడినుండి వస్తుంది?

"అనంతగిరికేనా?" అడిగింది ఆకారం!

శంకరానికి పోయిన ధైర్యం తిరిగి వచ్చింది. ఆమె అచ్చగా మనిషిలాగా మాట్లాడుతోంది!

"అవును. మీరు?" అన్నాడు శంకరరావు.

"నన్ను మన్నించ నక్కరలేదు. నేను మీకంటె చిన్న దాన్ని" అంది ఆమె.

అతడికి ఆమెపట్ల అభిమానం ఏర్పడింది. ఆమె వినమ్రత పట్ల ముచ్చట కలిగింది.

"నీపేరు?" అన్నాడు శంకరరావు.

"గౌరమ్మ. మీరు గౌరీ అని పిలవండి."

"గౌరీ! నువు ముందు నడువు. నేను వెనక నడుస్తాను."

"ఎయిర్ బాగ్ యిటు యివ్వవచ్చును కదా!"

"ఫరవాలేదు. ఆడదానివి. యింత చీకటిలో నువు నడవడమే కష్టం!"

ఆమె అతడిని తాకుతూ ఎయిర్ బాగ్ అందుకుంది. శంకరరావుకు ఒళ్ళు ఝల్లుమంది. ఆమె శరీరంమీద నుండి తియ్యటి వాసన అతడి ముక్కుపుటాలకు సోకింది. ఆమె ఏమీ ఎరుగనిదానిలాగా తిరిగి ముందు నడుస్తోంది.

ఎక్కడో తీతువుపిట్ట అరుస్తోంది. దూరంగా పొదలలో

నక్కలు కాటోలు వూళవేస్తోన్నాయి. కొండగాలి ఈదురుగా వీస్తోంది.

"మీరు ఎక్కడినుండి వస్తున్నారు?" అడిగింది ఆమె.

"వైజాగ్."

"అనంతగిరిలో ఎవరున్నారు?"

"గౌరీ!" భారంగా నిట్టూర్చాడు శంకరరావు. "చెప్పాలంటే నాకు అందరూ యిక్కడే వున్నారు వున్నదంతా యిక్కడే వుంది. కాని ఇప్పుడు ఎవరూ లేరు. ప్రస్తుతం నాకు అనంతగిరిలో ఏమీ లేదు."

గౌరి పకపక నవ్వింది. ఈదురుగాలి మధ్య ఆమె నవ్వు వింతగా వుంది. శంకరరావు నిర్ఘాంతపోయాడు. ఆమె ఎందుకు నవ్వుతోంది? కొంపతీసి ఆమెకు తనగురించి నిజం తెలుసునా?

తనవాళ్ళూ, తన ఆస్తిపాస్తులూ, అన్ని రకాల మానవ సంబంధాలూ తనకు యీనాటికీ అనంతగిరిలో వున్నాయి. అయినా తాను అర్ధరాత్రిపూట వస్తున్నాడు. వైజాగ్ వెళ్ళాక అయిదునెలలకు తిరిగి యిదే రావడం! రేపురాత్రి బస్సుకు తిరిగి వైజాగ్ వెళ్ళిపోవాలి. వైజాగ్‌బస్సు దొరక్కపోతే అటు ప్రక్క అరకులోయకయినా వెళ్ళిపోవాలి.

"అందుకేనా అర్ధరాత్రిపూట దొంగలాగా వస్తున్నారు?" అంది గౌరి.

శంకరరావు ఈసారి నిజంగానే ఖంగుతిన్నాడు. గౌరి ఎవరు? ఎవరికోసం యిక్కడ కాచుకుంది? తనగురించే ఆమె ఎదురు చూస్తోన్నదా?

"అబ్బ! ఏదయినా మాట్లాడండి! ఈ ఒంటరితనంలో" ఆమె వెనక్కి తిరిగింది. శంకరరావు ఆలోచనల మీద

మధురమైన రసం చిలికినట్టయింది.

అతడు చటుక్కున అడుగువేసి ఆమె చెయ్యి అందు కున్నాడు. ఆమె కిలకిల నవ్వింది. అతడికి మరింత ప్రోత్సాహమూ, మరెంతో వుద్రేకమూ తోసుకువచ్చాయి. శంకరరావు ఆమెను వెనుకినుండి వాటేసుకున్నాడు.

"వుష్...." అందామె. "మీకు మరీ ఆత్రంగా వున్న ట్టుందే! వూళ్ళోకి పదండి బాబూ ముందుగా!"

శంకరరావు వుద్రేకాన్ని బలవంతంగా అణచుకున్నాడు. తామిద్దరూ ఎంత త్వరగా అనంతగిరి చేరుకుంటే అంత మంచిది. ఈ రాత్రికి ఖుషీగా కాలం గడిచే అవకాశం దొరికింది.

"అబ్బ!" అంది గౌరి.

శంకరరావు చప్పున చేతులు చాపి ఆమెను పొదివి పట్టు కున్నాడు.

"ముల్లు గుచ్చుకుంది!" అంది గౌరి.

శంకరరావు ఆమె ముందు గొంతు కూర్చున్నాడు. ఆమె ఎయిర్ బాగ్ క్రిందకు దింపుకుంది. శంకరరావు ఎయిర్ బాగ్ లోంచి పెన్ టార్చ్ తీశాడు.

"ఇంతసేపూ తీయలేదేం? పెన్ టార్చ్ వుంచుకున్నారు" అంది గౌరి.

శంకరరావు మాట్లాడలేదు. తాను అనంతగిరికి నిశాచ రుడు. రాత్రిపూట ఒంటరిగా వచ్చి, అదే రాత్రి చీకటిలో తిరిగి వైజాగ్ చేరుకోవలసినవాడు. అందుకే ఎంతో అవ సరమైతేగాని పెన్ టార్చ్‌ని కూడా తీయదల్చుకోలేదు.

ఆమె పాదం ఎత్తింది. సూర్యరశ్మి సోకని కాలిపిక్కలు టార్చ్ కాంతిలో దంతపు సామగ్రిలాగా మిలమిలలాడాయి. గౌరి అతడి భుజాలమీదుగా ఆనుకుని ముందుకు వొంగింది.

"ఎక్కడ?" శంకరరావు తలెత్తి గౌరి మొహంలోకి చూశాడు. పెన్‌టార్చి కాంతి ఆమె మొహంమీద ప్రతిఫలిస్తోంది.

శంకరరావుకు వెన్ను జలదరించింది. ఆమె మొహం అసహజంగా వుంది. ఆమె పెదిమల అంచులవద్ద కోరపళ్ళు పొడుచుకువచ్చాయి. కళ్ళు ఆకుపచ్చ రంగులో వున్నాయి. జుత్తు రేగి వికృతంగా మొహంమీద పడుతోంది.

"ఎ—ఎవరు నువ్వు?" అడిగాడు శంకరరావు వణికిపోతూ.

"నేనే!" అంది గౌరి. అంటున్నప్పుడు ఆమె వికృతమైన పలువరస భీకరంగా కనిపించింది.

శంకరరావు చేతిలోంచి పెన్‌టార్చ్ జారిపడింది. కాళ్ళలో, నరాలలో నిస్సత్తువ వ్యాపించింది. లేచి పరుగెత్తాలని చూశాడు. ఆమె చేతులు అతడి భుజాలను అదుముతోన్నాయి. ఆమె ఛాతీ అతడి తలను తాకుతోంది. గాలిలో తియ్యటి వాసన వస్తోంది.

శంకరరావు వెనక్కి పడిపోయాడు. తరువాత ఏం జరిగిందో అతడికి తెలియదు. శంకరరావుకు స్పృహ తప్పింది.

2

"ఒరేయ్ శంకర్!" రమణారావు పిలిచాడు. అతడి మొహంమీద నీళ్ళు కూడా చల్లాడు.

శంకరరావు అటూ ఇటూ ఒత్తిగిల్లాడు. మెల్లగా కళ్ళు తెరిచాడు రమణారావు అతడిమీదుగా వొంగి కనిపించాడు.

"రమణా! ఎక్కడున్నాను?" కీచుమంది శంకరరావు గొంతు.

"మన యింట్లోనే. కంగారులేదు" అన్నాడు రమణా

రావు.

శంకరరావుకు వేడి కాఫీ అందించాడు రమణారావు. శంకరరావు కాఫీ తాగాక తేరుకున్నాడు.

"ఎలా వచ్చాను? నన్ను ఎవరయినా చూశారా?"

"లేదు. నేను చివరి బస్సుకు వచ్చాను. అరకునుండి."

"నేను వస్తున్నట్టు రాశాను. అయినా నువు అరకు వెళ్ళావా?"

"సాయంకాలమే రావలసింది. ఆ బస్సు రద్దయింది."

"వూఁ! తర్వాత ఏం జరిగింది?"

"చీకట్లో నా కంటె ముందు నువ్వు నడుస్తున్నావు. నేను ఎంత గట్టిగా పిలుస్తూన్నా నువు వినిపించుకోవడం లేదు. నీ నడకా, నువు అటూ యిటూ చేతులూపే తీరు గుర్తించాను. చివరకు ఒకచోట నువు గొంతు కూర్చున్నావు. పెన్‌టార్చ్ వెలిగించావు. తలెత్తి చూశావు. నీలో నువ్వే ఏదో గొణుక్కున్నావు. అంతే! వెనక్కి పడిపోయావు."

"అయితే నీకు గౌరి కనిపించలేదన్న మాట!"

"గౌరా? ఆమె ఎవరు?"

"ఏమో, ఆమె నాకు బస్‌స్టాపులో సారాయి దుకాణం వెనుక కనిపించింది. ఆమెలో నాకు అనసూయమ్మ పోలికలు కనిపించాయి. అంతే. నాకు స్పృహతప్పిపోయింది."

"అనసూయమ్మ చచ్చిపోయింది కదా!"

"అవును. నా చేతిలోనే అనసూయమ్మ చచ్చిపోయింది."

"అయితే ఆమె మరల ఎలా బతికి వచ్చింది?"

"అనసూయమ్మ అనలేదు కదా, ఆమె పోలికలతో వున్న కూతురు కావచ్చు."

"ఆమె కూతురు పేరు కరుణ."

"కరుణో అరుణో....తనపేరు గౌరమ్మ అనీ, తనని గౌరి అని పిలిస్తే చాలుననీ చెప్పింది."

"నీతోబాటు ఆడమనిషి ఎవరూ లేరు."

"చాల విచిత్రంగా వుంది."

"అవును."

"అనసూయమ్మ కూతురు కరుణ ఎక్కడుంది?"

"కరుణ యింకా ఎక్కడుంది? రేప్‌చేసి చంపేశారు కదా!"

"చంపేశారా? అయితే కరుణ దెయ్యమై వుంటుంది."

"నాన్సెన్స్! నువ్వేనా మాట్లాడుతోంది?"

"అవును. రాత్రి అనుభవం అయాక నాకు దెయ్యాలు వున్నట్టు నమ్మకం ఏర్పడింది."

"ఇంకా నయం!"

"నిజమే రమణా! ఇంతకాలమూ ఎవరయినా చెబితే నమ్మేవాడిని కాదు."

"దెయ్యం కాకపోతే అంత రాత్రివేళ నన్ను వెంబడించడం ఏమిటి? ఆమెకు పెదిమల మాటునుండి పొడుచుకు వచ్చిన దంతాల మాటేమిటి? మొహం మామూలు ఆడదాని మొహంలాగా లేకపోవడం ఏమిటి? ఆమె నా భుజాలమీద చేతులు వేసి ఆదిమింది కూడా."

"ప్చ్. నాకు అసలు కనిపించలేదేమిటి?"

"అదే మరి దెయ్యం అంటే! తాను కావాలనుకున్న వాళ్ళకే కనిపిస్తుందిట!"

"ఏమో, నాకుమాత్రం నమ్మకం లేదు."

"పోనివ్వు. నేను వూళ్ళోకి రావడం ఎవరయినా చూశారా?"

"లేదు. చీకటిలో నిన్ను నడిపించి తీసుకువచ్చాను."

శంకరరావు చుట్టూ చూశాడు. "ఎయిర్‌బాగ్ తీసుకు వచ్చావా?"

"ఆఁ? నువు కొద్దిసేపు పడుకో. తెల్లవారిపోతుంది."

"నిద్రపోవడానికా వచ్చింది?"

"కాదని తెలుసు."

"మరేం? పద. అనసూయమ్మ యింటికి వెళ్దాం."

"ఎక్కడ దాచావు?"

"ఉష్! గోడలకు చెవులుంటాయి."

"ఇంకా ఏం చెవులు? ఆ గొడవ ఏనాడో సద్దుమణిగి పోయింది."

"హత్య జరిగాక పారిపోయాను. నా మీద ఎవరికీ అను మానం రాలేదు కదా?"

"లేదు. నువ్వు అనసూయమ్మ మీద కన్ను వేశావని ఎవరికి తెలుసు? లక్షల విలువచేసే జహ్వారీ ఎత్తుకుపోవాలని చూపినట్టు యెవరికి తెలుసు?...."

"ఒక్క నీకు తప్ప....!"

"నాకయినా యెప్పుడు చెప్పావు? అనసూయమ్మను హత్యచేసి వచ్చాక. జహ్వారీని ఎక్కడో దాచిపెట్టుకున్నావు. తర్వాత నా దగ్గరకు వచ్చావు. నేను ఆ రాత్రికి రాత్రే నిన్ను ఊరు దాటించాను."

శంకరరావు మందహాసం చేశాడు. అయిదు నెలల తర్వాత తాను యిక్కడికి వస్తోన్నట్టు వుత్తరం రాశాడు. రమణారావు సాయంతోనే తాను జహ్వారీని స్వాధీనం చేసు కోవాలి. హత్య జరిగిన వెంటనే జహ్వారీని వెంట పెట్టు కుని తీసుకువెళ్ళడానికి తనకు ధైర్యం చాలలేదు. సోదా జరిపితే తనవద్ద ఆధారాలు దొరకకూడదు. పోలీసులు

హత్యకు కారణం కనిపెట్టలేక సతమతమయిపోయారు.

అనసూయమ్మ యింట్లోనే ఆమె జహ్వారీని దాచివుంచు తారని యెవరు వూహిస్తారు?

పది నిమిషాల తర్వాత స్నేహితు లిద్దరూ అనసూయమ్మ యింటి పరిసరాలలో వున్నారు.

3

అనంతగిరి గ్రామం చీకట్లో నిద్రపోతోంది. వీధిదీపం యెక్కడో దూరంగా మినుకు మినుకు మంటోంది. ఎక్కడోగాని పెంకుటిల్లు లేదు. అన్నీ తాటాకుల ఇళ్ళే!

ఆ ఊళ్ళో అదొక్కటే డాబా యిల్లు. ఆ యిల్లే అనసూయమ్మది. అనసూయమ్మ భర్తపోయి ఏడాదవుతోంది. అతడు మిలిటరీలో పనిచేసి బాగా డబ్బు పంపిస్తూండేవాడు.

అనసూయమ్మ దంపతులకు ఒక్కతే కూతురు. కరుణ యెక్కడో చదువుకుంటోందని మాత్రమే శంకరరావుకు తెలుసు.

శంకరరావు ఆ గ్రామానికి ఒక వ్యాపారస్తుడిగా పరిచయమయాడు. రమణారావుకూ అతడికీ స్నేహముంది. వ్యాపారం నిమిత్తం శంకరరావుకు అనసూయమ్మతో పరిచయమయింది. ఒకసారి అనసూయమ్మ ఆహ్వానం మీద అతడు ఆమె యింటికి కూడా వెళ్ళాడు.

అప్పుడే అనసూయమ్మ యింటి స్థితిగతులు వాసన పట్టాడు శంకరరావు. ఆమె జహ్వారీ చూసి కళ్ళు కుట్టుకున్నాడు. అంతే. పథకం వేశాడు. ఆరాత్రే అనసూయమ్మను గొంతు నులిమి చంపేశాడు.

జహ్వారీ మొత్తం దొరకబుచ్చుకున్నాడు. ఆ యింట్లోనే ఒకచోట పాతిపెట్టాడు.

"ఎటు వెళ్దాం? ఇంటికి చాలాకాలంగా తాళం పెట్టి వుంది" అన్నాడు రమణారావు.

"దాబాకు వెనక వైపుగా మామిడిచెట్టు వుంది. కొమ్మ ఎక్కి అటుప్రక్క మండువాలోకి దూకవచ్చును" అన్నాడు శంకరరావు.

ఇద్దరూ మండువాలోకి చేరుకున్నారు.

ఇల్లు బూజుపట్టి వుంది. శంకరరావు జేబులోంచి చిన్నసైజు రంపం, యితర పనిముట్లూ తీశాడు. నిమిషాలలో మెయిన్‌హాలు ద్వారం తెరచుకుంది. శంకరరావూ, అతడి వెనుకగా రమణారావూ మెయిన్ హాలులో ప్రవేశించారు.

శంకరరావు నిర్ఘాంతపోయాడు. మెయిన్ హాలులో దీపం వెలుగుతోంది దీపం యెవరు వెలిగించారు? ఇల్లు మూసివుంటే దీపం వెలిగించి పెట్టడం యెలా సాధ్యం?

దీపం వెలుతురులో యిద్దరి నీడలూ గోడలమీద వికృతంగా పాకుతున్నాయి ఇద్దరికీ నోటమాట రావడంలేదు. టప్....టప్....చప్పుడయింది.

శంకరరావు కెవ్వున కేకవేశాడు. అతడి చూపు గోడమీద నిలబడిపోయింది. గోడకు ఫోటో వ్రేలాడుతోంది. ఫోటోమీద దండ వ్రేలాడుతోంది. దండలోంచి నేలమీదకు బొట్లు బొట్లుగా రక్తం కారుతోంది.

శంకరరావు గడగడ వణికాడు.

"పోదాం! నాకు కూడా చాలా భయంగా వుంది!" అన్నాడు రమణారావు.

శంకరరావు ధైర్యం తెచ్చుకున్నాడు. "అదే ప్రక్కగదిలోకి వెళ్దాం. ఆ గదిలో చెత్తకాగితాల పెట్టెవుంది.

దాని అడుగున వున్న నేల త్రవ్వి అక్కడ పాతిపెట్టాను”
అన్నాడు.

రమణారావు వణుకుతూనే దీపం అందుకున్నాడు. ఇద్దరూ ప్రక్క గదిలోకి నడిచారు. చెత్తకాగితాల పెట్టెను ప్రక్కకు తీశాడు శంకరరావు.

మొజాయిక్ పలకలు తప్పించి నేలను త్రవ్వాడు. గుల్లగావున్న మట్టినేల సులువుగా తప్పుకుంది శంకరరావు చేతిలోకి పాలిథిన్ పేపర్ల పాకెట్ వచ్చింది. దీపం కాంతి పాకెట్ మీద పడి మెరుస్తోంది. నగలు గలగలలాడాయి.

మెయిన్ హాలులోంచి యింకా టపటప చప్పుడు వస్తోంది.

శంకరరావు స్నేహితుడి భుజం తట్టి బయటికి నడిచాడు పెరటి గుమ్మం తెరచుకుని యిద్దరూ బయటపడ్డారు.

“ఫోటోస చూచి అంత భయపడ్డావేం?” అడిగాడు రమణారావు.

“రాత్రి ఆ అమ్మాయే నన్ను భయపెట్టింది!” అన్నాడు శంకరరావు.

రమణారావు తెల్లబోయి. “అయితే కరుణ దెయ్యమయిందన్న మాట” అన్నాడు.

“అంతేకాదు. నువ్వు కాస్త ఆలస్యం చేసివుంటే ఆమె నన్ను నమిలి తినేసేది.”

దూరంగా కోళ్ళు కూస్తోన్నాయి.

“ఈ రోజంతా యింట్లో పడుకుంటాను. రాత్రి బస్సుకి నన్ను దిగబెట్టు. నువ్వు తోడువుంటే దెయ్యం రాదు” అన్నాడు శంకరరావు తిరిగి.

అలా అంటున్నప్పుడు అతడి పెదిమలు వంకర తిరిగాయి.

4

రాత్రి పదయింది. చీకటిలో మునిగివుంది వాతావరణం.

"మరో గంటలో రావాలి బస్సు" అన్నాడు రమణా రావు.

శంకరరావు తలూపాడు.

ఈదురుగాలి వీస్తోంది. ఇద్దరూ నాటుదారి వదిలిపెట్టి ఘాట్ రోడ్లోకి వచ్చారు.

"కరుణ దెయ్యం యీ రోజు కనిపించటం లేదు చూశావా?" అన్నాడు శంకరరావు.

"అవును ఒకరికి యిద్దరం వున్నాం కదా!"

శంకరరావు బలంగా నిట్టూర్చాడు "రమణారావూ నన్ను క్షమించు."

"క్షమించడమా....ఎందుకు?"

"నేను హత్య చేసినట్టు నీకు చెప్పాను. నీ కంటి ఎదుటనే హతురాలి డైవ్వారీని స్వాధీనం చేసుకున్నాను."

"అవును. అయితే!"

"నేను హత్య చేసినట్టు సజీవంగా వున్న సాక్ష్యం నువ్వు. నా నేరాలకు ప్రత్యక్షసాక్షివి నువ్వు" ఎయిర్ బాగ్ క్రిందకు దింపుకున్నాడు శంకరరావు.

"కాని స్నేహితుడినే కదా! నాకు తెలిసిన రహస్యాలు నాలోనే దాచుకుంటాను."

"నాకు నమ్మకంలేదు. అందుకే నిన్ను చంపెయ్యాలనుకుంటున్నాను.

అంతే! శంకరరావు చేతిలో కత్తి తళతళ లాడింది. రమణారావు పరుగెత్తబోయాడు. ఈదురుగాలి బలంగా వీస్తోంది. శంకరరావు వికటంగా నవ్వాడు. రమణారావు మీదకు దూకాడు. చెయ్యి ఎత్తాడు. రమణారావు ఒంటి

మీదకు దిగవలసిన కత్తి గాలిలోనే ఆగిపోయింది.

శంకరరావు తలత్రిప్పి చూశాడు. అతడి ఊపిరి ఆగిపోయింది. కరుణ నిలబడి వుంది. తెల్లటిచీర కట్టుకుని వుంది. ఆమె చేతిలో పెన్‌టార్చ్ వెలుగుతోంది. దాని కాంతిలో ఆమె మొహం మసకగానయినా బాగానే కనిపిస్తోంది. ఆమెకు పెదుపుల మాటునుండి పొడుచుకు వచ్చిన దంతాలు కూడా స్పష్టంగానే కనిపిస్తోన్నాయి.

ఆమె ఒంటిమీద నుండి మధురమైన వాసన వస్తోంది. ఆమె రెండో చెయ్యి శంకరరావు కత్తి పట్టుకున్న చేతిని వొడిసిపట్టుకుంది. శంకరరావు చేతిలోని కత్తి గడగడ వణికింది. ఆమె చేతిలోకి కత్తి సులువుగా వచ్చింది.

మరుక్షణంలో శంకరరావు కేక పెట్టాడు.

"నన్ను క్షమించు కరుణా!" అన్నాడు.

"ఎవరితో మాట్లాడుతున్నావు?" అన్నాడు రమణారావు విస్తుబోయి.

కరుణ కరుణించలేదు.

కత్తి అతివేగంగా శంకరరావు గుండెల్లో దిగింది.

* * *

రమణారావూ, ఆమె బస్సుస్టాప్‌లో నిలబడ్డారు. ఎయిర్ బాగ్ ఈ సారి రమణారావు భుజాన వ్రేలాడుతోంది.

ఆమె చెయ్యి చాపింది. చేతిలో కట్టుడు పళ్ళసెట్టు వుంది. కళ్ళకు అంటించుకున్న కాంటాక్ట్ లెన్స్ మెల్లగా తొలగించింది.

"తెల్లచీర మార్చలేదు" అన్నాడు రమణారావు నవ్వి.

"వైజాగ్‌లో తెల్లచీర మీదికి మల్లె పువ్వులు మీరు కొంటారు" కరుణ నవ్వింది.

ఈదురుగాలి వేగంగా వీస్తోంది.

"నేను హంతకురాలిని. మీకు కోపంగా లేదూ!"

"లేదు కరుణా! మీ అమ్మను చంపినవాడికి ఆ రాత్రి ఆశ్రయ మిచ్చాను. తరువాత మనం ప్రేమలో పడ్డాం. ఆ రాత్రికి నేను హంతకుడికి ఆశ్రయమిచ్చిన పాపానికి యిది నిష్కృతి. మీ అమ్మను చంపిన వాడిమీద పగ తీర్చు కున్నావు. అందుకు అన్ని విధాలా సహకరించాను. వాడికి సహకరించిన పాపానికి నన్ను కూడా చంపబోయాడు— కృతఘ్నుడు."

కరుణ అతడి చేయి నొక్కింది.

ఇప్పుడు ఈదురుగాలి వాళ్ళకు ఈదురు గాలిలాగా లేదు. మలయమారుతంలాగా వుంది.

అరగంట తర్వాత వాళ్ళు వైజాగ్ వెళ్ళే బస్సులో వున్నారు. □

డిగ్రీలు అక్కర్లేదు!



బస్సుదోపిడి

కాశీభట్ల భానుమూర్తి

"ఆ ఎగురుచున్న పక్షులని చూసావా: అలాగే మనం కూడా స్వేచ్ఛా జీవులం" అన్నాడు సుబ్రహ్మణ్యం ఆనందంగా.

"అసలు మనము పుట్టినప్పటినుంచి స్వేచ్ఛా జీవులమే. కారణం మనిద్దరం అనాథలం. కానీ నీ బోడి ప్లాను

మూలంగా యిన్నేళ్ళు కారాగార శిక్ష అనుభవించటం జరిగింది'' అన్నాడు శర్మ.

"గతం గతః అయిపోయిం దేదో అయిపోయింది. తలుచుకుని ప్రయోజనమేమిటి? అసలు నా ప్లాను మంచిదే. అన్నీ సక్రమంగా జరిగితే ఈపాటికి మనం లక్షాధికారులం అయిపోయేవాళ్ళం. కాని పోలీసులకి, మనమీద మన ప్లాను మీద నమ్మకం లేదు. అందుకే మనల్ని అరెస్టు చేశారు'' అన్నాడు నగ్నసుందరి ఫోటో కేసును తలుచుకుని భారంగా సుబ్రహ్మణ్యం.

"అత్యాసకు ఫలితం నాయనా ఆ శిక్ష. న్యాయంగా ఆ శంకర్రావిచ్చిన పదివేలు తీసుకునివుంటే, మన కీ గతి తప్పేది; వెధవ ప్లానేశావు, నన్ను ముంచావు'' అన్నాడు శర్మ నిష్ఠూరంగా.

"అవునులే; ప్లాను చెడింది కాబట్టి నన్ను నిందిస్తున్నావు. అదే సక్సెస్సు అయితే సామి రంగా నన్నెంత పొగిడేవాడివి! శర్మా! నీ కెన్ని నాలుకలురా, నా ఖర్మా'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

"సరే, జరిగిందెందుకులే; తలుచుకుంటే ఏడుపు వస్తుంది; రా కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి. కాస్త టిఫన్ పడేద్దాం కడుపులో'' అన్నాడు శర్మ దగ్గరలో వున్న ఒక హోటల్లోకి దారితీస్తూ.

సుబ్రహ్మణ్యం మౌనంగా శర్మని అనుసరించాడు.

సుబ్రహ్మణ్యం, శర్మ అనాధలు. వారాలు చేసుకొని కష్టపడి చదివి, ఉద్యోగాలు రాక, బ్యాంకుదోపిడీ చేయబోయారు. కాని వాళ్ళ ఆటలు సాగలేదు. బ్యాంకు వాచ్ మన్ వారిద్దర్నీ పట్టేసాడు. ఆ తరువాత దొంగలనాయకుడు శంకర్రావు యిద్దరికీ "బ్లాక్ మెయిల్'' పని అప్పగించాడు.

ఒకే దెబ్బకు రెండు పిట్టలు సూత్రం ప్రకారం: సుబ్రహ్మణ్యం అవతలి పార్టీని, ఇవతలి పార్టీని బెదిరించి డబ్బు లాగుదామనుకొన్నాడు. కాని ఇన్‌స్పెక్టర్ శశికాంత్ వాళ్ళ ఆటలు సాగనివ్వలేదు. అరెస్టుచేసి పారేసాడు. రెండు రోజుల క్రితమే వాళ్ళు యిద్దరూ విడుదలయి తణుకు వచ్చారు.

"ఆః యిప్పుడు బావుంది, కడుపు నిండింది, ఆ యిక చెప్పు మనమిప్పుడేం చేయాలి...." అన్నాడు శర్మ బిల్లు చెల్లిస్తూ.

"నా కొక ప్లాను తోచింది: రా ఓవర్ బ్రిడ్జిమీద కూర్చొని మాట్లాడుకొందాం ...." అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ప్లానంటున్నావు. ఓవర్ బ్రిడ్జి అంటున్నావు. నా కేదో భయంగా వుంది ఇదివరకు యిలాగే ఓవర్ బ్రిడ్జిమీద నీ అమోఘమైన ప్లాను వినే యిన్నేళ్ళు జైల్లో వున్నాం" అన్నాడు శర్మ.

"కాదిది చచ్చు పుచ్చుప్లాను. చాలా తెలివిగా అల్లిన మాస్టర ప్లాను. అది యిలా మెయినురోడ్లమీద, జనసమ్మర్దంగా వుండే చోట్ల చెబితే లాభంలేదు. రా అలా ఓవర్ బ్రిడ్జి మీద కూర్చొని ప్లాను డిస్కస్ చేసుకొందాం" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఇద్దరూ నెమ్మదిగా నడుచుకొంటూ ఓవర్‌బ్రిడ్జిమీదకి చేరుకొన్నారు. అక్కడ యెవరూ లేరు. ఇద్దరూ గోడమీద కూర్చొని దూరంగా కనబడుతున్న రైలుకేసి చూడసాగారు. వీళ్ళ చూపుల తీక్షణతకి తట్టుకోలేక రైలు నెమ్మదిగా కదిలి ఓవర్‌బ్రిడ్జిమీద నుంచి విడుదవోలువైపు సాగిపోయింది. కీచురాళ్ళ రొద తప్ప మరే శబ్దమూ లేదు—ఆ ప్రదే

శంలో.

"అబ్బ! చలి యెక్కువగా వుంది. బాబూ! ఏం చలో ఏమిటో; ఆ ఇప్పుడు చెప్పు నీ మాష్టార్ప్లాను" అన్నాడు వుపోద్ఘాతంగా శర్మ.

"మనం యిప్పుడు చేయబోయేది బస్సు దోపిడీ" అన్నాడు సుబ్రహ్మణ్యం; ఈ దారుణమైన మాటలు వినలేక ఒక గుడ్లగూబ అక్కడినుంచి ఎగిరిపోయి దూరంగా వున్న బస్టాండుమీద వాలింది.

"అఁ! బస్సు దోపిడియా; మనం దొంగిలించిన బస్సుని యెవరు కొనుక్కొంటారు?" అన్నాడు శర్మ అనుమానంగా.

సుబ్రహ్మణ్యం దవడ కండరం బిగుసుకొంది. శర్మ వైపు తీక్షణంగా చూస్తూ, "బస్సు దోపిడీ అంటే బస్సుని దొంగిలించం, ఆ బస్సులో వున్న జనంయొక్క సంపదని దోచేస్తామన్న మాట...." అన్నాడు సుబ్రహ్మణ్యం చిరాకుగా.

"ఓ అదా. సరే, ప్లాను చెప్పు ముందు" అన్నాడు శర్మ కుతూహలంగా.

"మనం చేయబోయేది బస్సు దోపిడి కాబట్టి పిస్తోళ్ళు అవసరం. కనుక మనం అవి సంపాదించాలి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"నా బొందలా వుంది; ప్లాను చెప్పలేదూ, మనం ఆలోచించుకోలేదు కాని, పిస్తోలు కావాలి; మనం దోచిన సొమ్ము దాయటానికి బ్యాంకు లాకరు కావాలి, అంటా వేమిటి" అన్నాడు శర్మ విసుగ్గా.

"చెబుతున్నా, తొందరపడతా వేమిటి; మనం ఇద్దరం ఒక మంచిరోజు చూసుకొని కాకినాడవెళ్ళే బస్సెక్కుతాం

అవి విజయవాడ నుంచి వస్తుంది: తణుకులో మీల్సుకి ఆపుతారు. కాకినాడ వెళ్ళేసరికి పదకొండవుతుంది దగ్గర దగ్గరగా. సరిగ్గా రామచంద్రపురం సమీపించబోయే లోపల మనమిద్దరం తుపాకులు చూపించి బస్సులోంచి లేచి నేను డ్రయివర్ని కవర్ చేస్తాను, నువ్వు ప్రయాణికుల్ని కవర్ చేయ్. అంతే—క్షణంలో మనం లక్షాధికార్లమవుతాం. వెంటనే బస్సు దిగిపోయి; ఏ లారియో పట్టుకొని తణుకు వచ్చేద్దాం. నాలుగురోజులు ఆగి, డబ్బు బయటికి తీద్దాం: యెలా వుంది నా ప్లాను" అన్నాడు సుబ్రహ్మణ్యం ఆనందంగా.

"ఇందులో నాకు కొన్ని సందేహాలున్నాయి" అన్నాడు శర్మ.

"అడుగు; అయినా నీ సందేహాలు నాకు తెలియవా, ఆ దోచిన డబ్బు ఏంచేద్దామని కదూ నీ వుద్దేశ్యం. హాయిగా ఏ బొంబాయో, మద్రాసో వెళ్ళిపోదాం" అన్నాడు సుబ్రహ్మణ్యం సంబరంగా.

"అదికాదు: మనిద్దరం తుపాకులతో జనాల్ని కవర్ చేస్తుంటే మనం డబ్బు యెప్పుడు దోచేస్తాము" అన్నాడు శర్మ.

"ఏముంది; కండక్టర్ వుంటాడు. అతన్ని వెళ్ళి డబ్బు కలెక్టుచేసి తీసుకురమ్మందాం. అతను తీసుకొని వచ్చాక, ఆ డబ్బు తీసుకొని దిగిపోదాం," అన్నాడు సుబ్రహ్మణం.

"ఆ కండక్టరేమన్నా మనకి మామగారా, అడిగినప్పుడల్లా డబ్బులిస్తానికి. అతనెందుకు పనులు చేస్తాడు మన కోసం" అన్నాడు శర్మ దిగులుగా.

"ప్రయాణీకుల రక్షణే కండక్టర్ల, డ్రయివర్ల ధ్యేయం

కాబట్టి, మనకి సహకరిస్తాడు, లేదా మనచేతిలో చస్తాడు" అన్నాడు సుబ్రహ్మణ్యం వికటంగా నవ్వుతూ.

"ఏమో! నీ ప్లానులు వింటానికి బావుంటాయి కాని, ఆచరణలో ఫలించవు" అన్నాడు శర్మ.

"శర్మా! నా క్కోపం తెప్పించకు. ఏదో ఒకసారి ప్లాను ఫెయిల్ అయిందని జీవితమంతా అలానే ఉంటుందా? నువ్వు వచ్చినా, రాకపోయినా రేపే నేను బస్సు దోపిడీకి వెళుతున్నాను. నేను లక్షాధికారి నయ్యాక నీకు పైసా కూడా యివ్వను, జాగ్రత్త!...." అన్నాడు సుబ్రహ్మణ్యం.

"సరేలే కోపం యెందుకు, నేనూ వస్తా పద" అన్నాడు శర్మ.

సుబ్రహ్మణ్యం మొహం ఆనందంతో విప్పారింది. "శర్మా, నీవు నా అండ వుంటే నా కిక లోకంలో ఎదురు లేదు. పద, మనకి కావలసిన సరుకులు కొనుక్కొందాము" అని బ్రిడ్జిమీద నుంచి కిందకి దారితీసాడు సుబ్రహ్మణం. శర్మ అనుసరించాడు.

2

"ఇదే మనం యెక్కవలసిన బస్సు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

అది విజయవాడ నుంచి కాకినాడకు వెళ్ళే ఎక్స్ప్రెస్ బస్సు.

శర్మ ఆ బస్సుమీద రాసివున్న వ్రాతల్ని సుబ్రహ్మణ్యానికి చూపాడు.

"ఈ బస్సు మీది మాది, మనందరిది" అని వుంది. అది చూసి,

"నే చెప్పలా! మనం దోపిడి చేసినా ఫరవాలేదు, ఈ

బస్సు వాళ్ళది మనది, మనందరిది కాబట్టి" అన్నాడు సుబ్రహ్మణం.

ఇద్దరూ బస్సు యెక్కారు. కాసేపటికి బస్సు బయలు దేరింది. వెంకటేశ్వరస్వామి గుడిదగ్గర బస్సు ఆపాడు డ్రయివర్.

"ఇది ఎక్స్‌ప్రెస్ బస్సా లేక మున్సిపాలిటీ బండా. ప్రతిచోట ఆపుతున్నారు" అన్నాడు శర్మతో, సుబ్రహ్మణం. ఇద్దరూ నిలబడే వున్నారు.

ఇంతలో చేతిలో బ్రీఫ్ కేస్‌తో శ్రీకారం బస్సు యెక్కాడు. సుబ్రహ్మణ్యం, శర్మ, ఇద్దరూ శ్రీకారాన్ని గుర్తుపట్టారు. ఇద్దరికీ చమటలు పట్టసాగాయి.

"దిగిపోదామా?" అన్నాడు శర్మ ఖంగారుగా.

"ఫరవాలేదు, శ్రీకారం ఒక్కడేగా వచ్చింది, వెంట ఓంకారం పరిశోధనరావులు రాలేదుగా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"పెళ్ళికెలుతూ పిల్లిని చంకలో పెట్టుకొని వెళ్ళినట్టు దోపిడీ చేయటానికి వెళుతూ ఈ డిటెక్టివ్ గాడ్నెందుకు వెంటబెట్టుకు పోవటం" అన్నాడు శర్మ.

"మరేం ఫరవాలేదు నోరు మూసుకో" అన్నాడు సుబ్రహ్మణ్యం.

బస్సు రావులపాలెం రాగానే పదిమంది దిగిపోయారు. ఇద్దరే ఎక్కారు.

బస్సు తిరిగి బయలుదేరింది. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. కళ్ళతోనే మాట్లాడుకొని, నెమ్మదిగా డ్రయివర్ దగ్గరికి వెళ్ళాడు సుబ్రహ్మణ్యం. డ్రయివర్ వీపుకి పిస్తోలు ఆనించి, "మిస్టర్ డ్రయివర్, బస్సు ఆపకుండా

నెమ్మదిగా పోనీయి. నీ వీపుకి అనించబడింది పిస్తోలు. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే నీ భార్య ముండమోస్తుంది జాగ్రత్త!" అన్నాడు.

డ్రయివర్‌కి ముందు అర్ధం కాలేదు. అర్థం అయ్యాక ఆనందంతో మొహం విప్పారింది. సినిమాల్లో చూడటం, పుస్తకాల్లో చదవటం తప్పితే ప్రత్యక్షంగా దోపిడీ జరగ్గా ఎప్పుడూ చూడలేదు. ఆ మాటే సుబ్రహ్మణ్యంతో అని "సార్, ఆ పిస్తోలు ఇలా ఇస్తారా చూపిస్తా" అన్నాడు ఆనందంగా డ్రయివర్ సింహాచలం.

"మా నాయనే, పిస్తోలు కావాలా, నోరు మూసుకొని బస్సు నడుపు" అని డ్రయివర్ని గద్దించి "ఠాకూర్" అని పిలిచాడు సుబ్రహ్మణ్యం.

పేర్లు ఎవరికీ తెలియకూడదని ముందే మార్చేసుకొన్నారు ఇద్దరూ. శర్మ పేరు ఠాకూర్. సుబ్రహ్మణ్యం పేరు గబ్బర్.

"ఎస్ గబ్బర్, ఆగయా!" అని శర్మ లేచాడు. లేచి, జేబులోంచి పిస్తోలు బయటికి తీసి జనంవైపు తిప్పి "జాగ్రత్త. ఇది అల్లాటప్పా పిస్తోలు కాదు, వందకు పైగా హత్యలు చేసి శతహత్యోత్సవం జరుపుకొంది. ఎవరైనా అరిచారా జాగ్రత్త!" అన్నాడు శర్మ.

బస్సులో వున్న జనం ఆనందంగా అది సినిమా షూటింగ్ కాబోలు అనుకుని కెమెరా కోసం చూసారు. కాని కెమెరా కనబడలేదు. పోనీ ఏప్రిల్ ఫూల్ అనుకొందామంటే ఇప్పుడు జనవరి నెల. అర్థం కాక మొహాలు ప్రశ్నార్థకంగా పెట్టారు. శ్రీకారం కూడా ఆశ్చర్యంగా శర్మవైపు చూడసాగాడు.

"కండక్టర్ కమ్‌హియర్" అన్నాడు శర్మ.

కండక్టర్ వణుకుతూ వచ్చి శర్మ పక్కన నిలుచు న్నాడు. శర్మ కండక్టర్ దగ్గర నుంచి బేగ్ లాక్కొని, ఆ తరువాత కండక్టర్‌తో "మిస్టర్, నీవు వీళ్ళందరి దగ్గర డబ్బు, బంగారం కలెక్టుచేసి, ఈ సంచిలో పెట్టు. పిచ్చి పిచ్చిగా ప్రవర్తించినా, ఎదురు తిరిగినా జాగ్రత్త!" అని హెచ్చరించి ఒక సంచీ కండక్టర్ మీద విసిరేశాడు శర్మ.

ప్రాణ భయంతో అందరూ తమ దగ్గర వున్న డబ్బూ నగలు కండక్టర్‌కి కానుకగా సమర్పించసాగారు. అందరూ ఇచ్చాక. శ్రీకారం దగ్గరికి వచ్చాడు కండక్టర్. శ్రీకారం వంద రూపాయలు తీసి ఆ సంచీలో వేసాడు. శర్మకి అది చూడగానే కోపం వచ్చింది.

"ఇదేం వరద బాధితుల విరాళమా దర్జాగా వంద రూపాయలు వేస్తున్నావ్! తీయి, ఆ సూట్‌కేసు" అన్నాడు శర్మ.

"ఇందులో బట్టలు వున్నాయి" అన్నాడు శ్రీకారం.

"మరేం ఫరవాలేదు. కండక్టర్ ఆ సూట్‌కేసు కూడా అందుకో" అన్నాడు శర్మ.

కండక్టర్‌కి వళ్ళు మండిపోసాగింది. కాని ప్రయాణీ కుల భద్రత ముఖ్యం కాబట్టి తప్పనిసరిగా ఆ సూటుకేసు కూడా అందుకొని. సూటుకేసు, సంచీ శర్మ కిచ్చాడు. శర్మ అవి అందుకొని చిన్నగా విజిల్ వేసాడు.

సుబ్రహ్మణ్యం డ్రయివర్‌తో చెప్పి బస్సాపించాడు. ఇద్దరూ జాగ్రత్తగా దిగి, బస్ డోర్‌వేసి చీకట్లో కలిసి పోయారు.

బస్సు తిన్నగా బయలుదేరి రామచంద్రపురం పోలీసు

స్టేషన్ వద్ద ఆగింది. డ్రయివర్ చెప్పింది, కండక్టర్ చెప్పింది నోటుచేసుకొని ప్రయాణీకుల దగ్గర ఎంతెంత పోయింది లిస్టు తయారు చేయసాగారు రామచంద్రపురం పోలీసులు.

శ్రీకారం నెమ్మదిగా జారుకొని అటుగా వస్తున్న లారీ పట్టుకొని తణుకు చేరాడు. పరిశోధనరావుకి సూట్ కేస్ పోగొట్టిన విషయం చెప్పాడు. అది విని అంతెత్తున మండిపడ్డాడు పరిశోధనరావు.

ఒక చిన్న సూట్ కేస్ అప్పగిస్తే దాన్ని పోగొట్టుకొని మన ఏజెన్సీకి ఎంత నష్టం తెచ్చావు. రామచంద్రరావుగారు అంత డబ్బు కాకినాడ వక్కరే పట్టుకెళ్ళలేక మన సహాయం కోరారు. సమర్థుడవని ఆ డబ్బు నీ చేతికిస్తే ఎవరో దొంగలికి భయపడి డబ్బులిచ్చేస్తావా: ఒకటా రెండా పది లక్షలు. మనకి ఫీజుగా వెయ్యి రూపాయలు అడ్వాన్సు కూడా ఇచ్చారు. ఇప్పుడు ఈ పది లక్షలు ఎలా ఇవ్వాలి వారికి?'' అని ఆవేశంగా అరవసాగాడు పరిశోధనరావు.

“అందుకే చిలక్కి చెప్పినట్టు చెప్పా బాసూ ఆ కేసు నా కివ్వండి నేను డీల్ చేస్తా అన్నాను. ఇచ్చారా. లేదు. నేనే ఐనక అయితేనా ఆ సూట్ కేసును రక్షిస్తమే కాక, ఆ దొంగల్ని కూడా పట్టుకొని మన ఏజెన్సీకి మంచిపేరు తెచ్చిపెట్టేవాడ్ని'' అన్నాడు ఓంకారం వెటకారంగా.

“ఆ! చెప్పటానికేం కబుర్లు! అక్కడ వుండవలసింది? అసలు వాళ్ళ పేర్లు వింటేనే ప్రయాణీకులకి మతిపోయింది. ఒకడి పేరు ఠాకూర్, మరొకడి పేరు గబ్బర్'' అన్నాడు శ్రీకారం.

"ఇప్పుడు రామచంద్రరావుగారు అడిగితే నేనేమి చెప్పను" అని బాధగా అటూ ఇటూ తిరగసాగాడు డిటెక్టివ్ పరిశోధనరావు. శ్రీకారం మౌనంగా తల వంచుకొని నిలబడ్డాడు. ఓంకారం కుర్చీలో కూర్చొని బుర్ర బద్దలు కొట్టుకోసాగాడు.

3

"పది తులాల బంగారం, నాలుగువేల రూపాయల క్యాష్ దక్కింది" అన్నాడు శర్మ ఆనందంగా సుబ్రహ్మణ్యంతో.

"ఆ! ఆ సూటుకేసులో ఏముంది?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఆ! శ్రీకారంగాడి బట్టలయి వుంటాయి, లేదా ఏ భూత అద్దాలో, అపరాధ పరిశోధన పుస్తకాలో వుంటాయి. అసలు ఆ పుస్తకాలు చదివేగా వీళ్ళు పరిశోధన చేస్తుంది" అన్నాడు శర్మ.

"తెరూ! అపరాధ పరిశోధన పుస్తకాలుంటే ఎంచక్కా చదువుకోవచ్చు. లేదా శ్రీకారంగాడి బట్టలుంటే ఏ వరద బాధితుడికో విరాళంగా ఇవ్వొచ్చు. పుణ్యం కూడా వస్తుంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

అతి కష్టం మీద సూటుకేసు మూత తెరిచాడు శర్మ. లోపలికి చూపిన శర్మకి ఆనందంతో నోట మాట రాలేదు. లోపల అన్నీ వంద రూపాయల నోట్లే వున్నాయి. కొత్తవి. ఇద్దరూ బయటికి తీసి లెక్కపెట్టారు. పది లక్షలు లెక్క తేలింది. సుబ్రహ్మణ్యం గర్వంగా శర్మ వైపు చూసాడు. శర్మ సుబ్రహ్మణ్యం భుజం తట్టి మెచ్చు

కొన్నాడు.

ఒక వందరూపాయల కట్ట మాత్రం జేబులో పెట్టుకొని మిగిలిన బంగారం, డబ్బు సూటుకేస్‌లో సర్దేసి, అటక మీద పెట్టాడు సుబ్రహ్మణ్యం. ఇంటికి తాళంవేసి ఇద్దరూ బయటికి వచ్చారు. హోటలు వైపు బయలుదేరారు ఇద్దరూ.

4

"ఇది అన్యాయం! అక్రమం!" అన్నాడు శర్మ.

"అయి ఎగ్రీ. ఇంత దారుణం ఉండదు మరెక్కడా, నో, నో, నో మీరు చాలా ఇన్సల్టు చేస్తున్నారు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఇద్దరి చేతులికి బేడీలు వేయటం ముగించి "దొంగ నోట్లు మార్చబోయి పట్టుబడి మమ్మల్ని అంటారేం. పమ యానికి ఆ హోటలు ప్రొప్రయిటర్ ఫోన్ చేయబట్టి తెలి సింది" అన్నాడు ఎస్సై ముకుందరావు.

"మిస్టర్ సుబ్రహ్మణ్యం, అండ్ శర్మా! మీరు నాకు దొరకడం ఇది రెండోసారి. ఆఁ! మిగిలిన నోట్లు ఎక్కడ, మీ ముఠా స్థావరా లెక్కడ! ప్రింటింగ్ ప్రెస్సెక్కడ! ఎక్కడ ఎక్కడ, ఎక్కడ?" అని గద్దించి అడిగాడు ఇన్‌స్పెక్టర్ శశికాంత్.

"మీరు నాలుగుసార్లు ఎక్కడ, అని అడిగినా, వంద సార్లడిగినా మా సమాధానం ఒక్కటే, ఇవి మావి కావు" అన్నాడు శర్మ.

అసలు శర్మకి చిరాగ్గా వుంది సుబ్రహ్మణ్యం మీద. వెధవ ప్లాను వీడూనూ చపట వెధవ అని విసుక్కో

సాగాడు.

చివర చవట వెధవ అన్న మాట మాత్రం వినిపించింది ఎస్సై ముకుందరావుకి. వెంటనే కోపం వచ్చింది, "దొంగ నోట్లు మీ దగ్గర దాచి పెట్టుకొన్నందుకు నన్ను చవట వెధవ అంటావా!" అంటూ లాఠీతో ఒక్కటి వేసాడు శర్మని.

"అబ్బా" అని బాధగా అరిచి చతికిలబడ్డాడు శర్మ.

"ఆపండి, ఆ దారుణం నేను చూడలేను. ఆ సూటు కేసు మొన్న రామచంద్రపురం బస్సు దోపిడీలో శ్రీకారం గారి దగ్గర కొట్టేసినది. ఆ బస్సు దోపిడీ మేమే చేసాం" అన్నాడు సుబ్రహ్మణ్యం. దొంగనోట్ల కేసు పోవాలంటే, దోపిడీ కేసే మీద వేసుకోవటం మంచిదని.

"శ్రీకారం దగ్గరనుంచా. ఏమిటీ. ప్రఖ్యాత డిటెక్టివ్ పరిశోధనరావుగారి అసిస్టెంటు శ్రీకారమేనా" అన్నాడు ఇనస్పెక్టర్ శశికాంత్.

అవునన్నాడు సుబ్రహ్మణ్యం.

అంతే—లాఠీతో సుబ్రహ్మణ్యాన్ని ఒక్కటి వేసాడు ఎస్సై ముకుందరావు. "నీవు కల్పించి చెప్పటానికి ఈ తణుకులో మనుష్యులే కరువయ్యారా. శ్రీకారం గురించి కూస్తున్నావు" అని మరొకటి తగలనిచ్చాడు ఎస్సై ముకుందరావు.

"నిజం చెబితే నమ్మరేం. కావాలంటే మా అటకమీద సూటుకేసులో మిగిలిన డబ్బువుంది. మేము ఆ సూటుకేసు శ్రీకారం చేతిలోంచి కొట్టేశాం" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"వీళ్ళిద్దర్ని సెల్లో తోసేసి రామచంద్రపురం కబురెట్టు.

నేను పరిశోధనరావు దగ్గరికి వెళ్ళొస్తా" అని బయటికి నడిచాడు ఇనస్పెక్టర్ శశికాంత్, ఎస్సై ముకుందరావుతో చెప్పి.

5

"అవి దొంగనోట్లా! నో! రామచంద్రరావనే క్లయింట్ మా దగ్గరికి వచ్చి. కాకినాడలో వున్న వాళ్ళ రంగారావు ఎడ్రస్ ఇచ్చి వారికి ఈ డబ్బు అందజేయమన్నాడు. మీరే ఇవ్వొచ్చుగదా అంటే; మీరు డిటెక్టివ్‌లు, మీకు తెలియంది ఏముంది—ఈ రోజుల్లో బస్ దోపిడీల గురించి. ఒకటా రెండా పది లక్షలు, మేం పట్టుకెళ్ళితే ఆ డబ్బుకి సేఫ్టీ వుండదు. మీరైతే జాగ్రత్తగా చేరుస్తారు. అందుకు ప్రతి ఫలంగా రెండువేలు ఫీజిస్తానని చెప్పి, అడ్వాన్సుగా వెయ్యి రూపాయలుగూడా ఇచ్చాడు" అన్నాడు పరిశోధనరావు, ఇనస్పెక్టర్ శశికాంత్‌తో.

"అంటే మీకేం తెలియదా" అన్నాడు ఇనస్పెక్టర్ శశి కాంత్.

"ఒకవేళ, ఆ రామచంద్రరావే దొంగనోట్లు అచ్చువేసి, డిటెక్టివ్ లయితే ఎవరూ పట్టుకోరు గదా, అని మనద్వారా రంగారావుగాడికి అందిస్తున్నాడేమో" అన్నాడు ఓంకారం పరిశోధనరావుతో.

"అదీ పాయింటే, రామచంద్రరావు ఎడ్రస్సు, రంగా రావు ఎడ్రస్ ఇవ్వండి" అన్నాడు ఇనస్పెక్టర్ శశికాంత్.

"రామచంద్రరావు ఎడ్రస్ మా దగ్గర లేదు, కాని రంగారావు ఎడ్రస్ మాత్రం వుంది" అని రంగారావు ఎడ్రస్ ఇనస్పెక్టర్ శశికాంత్‌కి ఇచ్చాడు పరిశోధనరావు.

ఆ ఎడ్రస్ తీసుకొని వెళ్ళిపోయాడు ఇనస్పెక్టర్ శశి

కాంత్. డిటెక్టివ్‌లు ముగ్గురూ తలలు పట్టుకొని కుర్చీల్లో కూలబడ్డారు.

ఆ తరువాత పనులన్నీ వెంటవెంటనే జరిగిపోయాయి.

ఇనస్పెక్టర్ శశికాంత్ స్వయంగా కాకినాడ వెళ్ళి సూర్యారావు పేటలో వుంటున్న రంగారావుని అరెస్టు చేసాడు కాకినాడ పోలీసుల సహాయంతో రంగారావుకి పోలీసులు పెట్టే నాలుగు పెట్టాక రామచంద్రరావు ఎడ్రస్ చెప్పాడు చిలకలా. వెంటనే తణుకు వచ్చి రామచంద్ర రావుని అరెస్టు చేశాడు ఇనస్పెక్టర్ శశికాంత్.

రామచంద్రరావు వాళ్ళ ఇంటి పడగ్గదిలో ఒక చిన్న ప్రెస్ వుంది. బ్లాకుల్నికూడా స్వాధీనపరుచుకొన్నాడు శశి కాంత్.

ఆ తరువాత పరిశోధనరావు బృందానికి ఫోనుచేసాడు ఇనస్పెక్టర్ శశికాంత్.

రెక్కలు కట్టుకొని వాలారు డిటెక్టివ్‌లు ముగ్గురూ.

పరిశోధనరావు, ఓంకారం, శ్రీకారంలని చూడగానే రామచంద్రరావుకి కోపం తారస్థాయినందుకొంది. దాంతో గట్టిగా "ఇదివరకు నేనె కాకినాడ చేరవేసేవాడిని దొంగ నోట్లు. పోలీసుల కళ్ళు గప్పి. ఇప్పుడు ప్రభుత్వం మారింది. దాడులు ఎక్కువయ్యాయిగదా అని మీచేతి కిస్తే, వాటిని ఈ పోలీసులకి అప్పగిస్తారా?" అని అరవసాగాడు.

"ఏం చేస్తాం. నీ రాత బాగా లేదు! పోనీ దొంగల భయం అంటున్నావుగదా. ఆ సొమ్ము ఆ రంగారావుకి చేరేద్దామని మేం కేసు ఒప్పుకొన్నాం. అవి దొంగనోట్లని తెలిస్తే అప్పుడే నిన్ను పోలీసులకి పట్టిచ్చేవాళ్ళం" అన్నాడు పరిశోధనరావు.

☐

రామ రావణుల స్నేహం

కె.బి.యస్.కుమార్

S.L.S. BOOK STALL VJA.6 PATAMATA

"సునీతా" విసురుగా కేకేశాడు సోమశేఖర్.

"ఇంకా రాలేదు నాన్నా...." తొమ్మిదేళ్ళ కూతురు

అనిత సమాధాన మిచ్చింది.

సోమశేఖర్ అసహనంగా దుస్తులు తొడుకున్నాడు.

అతని పెన్నూ, సైకిల్ తాళంచెవి కన్పించలేదు. అవి సునీత వెదికి తెచ్చివ్వాలి.

ఒక్కమాటలో చెప్పాలంటే సోమశేఖర్‌కి వుదయం టూత్‌పేస్టూ బ్రష్షూ అందించటం దగ్గర్నుంచి రాత్రి భోజనం అయ్యాక తాంబూలం అందించటం వరకూ అన్నీ సునీతే చెయ్యాలి. సునీత సహకారం లేందే అతనికి ఏ పనీ తోచదు. అయిదు నిమిషాలు కూడ గడవదు.

అలాంటి సహకారం అందించే సునీత యివాళ నాలుగిళ్ళ అవతలున్న మధురాధర్ గారింటికి వెళ్ళింది.

ఇవాళ మధురాధర్ దంపతులు సత్యనారాయణ వ్రతం చేస్తున్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతం అంటే మాటలు గాదు. ఖర్చు విషయం అటుంచి చాల సమయం కావాలి వ్రతం పూర్తవటానికి. విఘ్నేశ్వర పూజతో మొదలై వ్రతం, అయిదు యామాలు, వాటికి సంబంధించిన కథలూ పూర్తయి, ముగింపు కొచ్చేసరికి చాలా సమయం పడుతుంది.

'నే నొచ్చేసరికి ఆలస్యం కావచ్చు. అన్నీ అక్కడే వున్నాయి. కావాలిస్తే అనిత నడగండి ఏమైనా....' అని సునీత వెళ్ళేముందే చెప్పింది.

సోమశేఖర్‌కి భార్యపై కాస్త కోపం వచ్చింది. ఆమె లేకపోతే తను ప్రతి విషయానికీ తడుముకోవాల్సి వస్తుంది. పోనీ కొబ్బరికాయ అక్కడ పెట్టి వచ్చెయ్యకూడదూ! తనాఫీసు కెళ్ళేవరకూ వుండి ఆనక వెళ్ళకూడదూ!!

ప్చ్‌ప్చ్....తను అలా చెప్పివుండాల్సింది.

సరే.... యిప్పు దేమనుకొనీ లాభం లేదు. ఈ పూటకి పక్కసీటు గోపాలంగాడి పెన్నూ, పక్కవీధి సైకిల్ కొట్టు నరసిగాడి బాడుగ సైకిలూ గతి ...అంతే....

నిట్టూరుస్తూ సైకిల్ లోపల పెడదామని అలా నడిచిన సోమశేఖర్ కళ్ళు జిగేలు మన్నాయ్.

సైకిల్ లాక్ కే వుంది కీ!

అప్పుడు గుర్తొచ్చింది సోమశేఖర్ కి, నిన్న రాత్రి పెరుగు పిల్లి తినేసిపోతే తొమ్మిదిన్నర ప్రాంతంలో సైకిల్ పై వెళ్ళి పెరుగు తెచ్చాడు తను. మళ్ళీ లాక్ చెయ్యలేదు.

సగం హుషారొచ్చింది సోమశేఖర్ కి. "అనితా! తలుపు వేసుకో. నే నాఫీసుకి వెళుతున్నాను" అనేసి సమాధానం కోసం యెదురు చూడకుండా సైకిల్ మీద ఆఫీసుకు బయలుదేరాడు.

2

"అమ్మా" పిలిచింది అనిత.

విశ్రాంతికోసం కళ్ళు మూసుకొని పడుకున్న సునీత కళ్లు తెరిచింది.

"నాన్న మధ్యాహ్నం ఆఫీసుకి వెళ్ళరా .... నిద్రపోతున్నారు.

చటుక్కున లేచింది సునీత. ఆమెకు ఆశ్చర్యం వేసింది. ఎప్పుడూ లేంది భర్త యివాళ ఈ వేళప్పుడు నిద్రపోవడం.

సోమశేఖర్ గదిలోకి నడిచింది.

అతడు ఈజీచేర్ లో పడుకున్నాడు కళ్లు మూసుకొని.

ఒకటి-రెండు-మూడుసార్లు పిల్చింది.

లేవలేదు.

"ఏమిటండీ గార్డినాల్ మింగినవాడిలా ఆ నిద్ర?? ఆఫీ

సుకి తైమవలేదూ.... ఈ పూట తెలవా?" కుదిపి లేపింది.

ఊహూఁ ....

ఆమెకి పది క్షణాల తర్వాతగాని బోధపళ్ళేదు-అతడు మరణించాడని.

* * *

గొల్లుమంటోన్న సునీతని ఓదార్చటానికి ఇన్‌స్పెక్టర్ లోని సహనం చాల్లేదు.

"చూడమ్మా! యిలాంటి పరిస్థితుల్లో మీకు బాధ సహజమే! కాని యిది సహజ మరణం కాదు. దారుణ హత్య. మిమ్మల్ని మీరు ఓదార్చుకోలేకపోతే లాభం వుండదు. మీ అమ్మాయిని చూసైనా మీరు కాస్త స్థిమితపడండి. నా ప్రశ్నలకి జవాబు చెప్పండి. లేకపోతే హంతకుడు జారిపోయే ప్రమాదముంది" అనునయంగా అన్నాడు సబిన్స్పెక్టర్ బాబూరావు.

మరో అయిదు నిమిషాలకి సునీత కాస్త తెప్పరిల్లింది.

"ముందుగా మీకు తెల్సింది చెప్పండి" మృదువుగా అడిగాడు బాబూరావు.

"మధ్యాహ్నం ఒకటీ నలభై కి యింటి కొచ్చారు ఇన్‌స్పెక్టర్‌గారూ! భోజనానికి లెమ్మన్నాను. ఇవాళ వాళ్ళ పైపిస్టు బర్త్‌డే అట. బలవంతం చేస్తే భోజనానికి వెళ్లార్ట. ఓ గంట పర్మిషన్ తీసుకొని నేరుగా యింటికొచ్చారు. భుక్తాయాసంగా వుందని ఈజీచైర్లో నడుం వాల్చారు. దేవుడి గదిలో పంచామృతం వుంది తీసుకోండి అని చెప్పాను. 'వూఁ' అని మూలిగారు. అరగంట తర్వాత మా అమ్మాయి నాన్న పడుకున్నారని చెప్పడంతో ఆశ్చర్యపోయాను. ఆయనకి మధ్యాహ్నం నిద్ర అలవాటు లేదు లేపటంకోసం వెళ్ళాను. గుండెలు పగిలాయి" సునీత

కళ్ళలో మళ్ళీ ఉప్పెన ప్రారంభమైంది.

"టైపిస్టు యింట్లో భోజనానికి వెడుతున్నట్టు ముందుగా మీకు చెప్పలేదా?"

"లేదు."

"టైపిస్ట్ అంటే? ఆడా మగా?"

"పేరు గౌరి...."

"అయ్‌సీ ...ఈ విషయంలో మీరు ప్రత్యేకంగా ఏమీ చెప్పలేరా?"

"నాకు తెల్సినంతవరకూ ఏమీలేదు."

"పంచామృతం అన్నారు...."

"అవును. ఇవాళ మధురాధర్ దంపతులు—నాలుగిళ్ళ అవతలివాళ్లు లెండి—సత్యనారాయణ వ్రతం చేశారు."

"ఆమె—అయ్‌మీన్ గౌరి—మీ వారి ఆఫీసులో పని చేస్తోంది. ఇవాళ ఆమె పుట్టిన రోజు. మీ వార్ని మాత్రమే భోజనానికి పిల్చింది. ఆలోచిస్తే ఇందులో ఏదేనా ప్రత్యేకత కన్పిస్తోందా మీకు?"

ఆమె జవాబివ్వలేదు. ఆ ప్రత్యేకత వున్నదా లేదా అని క్షుణ్ణంగా ఆలోచించగల అవకాశం ఆమె కిప్పుడు లేదు. ప్రస్తుతం ఆమె హృదయం అగ్నిపర్వతం. మస్తిష్కం ఆకృతిలేని శిల్పం.

ఆ విషయం గ్రహించాడు బాబూరావు.

"సత్యనారాయణ వ్రతానికి మీరు వెళ్ళారా?"

అవునన్నట్టు తలూపింది సునీత.

"ఎన్ని గంటల వరకూ అక్కడ వున్నారు?"

"పన్నెండున్నరవరకూ వున్నాను. అక్కడికొచ్చిన పేరంటాళ్ళు వ్రత కథలు వినకుండా గిల్టునగల గురించీ కంచిపట్టు చీరల గురించీ మాట్లాడుకుంటూంటే బోర్‌కొట్టి-

వచ్చేశాను."

"పంచామృతం మీరు పట్టుకొచ్చారా? మీ రొచ్చాక వాళ్ళు పంపారా?"

"ఒకటిన్నర ప్రాంతంలో వాళ్ళే పంపారు."

"ఎవర్తో పంపారు?"

"మధురాధర్‌గారి కుమారుడు తెచ్చిచ్చాడు."

"ఆ అబ్బాయి వయసెంత?"

"పది...."

ఆలోచిస్తూ వుండిపోయాడు బాబూరావు.

3

సోమశేఖర్ హత్యకేసు క్రయింబ్రాంచికి అప్పగించ బడింది. డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ చక్రవర్తి రంగంలో దూకాడు. పంచామృతంలో విషం కలుపబడిందనీ, మధ్యాహ్నం రెండు గంటలకి సోమశేఖర్ ప్రాణం పోయిం దనీ, పోస్టుమార్టమ్ రిపోర్టులో వెల్లడైంది.

బాబూరావు, చక్రవర్తి చెరో కుర్చీలలో కూర్చొని బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు.

"....గౌరి మిగతా కొలీగ్స్‌ని ఇన్వైట్ చెయ్యకుండా సోమశేఖర్‌ని మాత్రమే భోజనానికి పిల్చింది. ఎందుకు? సోమశేఖర్‌పై గౌరికి యింత ప్రత్యేకాభిమానం ఎందుకు? అది తేల్చుకోవాలి" అన్నాడు చక్రవర్తి.

"మధురాధర్ పంపిన పంచామృతంలో విషం కలి సింది. అదీ సోమశేఖర్ కుటుంబంకోసం నిర్దేశింపబడిన పంచామృతం గ్లాసులోనే! అంటే సోమశేఖరం కుటుంబంపై మధురాధర్‌కి లేదా మరెవ్వరికో పగ వుండుం డాలి" బుర్ర గోక్కున్నాడు బాబూరావు.

"బుర్ర గోక్కుంటే కేసు తేలదు బాబూరావ్! మధురా

ధర్ దగ్గరో, లేక గౌరి దగ్గరో 'క్లూ' వుంది. అది పట్టాలి...."

"కొంపదీసి మధురాధరూ, గౌరీ ఒకటి కాదుగదా!?" బాబూరావు గట్టిగా అర్చాడు.

"వుండొచ్చు....బట్—వాళ్ళిద్దరూ ఒకపైై సోమ శేఖర్ని చంపాలని ఎందుకనుకుంటారు?"

"సోమశేఖర్ కుటుంబాన్ని అను"—బాబూరావు సవ రించబోయాడు.

"నా కలా అన్పించటంలేదు. తీర్థంకాని, ప్రసాదం కాని ఏ భార్యా ముందుగా భర్తకివ్వకుండా తను స్వీకరించదు. వున్న ఒక్క కూతురూ మరీ చిన్నపిల్లకాదు. అర్థం చేసు కునే వయసే! నాన్నొచ్చేవరకూ వెయిట్ చేద్దాం అని తల్లి అనుంటుంది. సరేనని యిద్దరూ వెయిట్ చేశారు. సోమ శేఖర్ వచ్చాడు. ఈలోగా ఆకలికి తాళలేక అనిత భోజనం చేసింది. ఆ కంచం వగైరాలు కడుగుతూ చేతికి మట్టి అంటి వుండటంతో సునీత భర్తతో పంచామృతాన్ని తీసుకోవల సిందిగా కోరింది. ప్రసాదం తిని భర్త కాసేపు రిలా క్సయ్యాడు. ఆ వెంటనే ప్రాణం పోయింది."

"అబ్బ: వెధవ పైనేడు! ఎంత త్వరగా ప్రాణం తీస్తుంది? ఏ మహానుభావుడు కనిపెట్టాడో" బాధగా మొహం పెట్టి అన్నాడు బాబూరావు.

"ఇలా చావటంకోసం మాత్రం కనిపెట్టలేదు బైదిబై దీన్నిబట్టి ఆలోచిస్తే ఎవరికో సోమశేఖర్పై మాత్రమే పగ వుండాలి. ఛస్తే ఆడాళ్ళు కూడా చావనీ అనుకునుం టాడు. సరే. కూచుంటే తేలేకేసు కాదిది. నువ్వు మధురా ధర్వైపు నుండి నరుక్కురా. నేను గౌరి విషయం చూస్తాను...." అన్నాడు చక్రవర్తి.

తలుపు తట్టాడు చక్రవర్తి.

రెండు నిమిషాలు బరువుగా గడిచాయి. ఆ తర్వాత కిర్రుమంటూ తలుపులు తెరుచుకున్నాయి.

"మీరు...." అర్ధోక్తిలో ఆగిపోయిందామె.

ఆమెని చూడగానే ఆమే గౌరి అయివుంటుందని వూహించాడు చక్రవర్తి. అందగత్తెల్లో ఆమెని చేర్చలేము గాని అనాకారి మాత్రం కాదు. బక్కగా పొడుగ్గా వుంది. కోలమొహం. ఎంచేతో నిస్సత్తువని పులుముకుంది. మెడ బోపిగా వుంది. నీలంరంగు డిస్కో చీర ఆమె తెల్లని శరీరంపై ఆకర్షణీయంగా కనిపిస్తోంది.

"గౌరి మీరే కదూ!" ప్రశ్నించాడు చక్రవర్తి.

"అవును. శ్యామలగౌరి."

"మీతో కాస్త మాట్లాడాలి."

"లోపలికి రండి...." లోపలికి దారితీసింది శ్యామల గౌరి.

ఆ యింట్లో రెండే గదు లున్నాయి. ఒకటి వంటగది గానూ రెండోది డ్రాయింగ్ కమ్ బెడ్‌రూమ్‌గానూ వుప యోగపడుతోంది.

"ఈ ఇంట్లో మీ రొక్కరే వుంటున్నార్లా వుంది" అదో రకంగా అన్నాడు చక్రవర్తి.

"మీరెవరో చెప్పనేలేదు...."

"చక్రవర్తి. క్రయింబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ని."

ఆమె నీరసమయిన కళ్ళలో ఆశ్చర్యం తొంగి చూపింది.

"సోమశేఖర్ గురించి కొన్ని వివరాలు కావాలి."

"మా యిల్లు కలయజూస్తే దొరకవు మీకు. నన్నడగండి చెపుతాను."

"ఈ యింట్లో మీ రొక్కరే వుంటున్నార్లా వుంది...." ఈసారి మరింత వ్యంగ్యంగా అన్నాడు చక్రవర్తి.

"నాతోబాటు—మీరిందాక చూసిన వస్తువులన్నీ నాతోబాటు వున్నాయిగా!"

"అదేం? తల్లి, తండ్రి, పెళ్ళి...."

"తండ్రి నాలుగేళ్ళ క్రితం సర్వీసులో వుండగానే పోయి—నాకీ వుద్యోగం యిప్పించారు. అమ్మ గత సంవత్సరం తీర్థయాత్రలకి వెళ్ళి బస్సు లోయలో పడ్డ దుర్ఘటనలో మరణించింది. పెళ్ళిచేసుకుందామనుకున్నాను. ప్రేమించిన యువకుడు నా అంగీకారం కోసమే వేచి వున్నాడు. కాని—నాలుగు నెల్లక్రితం అతనికి నా తిరస్కారం వ్యక్తం చేశాను."

"అయ్యో...."

"శేఖర్‌గారి గురించి వివరాలు కావాలన్నారు?"

"సోమశేఖర్ మీకెంత కాలంగా తెలుసు?"

"నే నీ వూరికి బదిలీ అయినప్పటి నుండీ!"

"మీ రీ వూరికి ఎప్పుడు బదిలీ అయ్యారు?"

"సంవత్సర మైంది."

"మీ యిద్దరి మధ్యా స్నేహం ఎలాంటిది?"

"ఒక ఆత్మీయుడికీ ఒక సహృదయుడికీ మధ్య గల స్నేహం లాంటిది."

"అంతమంది సహోద్యోగు లుండగా మీరు మొన్న మీ బర్త్‌డేనాడు అతన్ని మాత్రమే ఆహ్వానించటంలో అర్థం ఏమిటి?"

"స్నేహితు లెందరో వుండొచ్చు. ఆత్మీయులు కొందరే వుంటారు."

"మీకు మధురాధర్ తెల్సా?"

"ఎవరతను?"

"బుకాయించకండి. అతను మీకు తెల్సు."

"ఏ ఆధారంతో చెప్పగలరు?" కోపంగా అంది శ్యామలగౌరి.

"మీరు నిజం చెప్పకపోతే ఆధారాన్ని అన్వేషించటం గొప్ప పని కాదు."

"............"

"సోమశేఖర్ హత్య చెయ్యబడ్డాడు-"

అప్రతిభురాలైంది శ్యామలగౌరి. "నిజమా! చక్రవర్తిగారూ.....ఓహ్!! మీరు .. మీరు చెబుతున్నది...."

"నూరుపైసల నిజం!!"

"ఎప్పుడు? ...ఎందుకు?...." ఆమె కేడుపొస్తోంది.

"మొన్న-మీ బర్త్‌డేనాడు. మీ యింట్లో భోజనం చేసి యింటి కెళ్ళాడు. యింటి కెళ్ళేసరికి సత్యనారాయణ వ్రతం పంచామృతం అతని కోసం ఎదురు చూస్తోంది. అది అమృతం కాదు విషమని తెలీని సోమశేఖర్ రుచి చూసి ప్రాణం వదిలేశాడు."

"మైగాడ్! సోమశేఖర్...." ఆమె చేతుల్లో మొహం దాచుకొని ఏడుస్తోంది.

"ఫర్వాలేదు. కట్టుకున్న భార్యకంటే ఎక్కువగానే ఏడుస్తున్నారు."

"మిస్టర్ ఇన్‌స్పెక్టర్!!" ఆడు పులిలా గర్జించిందామె.

"అవును. మొదట మధురాధర్‌పై అనుమానం వెళ్ళింది, కాని యిక్కడ మీ ఒంటరి జీవితం, సోమ శేఖర్‌పై మీరు చూపిస్తోన్న ప్రత్యేక శ్రద్ధ - మిమ్మల్నే అనుమానించేలా చేస్తున్నాయి బహుశ మీకూ మధురాధర్‌కీ యిలాంటి సంబంధమే వుండుంటుంది...."

"స్టాప్ దిస్ నాన్సెన్స్...."

"నో. దిసీజ్ నాన్‌స్టాప్! మీ ఇద్దరి విషయమూ సోమ శేఖర్‌కి తెలిసిపోయి వుంటుంది. బెదిరించి వుంటాడు. మిమ్మల్ని అసహ్యించుకుని వుంటాడు. అవమానాన్ని భరించలేని మీ యిద్దరూ కూడబలుక్కొని..."

"మిస్టర్ చక్రవర్తీ! యిదే పిచ్చాసుపత్రి అయి వుంటే మిమ్మల్ని వెంటనే అడ్మిట్ చేసుకొని వుండేదాన్ని. ప్లీజ్ గెటవుట్...." ఆపైన మాట్లాడలేకపోయింది శ్యామల గౌరి. దగ్గుతెర ఆమెని కమ్మేసింది.

అదే సమయంలో ఓ బలమైన చెయ్యి చక్రవర్తి భుజంపై పడింది.

త్రుళ్ళిపడి వెనుదిరిగాడు చక్రవర్తి.

దాదాపు పాతికేళ్ళ యువకుడు. అందంగా హుందాగా చురుగ్గా వున్నాడు.

"ఎందరో హంతకుల్నీ నేరస్తుల్నీ చట్టాని కప్పగించ గలవాడివి. నిన్ను మృత్యువు కప్పగించటానికి మన సొప్పటం లేదు. మర్యాద నిలుపుకోవాలని వుంటే వెంటనే వెళ్ళిపో" అన్నాడతను ప్రశాంతంగా.

అది తుఫాను ముందరి ప్రశాంతత అని చక్రవర్తికి తెలుసు కాని అతనెవరో తెలీలేదు. తెలుసుకుందామని శ్యామలగౌరి వైపు తిరిగి అవాక్కయిపోయాడు.

మెరుపులా శ్యామలగౌరి దగ్గరగా వెళ్ళాడా యువకుడు. మోకాళ్ళపై కూర్చొని కర్చీఫ్‌తో ఆమె పెదవుల కంటిన రక్తాన్ని మృదువుగా తుడిచాడు. చక్రవర్తిని చూశాడు.

యిప్పు డతని మొహంలో మూర్తీభవించిన దైన్యం వుంది. ఆ కళ్ళలో జలపాతా లున్నాయి.

"చెప్పండి ఇన్‌స్పెక్టర్! ఇలాంటి స్థితిలో వున్న గౌరి- హత్య చెయ్యగలదా! పోనీ - హత్యలో భాగం పంచుకోగలదా?"

"యూ మీన్...."

"గౌరి క్యాన్సర్ పేషంట్!!!"

"మైగాడ్!!!"

"అవును ఇన్‌స్పెక్టర్! తన ఆయుర్దాయం ఒక్క సంవత్సరం మాత్రమేనని ప్రత్యక్షంగా తెలిపి - తెలిపిన తర్వాత బలవంతంగా చావలేక, ఆశల్ని చిగురింపజేస్తూ బ్రతకలేక ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన నన్ను కన్నీళ్ళతో తిరస్కరించి ఒకరిపై ఆధారపడకుండా ఈ స్థితిలో సైతం వుద్యోగం చేస్తూ నా జీవితం నాశనం కాకూడదని తన్ను తాను త్యాగం చేసుకొని విరాగినిలా బ్రతుకుతూ మీలాగే అసహ్యంగా మాట్లాడే సహోద్యోగుల దాడిని భరించలేక - అర్థం చేసుకున్న సోమశేఖర్ని ఆత్మీయుడిగా చూస్తూ అతనిలో సోదరుడ్నీ తండ్రినీ చూస్తూ తన చిట్టచివరి బర్త్‌డే సెలబ్రేషన్‌కి అతన్ని భోజనానికి పిలిచిన శ్యామలగౌరి- అతన్ని హత్య చెయ్యగలదా? ప్లీజ్ ఆన్సర్ మీ ఇన్‌స్పెక్టర్!!" చిన్న కుర్రాడిలా ఏడుస్తోన్నాడా యువకుడు.

జీవితంలో మొట్ట మొదటిసారిగా తనని తాను తిట్టుకున్నాడు ఇన్‌స్పెక్టర్ చక్రవర్తి.

5

"మధురాధర్ లేడామ్మా?" అడిగాడు చక్రవర్తి.

శ్యామలగౌరిని తను అనుమానించటం, ఆమెని వ్యంగ్యంగా హేళన చెయ్యటం, ఆమె పరిస్థితి. ఆమెను పెళ్ళాడే అవకాశం లేకపోయినా యింకా ఆరాధిస్తోన్న ఆ సుధీర్ - గౌరి రక్తం కక్కుకోవటం - యిదంతా జరిగాక చక్రవర్తి మనసు పాడైపోయింది. యింటికి వెళ్ళిపోయి కూడ అనీజీగా ఫీలయ్యాడు.

బాబూరావు రాలేదు. అతని వద్దనుండి ఏవిధమైన సమాచారమూ లేదు. మధురాధర్‌ని కలిశాడా? ఇంటరాగేట్ చేశాడా? ఏం తెల్సుకున్నాడు? ఏమయ్యాడు?

స్టేషన్‌కి ఫోన్ చేశాడు రాలేదని తెల్సింది. ఇంటికి మనిషిని పంపించాడు. రాలేదని తెల్సింది. లాభం లేదని తనే బయలుదేరి వచ్చాడు. ఎందుకయినా మంచిదని కాస్త రూపు రేఖలు మార్చుకొని వచ్చాడు.

"....లేరని చెపుతోంటే అలా పిచ్చిచూపు లేమిటి?" అందామె విసురుగా.

పులిక్కిపడి ఈ లోకంలో కొచ్చాడు చక్రవర్తి.

"ఎక్కడికి వెళ్ళాడు?"

"ఏట్లోకి....ఏమిటయ్యా ఆ ప్రశ్న? మగాళ్ళు. లక్ష పనులు. చెప్పి వెళతారా ఏం?"

"నేను లక్షా ఒక్క పనిమీద వచ్చాను. పోనీ ఏటికి వెడితే దొరుకుతాడా అమ్మా?"

"దొరికితే నీ అదృష్టమే. వెళ్ళు...." ధడాలున తలుపుల వేసుకుందామె.

'ఈమె ఆ స్తితోనే పైకొచ్చినవాళ్ళా వున్నాడీ మధురాధర్' గొణుక్కుంటూ యివతలి కొచ్చాడు చక్రవర్తి.

మధురాధర్ యింటి కెదురుగా కాస్త పక్కగా ఓ సైకిల్‌షాపు వుంది. నేరుగా అక్కడికి నడిచాడు చక్రవర్తి.

పదహారేళ్ళ కుర్రాడు సైకిల్ ట్యూబుకి పంచర్ వేస్తున్నాడు. అతన్ని పరిచయం చేసుకున్నాడు.

"మధురాధర్ వూళ్ళో వున్నాడా?" అడిగాడు.

"వాడా!? వాడ్ని గురించి నన్నడక్కండి సార్!" అన్నాడా కుర్రాడు.

"ఏం?"

"వాడుట్టి వెధవ."

"అంటే?"

"వెధవ అంటే తెలీదా సార్? వెధవే!!"

నవ్వొచ్చింది చక్రవర్తికి. వివరా లడిగాడు.

మధురాధర్ వట్టి పిపినారిట. పది రోజుల క్రితం తన హంబర్ సైకిలుకి యాభై రూపాయల రిపేరు చేయించుకున్నాడుట. యింతవరకూ యివ్వలేదు.

భార్య అంతో యింతో ఆస్తి తెచ్చింది. మధురాధర్ వ్యసనాలకు బానిస. ఆ సంగతి తెల్సిన అతని తండ్రి తన ఆస్తినంతా కోడలి పేరిట వ్రాసి బాల్చీ తన్నేశాడు. అందుకే మధురాధర్ భార్యకి అహంభావం ఎక్కువ. భర్తని చెప్పుచేతల్లో పెట్టుకోవాలని చూస్తుంది.

అది మధురాధర్‌కి సరిపోదు. వ్యసనాలని విడువలేదు.

భార్య అజమాయిషీని సహించలేదు. తేనెలోపడ్డ ఈగలా అయిందతని పరిస్థితి.

అతనిలో పట్టుదల విజృంభించింది. తనూ ఎలాగైనా సంపాదించాలి. భార్య నోటిని అదుపు చెయ్యాలి. అందుకు ప్రస్తుతం శాయశక్తులా ప్రయత్నిస్తోన్నాడు.

"....ప్రస్తుతం మధురాధర్ వ్యాపారం చేస్తున్నాడా?" ప్రశ్నించాడు చక్రవర్తి.

"వడ్డీవ్యాపారం చేస్తున్నాడు సార్!" చెప్పాడా కుర్రాడు.

"అందుకు కేపిటల్ ఎక్కడిది?"

"ఏమో సార్. ఎవడి కొంప ముంచాడో వెధవ...."

చక్రవర్తి అతనికి దగ్గరగా జరిగాడు. "చూడు - ఈ ఇంటికి సరిగ్గా ఆరో యిల్లు...."

"సోమశేఖర్‌గారు సార్! మొన్న చచ్చిపోయాడుగా! పాపం! చాలా మంచివాడు సార్!"

"సోమశేఖర్‌కీ మధురాధర్‌కీ బాగా స్నేహం వుండేదా?"

"మంచి స్నేహితుల్సార్! వాళ్ళిద్దర్నీ పక్క పక్కన చూసినప్పుడల్లా నేను 'రామ రావణుల మధ్య స్నేహం' అనుకునేవాడ్ని."

"ఈ మధ్య వాళ్ళిద్దరూ పోట్లాడుకున్నారా?"

"నాకు తెలీదు."

"ఈ రోజు బాబూరావుసారు యిటువేపొచ్చాడా?"

"నేవొచ్చి గంటైంది. రాలేస్సార్."

"సరే - యిదుంచు. ఏదయినా వివరాలు తెలిస్తే నాకు చెప్పు."

"మీ రెవరు సార్?"

"క్రయిమ్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌ని."

"అయ్ బాబోయ్ - మీదగ్గర డబ్బులు తీసుకోవడమే?"

"ఫర్వాలేదు."

జంకుతూనే తీసుకున్నాడు ఆ కుర్రాడు. "సార్...." నెమ్మదిగా అన్నాడు.

ఏమిటన్నట్టు చూశాడు చక్రవర్తి.

"మధురాధర్‌కి జయంతి అనే అమ్మాయితో పరిచయం వుంది సార్!"

చక్రవర్తి కళ్ళు మెరిశాయి. "ఎవరామె?"

చెప్పాడా కుర్రాడు.

6

ఆ గది పరిమళభరితంగా వుంది.

అందులో వున్నది ఒకే మంచం. మనుషు లిద్దరు!!

అతను అలసటగా పడుకున్నాడు.

ఆమె నెమ్మదిగా లేచింది. బాత్‌రూమ్‌కేసి నడిచింది. అయిదు నిమిషాల తర్వాత ఆమె బయటికి వచ్చింది. యిప్పు డామె చేతిలో కత్తి వుంది!!

చప్పుడు చెయ్యకుండా అతని వెనక భాగానికి చేరుకుంది. నెమ్మదిగా చెయ్యి పైకి వెళ్ళింది. వేగంగా క్రిందికి దూకబోయింది. అంతే....

"ఢాం" అని పిస్తోలు పేలిన శబ్దం! 'అమ్మో' అన్న కేక! కత్తి క్రిందపడి 'భళ్ళు'మని చేసిన చప్పుడు?

పులిక్కిపడి లేచి కూర్చున్నా డతడు.

"మిస్టర్ మధురాధర్! ఆమె ప్రమాదకరమైన వ్యక్తి. ముందుగా ఆమెని అదుపులోకి తీసుకోండి. ఆ తర్వాత

తలుపు తెరవండి" గట్టిగా కేక పెట్టాడు బాబూరావు.

మధురాధర్ మెరుపులా లేచాడు. ఆమె చేతులు వెనక్కి విరిచి పట్టుకొని తలుపు తీశాడు.

బాబూరావూ చక్రవర్తీ ఆ గదిలోకి ప్రవేశించారు.

"జయంతీ! నువ్వు....నువ్వు నన్ను చంపబోయావా?" ఆశ్చర్యంగా అన్నాడు మధురాధర్.

జయంతి దోసిట్లో మొహం కప్పుకొని ఏడుస్తోంది.

"పాపిష్టిదానా! నీ కోసం నేను ఎంతో త్యాగం చెయ్యటానికి సిద్ధపడ్డాను. నన్ను ప్రేమించానన్నావు. వంటిమీది నగలన్నీ వలిచి యిచ్చి వడ్డీవ్యాపారానికి ప్రోత్సహించావు. నిన్ను పూర్తిగా నమ్మాను. యిదా ఫలితం? నన్ను చంపితే ఏమొస్తుంది నీకు?" కఠినంగా అన్నాడు మధురాధర్.

చివాలున తలెత్తింది జయంతి. "ఏమీ రాదు. తృప్తి మిగులుతుంది."

"ఎందుకు?" ప్రశ్నించాడు చక్రవర్తి.

సోమశేఖర్‌కి వివాహం కాకముందు—అంటే దాదాపు పది సంవత్సరాల క్రితం ఏలూరులో క్రొత్తగా వుద్యోగం వచ్చినప్పుడు జయంతితో పరిచయమైంది. జయంతి సోమశేఖర్‌ని ఘాటుగా ప్రేమించింది. కాని సోమశేఖర్ ఆమెలో చెల్లిని చూశాడు.

అర్థించింది. ప్రాధేయపడింది. కాని అతడు బ్లంట్‌గా తిరస్కరించాడు. హైదరాబాదు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు.

జయంతి ప్రయివేట్ ఫర్మ్‌లో పనిచేస్తూండటంతో ఆమె కదల్లేక పోయింది. సోమశేఖర్ తిరస్కారం ఆమెలో

పగను రగిలించింది. సమయం దొరికితే కసి తీర్చుకోవా లని కూడ నిర్ణయించుకుంది.

కాలం గడిచేకొద్దీ నిర్ణయాలు మారతాయనీ పగ పొగ చూరి పోతుందనీ నానుడి. కాని జయంతి అదృష్టు కాలేక పోయింది. మనసుని మరొకడికి అర్పించలేకా సోమశేఖర్ని మరువలేకా ఆమె చాలా నలిగిపోయింది.

అందుకే ఆమె కన్యగా వుండిపోయింది.

లోకం దృష్టిలో కన్యగా మిగిలింది గాని, శారీరకంగా ఆమె మలినపడింది. అందుక్కారణం ఆమె బాస్.

ఇటీవల హైదరాబాదులో ఒక ఎలక్ట్రానిక్స్ సేల్స్ సెంటర్ తెర్చాడు ఆమె బాస్. తనని అక్కడికి బదిలీ చెయ్యమని రిక్వెస్టు చేసింది. తన కోరిక తీర్తిస్తే అలాగే చేస్తానన్నాడు బాస్.

ఆలోచించింది జయంతి. పగ విచక్షణా జ్ఞానాన్ని నశింపజేసింది. అంతే. ఆమె అఘ్రూణిత పుష్పమైంది. ఆర్నెల్ల క్రితం అసిస్టెంట్ మేనేజర్‌గా ఆమెని ప్రమోట్ చేస్తూ 'రోహిణీ ఎలక్ట్రానిక్స్' కి బదిలీ చేశాడు బాస్.

జయంతి, సోమశేఖర్‌ని అంతమొందించటంలో తను రసహ్యంగా వుండిపోదల్చుకుంది.

అందుకే అతని స్నేహితుడైన మధురాధర్ని వల్లో వేసుకుంది. భార్యతో విసిగిన మధురాధర్ ఆమెకి తేలిగ్గా లొంగిపోయాడు.

భార్యకి విడాకులిచ్చి, జయంతిని చేసుకుంటానన్నాడు మధురాధర్. సోమశేఖర్ తనని వెంటాడుతున్నాడనీ, అతడు తనకి దూరపు బంధువనీ, అతని అడ్డు తొలిగేవరకూ

పెళ్ళి చేసుకోవటం కుదర్దనీ చెప్పింది.

తను వ్యాపారం చెయ్యటానికి నగలిచ్చి—వగలు కురిపిస్తూ శారీరకంగా సైతం మురిపించే జయంతి ముందు, సోమశేఖర్ ప్రాణం దూదిపింజలా కన్పించింది మధురాధర్‌కి.

ఇంతలో మధురాధర్ దంపతులు వ్రతం తలపెట్టారు. అతనికి అయిడియా తట్టింది. భర్తకు ముందుగా తీర్థం యివ్వకుండా ఏ భార్యా ముట్టుకోదు.

అంతే! పంచామృతం గ్లాసులో విషం కల్సింది. సోమశేఖర్ ప్రాణం గాల్లో కల్సింది.

"....మరి మధురాధర్‌నీ ఎందుకు చంపబోయావు?" ప్రశ్నించాడు చక్రవర్తి.

"నన్ను కాదని యింకోదాన్ని చేసుకున్న సోమశేఖర్ మరణంతో నా పగ చల్లారింది. నేనింతగా పతనం కావటాని క్కారణం ప్రేమ! పిచ్చి ప్రేమ!! అంతేగాని పతితగా బ్రతకాలని లేదు. పైగా నా పొందుకోసం స్నేహితుణ్ని చంపి, భార్యకి విడాకు లివ్వటానికి సిద్ధపడ్డవాడు, నన్నుమాత్రం బాగా చూసుకుంటాడని గ్యారంటీ ఏమిటి? అందుకే మధురాధర్ని చంపి—నన్ను తొలిసారిగా మలినపరచిన నా బాస్‌నీ నరకానికి పంపి—"

"నువ్వుమాత్రం స్వర్గానికి పోదామనుకున్నావు...." అన్నాడు చక్రవర్తి.

"ఎక్కడికి పోతానో తెలీదు. చచ్చిపోయేదాన్ని. అంతే!"

చక్రవర్తి ఇద్దరికీ బేడీలు తగిలించాడు. □

రేపటి వార్త

కృష్ణచైతన్య

S.L.S. BOOK STALL
VJA.6
PATAMATA

సుబ్బారావు టైం చూసుకున్నాడు ఉదయం పదిన్నర కావస్తుంది. కుర్చీలోంచి లేచి వెళ్ళి వంటగది ద్వారం దగ్గర నిలబడి లోపలికి తొంగిచూశాడు. శారద కూరలు

తరుగుతుంది. చప్పుడు చెయ్యకుండ వెనక్కి తిరిగి వరండాలోకి వచ్చాడు

వరండాలోంచి మేడమీదకు మెట్లున్నాయి. చకచక మెట్లెక్కి తలుపు గడియపెట్టి మేడమీద గదిలోకి వెళ్ళాడు. గది దాటాక వరండా వుంది.

సుబ్బారావు వరండాలో నిలబడి చుట్టూ చూచాడు. పక్కింటి మేడవైపు తప్పించి మిగతా మూడువైపులా మేడమీద పిట్టగోడ చాలా ఎత్తుగా వుంది. మేడమీద నిల బడితే దూరంగా ఎక్కడో ఎత్తుగా వున్న మేడలు తప్పించి మరేమీ కన్పించదు.

సుబ్బారావు సిగరెట్ వెలిగించి పక్కింటి మేడవైపు నడిచి, పిట్టగోడమీదుగా అవతలి వైపు చూచాడు. రెండు మూడు నిముషాలు నిశ్శబ్దంగా గడిచింది.

కొద్దిసేపటి తర్వాత అవతల గదిలో తలుపు చప్పుడు విన్పించి ఆసక్తిగా ముందుకు వంగాడు. తలుపు తెరుచు కొని సరళ వచ్చింది మేడమీదకు.

సుబ్బారావును చూడగానే చిన్నగా నవ్వింది.

సుబ్బారావుకూడ నవ్వి, "మూడునిముషాలు ఆలస్యం!" అన్నాడు.

"నీకులా నేను తీరిగ్గా లేనుగా!" అని నవ్వి, "ఏం చేస్తుంది మీ ఆవిడ?" అంది నెమ్మదిగా.

"వంట చేస్తుంది!" క్లుప్తంగా అని, సరళ చెయ్యి పట్టుకున్నాడు.

సరళ విడిపించుకోలేదు. "ఇలాగే కొంతకాలం జరిగితే మన వ్యవహారం మీ ఆవిడకు తెలుస్తుందేమో!" అంది.

"ఆ! దాని మొహం! దానికంత తెలివికూడానా?" అని "అయినా నాకిదేం బావోలేదు" అన్నాడు కొస్త విసుగ్గా.

"ఏమిటి?"

"ఇదే! ఊరికే ఇలా కాళ్ళుచేతులు నొక్కుకోవడం, చూచుకోవడం!!"

"మరేం చెయ్యాలి?" అడిగింది సరళ నవ్వుతూ.

ఆ నవ్వు చూస్తుంటే సుబ్బారావుకు పిచ్చెక్కుతుంది. ఆ విషయం తెలిసే అలా నవ్వుతుంది

"నువ్వు తెగించాలి! కనీసం ఒక్కసారయినా, మన స్నేహానికి పరమార్థం ఏర్పరచుకోవాలి!"

"అదేనా పరమార్థం అంటే?" క్రింది పెదవిని మునిపంట నొక్కి నవ్వుతూ అడిగింది.

సుబ్బారావుకు పిచ్చెక్కినట్లయింది. "నువ్వు ఏ విషయం చెప్పకపోతే నేనే గోడదూకి లోపలికి వస్తాను!" అన్నాడు బెదిరిస్తున్నట్లు.

"అమ్మో! వొద్దు. ఆ పనిమాత్రం చెయ్యొద్దు. ఏ క్షణంలో అయినా అమ్మ రావచ్చు!" అంది భయంగా.

"మరెలా?" అసహనంగా అడిగాడు.

"తొందరపడకు. నే చెబుతాను. ఆ తర్వాత నీ ఇష్టం" నవ్వుతూ అంది.

సుబ్బారావు ఏదో అనబోయాడు.

"అమ్మాయ్! సరళా?" అంటూ వాళ్ళమ్మ మేడమీదకు వస్తున్న చప్పుడు విన్పించింది. సుబ్బారావు చటుక్కున వెనక్కు తిరిగి, మేడమీద గదిలోకి వచ్చాడు.

రెండు నిముషాల తర్వాత యిద్దరూ కలిసి క్రిందకు వెళుతున్న చప్పుడు విన్పించి చిన్నగా నిట్టూర్చాడు.

సరళ! సరళ ఎంత అందంగా వుంటుంది. ఇరవై ఏళ్ళుంటాయేమో! వయసుకు మించిన కోరికలు ఆమె కళ్ళల్లో కన్పిస్తాయి. సరళ వాళ్ళ అమ్మానాన్నలకు ఒక్కతె

కూతురు. గారాబం యెక్కువైందేమో, చదువు బొత్తిగా అబ్బినట్లు లేదు. ఎలిమెంటరీ స్కూలుతోనే ఆపేసి ఇంట్లో కూర్చుంది. సరళ నాన్నగార్కి సుల్తాన్ వీధిలో కిరాణా కొట్టుంది. ఉదయం ఎనిమిది గంటలకు వెళితే రాత్రి తొమ్మిది గంటల కొస్తాడు. ఇక వాళ్ళమ్మ ప్రతిసారి మేడ మెట్లు ఎక్కలేదు.

ఇక శారద విషయానికొస్తే, తనేమో, తన యింటి పనేమో! ఆమె కిలాంటి విషయాలు తెలియవు. అందుకే ఆర్నెల్లుగా తమ ప్రేమాయణం నిరాటంకంగా సాగి పోతుంది.

సుబ్బారావు ఆలోచనలు చెరిపేస్తూ క్రింద తలుపు కొట్టిన శబ్దం విన్పించింది.

"ఏమండీ! మీ కోసం యెవరో వచ్చారు!" శారద అరుస్తోంది క్రింద నుంచి.

సుబ్బారావు క్రిందకు దిగి వెళ్ళాడు.

2

తలుపులు మూసిన గదిలో అతను అసహనంగా అటు, యిటు తిరుగుతున్నాడు.

గదిలో ఒక మూలగా నిలబడిన వాళ్ళిద్దరూ అతని వైపే ఆసక్తిగా చూస్తున్నారు.

రెండు నిముషాల తర్వాత "బాస్" పిలిచాడు ఆ ఇద్దర్లో ఒక వ్యక్తి.

అతను ఆగి 'ఏమిటి?' అన్నాడు కరుగ్గా.

"ఈ పథకం మరీ ప్రమాదకరంగా వుంది. మీరు పోయి పోయి పోలీసు కమీషనర్‌తో తలపడుతున్నారు" అన్నాడు బెరుగ్గా.

బాస్ అవునన్నట్లుగా తలవూపి. "అవును! నా కా

విషయం తెల్సు. కాని తప్పదు. ఆ నారాయణరావు నా తండ్రిని కాల్చి చంపాడు. అందుకు ప్రతీకారం తీర్చుకోవాలి. ఒకే దెబ్బకు రెండు పిట్టలు. నారాయణరావుకు చాల ఆస్తి వుంది. నా ప్రతీకారం తీరడంతోపాటు, డబ్బూ చేతికి వస్తుంది. అయినా మీకు చెప్పిన పనిలో పెద్ద రిస్కేమీ లేదు. ఇంతకు ముందు మీరలాంటివి చాలా చేసారు. వాటితోపాటే ఇది కూడ. అంతా నేను చెప్పినట్లు చెయ్యండి. మీ కెలాంటి రిస్కూ వుండదు. ఆ తర్వాత విషయం నేను చూసుకుంటాను. సరేనా?" అన్నాడు.

"అలాగే బాస్!" అన్నారు ఇద్దరూ.

బాస్ టైం చూసుకున్నాడు. సాయంత్రం నాల్గుగంటలు కావొస్తుంది.

"ఊ! ఇక మీరు వెళ్ళండి. మీకు టైం అయింది. తు. చ. తప్పకుండా నేను చెప్పినట్లే చెయ్యండి. మళ్ళీ సగంలో నా కోసం ఫోన్ చెయ్యవద్దు. కార్యక్రమం పూర్తయ్యాక నేరుగా యిక్కడికి వచ్చేయ్యండి!" అన్నాడు.

ఇద్దరూ తలలూపి, తలుపు తెరుచుకొని బయటకు వెళ్ళారు.

వాళ్ళు వెళ్ళాక తలుపు దగ్గరగా వేసి, కుర్చీలో కూర్చొని సిగరెట్ వెల్గించాడు బాస్.

3

చర్చి రోడ్డులో వున్న 'సుప్రియా కాన్వెంట్'కు కొద్ది దూరంలో ఆగివున్న కారులో కూర్చొని, కాన్వెంట్ గేటు వైపే ఆసక్తిగా చూడసాగాడు డేవిడ్.

అయిదు నిముషాల తర్వాత జాకబ్ వచ్చాడు గబగబా.

"ఏమైంది?" జాకబ్‌ను చూడగానే ఆసక్తిగా అడిగాడు.

"ఫోన్ చేసి వచ్చాను. అయిదు నిముషాల్లో వాళ్ళిద్దరూ

వస్తారు జాగ్రత్త. అనవసరంగా ఎక్సైటెట్ కాకు!" హెచ్చరించాడు జాకబ్.

డేవిడ్ తలవూపి కారు స్టార్ట్ చేసి కాన్వెంట్ ముందు ఆపాడు.

రెండు నిముషాల తర్వాత ఆయా ఇద్దరు పిల్లల్ని తీసుకురావటం కన్పించింది. జాకబ్ కారు వెనక సీటులో నక్కి కూర్చున్నాడు.

డేవిడ్ చటుక్కున కారు దిగి, ఎదురువెళ్ళి ఆయా వైపు చూచి చిన్నగా నవ్వి, 'కమీషనర్‌గారికి హఠాత్తుగా హార్ట్ అటాక్ వచ్చింది. పిల్లలిద్దర్ని తీసుకురమ్మన్నారు" అన్నాడు వినయంగా.

ఖాకీ దుస్తుల్లో వున్న అతన్ని అనుమానించ లేదు ఆయా!

"త్వరగా తీసుకువెళ్ళండి!" అని, "కారెవరిది?" అడిగింది.

"డాక్టరుగారిది, కమీషనర్‌గారి కారు రిపేరులో వుంది" అన్నాడు చటుక్కున.

ఆయా తల ఊపి, పిల్లల్ని అందించింది. డేవిడ్ యిద్దర్నీ ముందుసీట్లో కూర్చోబెట్టి, కారు స్టార్టు చేశాడు. పిల్లలిద్దరూ ఆయాకు టాటా చెప్పారు.

ఒక్క నిముషం తర్వాత, వెనకసీట్లో వున్న జాకబ్ రెండు చేతుల్లో కర్చీఫ్ ఉంచుకొని, చటుక్కున ఇద్దరు పిల్లలకు ముక్కులకేసి అదిమిపట్టాడు.

"మరీ గట్టిగా నొక్కకు. పసిపిల్లల ప్రాణాలు పోతాయి!" హెచ్చరించాడు డేవిడ్ కారు నడుపుతూనే.

జాకబ్ ముక్కులమీద నుంచి చేతులు తీసి, నోళ్ళు అదిమిపెట్టాడు. పెద్ద శ్రమ లేకుండానే యిద్దరూ స్పృహ

తప్పారు.

డేవిడ్ ఓరగా యిద్దరు పిల్లలవైపు చూశాడు. ఇద్దరూ ముచ్చటగా వున్నారు. పెద్దబ్బాయికి ఎనిమిదేళ్ళు, చిన్న బ్బాయికి ఆరేళ్ళుంటాయి అనుకున్నాడు. ఇద్దరూ తెల్లటి యూనిఫారంలో చూడ ముచ్చటగా వున్నారు.

"కారెక్కడైనా ఓ పక్కగా ఆపు. నెంబర్ ప్లేటు మార్చాలి!" అన్నాడు జాకబ్.

డేవిడ్ తలవూపి, కొంతసేపటితర్వాత నిర్మానుష్యంగా వున్న వీధిలో కారాపాడు.

జాకబ్ క్రిందకు దిగి కారు రిపేరు చేస్తున్నట్లుగా వెనక వున్న నెంబరు ప్లేట్లు తీసేసాడు. క్రింద యింకో నేమ్ ప్లేటు వుంది. ఇప్పుడు కారుకున్న ప్లేటు నెంబర్స్ రెండూ సరిపోయాయి.

జాకబ్ వచ్చి కూర్చోగానే కారు కదిలింది. "బాస్ చెప్పినట్లుగా ఏడు గంటలవరకు పిటీలో తిరిగి ఆ తర్వాతే పిల్లల్ని అక్కడకు తీసుకెళదాం!" అన్నాడు డేవిడ్.

జాకబ్ మాట్లాడలేదు. సిగరెట్ వెల్గించి సీటుమీద విశ్రాంతిగా వాలాడు.

4

పోలీసు బలగం అంతా అక్కడే వుందా అన్నట్లుగా పోలీసులు, ఇన్‌స్పెక్టర్లు కమీషనర్ యింటి ముందు గుమి కూడి గుసగుస లాడుకుంటూ, కమీషనర్ యివ్వబోయే ఆర్డర్‌కోసం ఎదురుచూస్తున్నారు.

లోపల, విశాలమైన హాల్లో కమీషనర్ నారాయణరావు అసహనంగా అటూయిటూ తిరుగుతున్నాడు. ఆయన భార్య సుమిత్ర ఫోన్‌దగ్గర కూర్చొని మౌనంగా రోదిస్తోంది. ఫోన్ పక్కనే మరో ఇన్‌స్పెక్టర్ కూర్చొని, నిముష

నిముషానికి పెట్రోల్‌వాన్స్ దగ్గరనుంచివచ్చే కాల్స్ రిసీవ్ చేసుకుంటున్నాడు.

ఆ గదిలో వున్నవా రందరిలో ఆందోళన, ఆతృత చోటు చేసుకున్నాయి.

టెలిఫోను మ్రోగింది. పక్కనే వున్న ఇన్‌స్పెక్టర్ రిసీవర్ అందుకొని, "హల్లో! ప్రొసీడ్!" అన్నాడు ఆతృతగా.

"సర్! నేను పెట్రోల్ వాన్స్ నెంబర్ టు నుంచి మాట్లాడుతున్నాను. ఈ చుట్టుపక్కలా ఎక్కడా పిల్లలు కన్పించలేదు. కనీసం వాళ్ళను కిడ్నాప్ చేసి తీసుకువెళు తున్న కారు కూడా కన్పించలేదు. ఇక్కడనుంచి 'ఫోర్త్ లేన్'లోకి ప్రొసీడ్ అవుతున్నాను."

"ఓ. కె! ప్రొసీడ్!" రిసీవర్ పెట్టేసాడు ఇన్‌స్పెక్టర్.

అప్పటివరకు ఆతృతగా చూస్తున్న కమీషనర్ చిన్నగా నిట్టూర్చి మళ్ళీ పచార్లు మొదలుపెట్టాడు.

సెకండ్లు, నిమిషాలు గడుస్తున్నాయి. ఎనిమిది గంటలు దాటి మూడు నిముషాలు అయింది.

టెలిఫోను మ్రోగింది.

"హల్లో! ప్రొసీడ్!" రిసీవర్ ఎత్తగానే మామూలుగా అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అలాగే. ముందు కమీషనర్‌ను పిలవండి!" అవతలి వైపునుంచి కరకుగా విన్పించింది కంఠం.

"ఎవరు మీరు!" అని ఇంకా ఏదో అడగబోయాడు. కమీషనర్ చటుక్కున రిసీవర్ అందుకొని, 'దిసీజ్! కమీషనర్ స్పీకింగ్!" అన్నాడు.

అవతలివైపు నుంచి చిన్న నవ్వు. "వెల్! సీలో

ఇప్పుడు యెంత టెన్షన్ పెరిగిపోతుందో నాకు తెల్సు. దాన్ని తగ్గించడానికే ఫోన్ చేసాను....ఆ....ఆ.... అలాంటి పిచ్చి పనులేవీ చెయ్యొద్దు. నా టెలిఫోన్ ట్రేస్ చేసి మీరు వచ్చేసరికి చాల టైం పడుతుంది కాబట్టి అలాంటి ఆలోచన మాని బుద్ధిగా వినండి!" అన్నాడు అవతలివైపునుంచి.

హడావుడిగా బైటకు వెళ్ళబోతున్న బలగాన్ని చేత్తోనే వారించి,

"చెప్పు! నీకేం కావాలి?" అడిగాడు నెమ్మదిగా.

"అదే చెప్పబోతున్నాను. నీ పిల్లలిద్దరూ నా ఆధీనంలో క్షేమంగా వున్నారు."

"నీకేం కావాలి?" మధ్యలోనే అడిగాడు నారాయణ రావు.

"గుడ్! ఎవర్నువ్వు? ఎక్కడ నుంచి మాట్లాడు తున్నావు?అలాంటి చచ్చు ప్రశ్నలు వెయ్యకుండా డైరెక్టుగా పాయింటుకొచ్చావ్. చెప్పేది జాగ్రత్తగా విను. నువ్వు నా తండ్రిని అమానుషంగా కాల్చి చంపావ్. అందుకోసం నీమీద పగ తీర్చుకోవాలనుకున్నాను. ముందు నీ పిల్ల లిద్దర్నీ చంపాలనుకున్నాను. కాని వాళ్ళను చంపినందువల్ల నాకేం లాభం కన్పించలేదు. అదీగాక నువ్వు లక్షాధికారివి. నీకు ఆరుగంటలపాటు మానసిక క్షోభ, ఆరులక్షలు ఫైన్ వేస్తున్నాను" అన్నాడు కర్కశంగా.

"నువ్వెవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" వృత్తి పరమైన గంభీరంతో అన్నాడు.

"తెల్సు మిస్టర్ నారాయణరావ్! పులితో చెలగాటం ఆడుతున్నానని నాకు తెల్సు. కాని ఆ చెలగాటానికి ముందు నేనెన్ని జాగ్రత్తలు తీసుకున్నానో నీకు తెలియదు. అతి

తెలివికి పోయి నన్ను బంధించిన మరుక్షణం మీ పిల్లలిద్దరి ప్రాణాలు పోతాయి కాబట్టి అలాంటి ఆలోచనలు పెట్టుకోవద్దు. ఒళ్ళీ సరిగ్గా 12 గంటలకు ఫోన్ చేసి చెబు తాను డబ్బు ఎక్కడికి తెచ్చి ఇవ్వవలసింది. ఈలోగా ఏమైనా పిచ్చిపిచ్చి ఆలోచనలు చేస్తే, తెల్లవారగానే పేపర్లో మొదటిపేజీలో "కమీషనర్ పిల్లల దారుణ హత్య" అనేది రేపటి సంచలనవార్త అవుతుంది. గుర్తుంచుకోండి!" చటుక్కున ఫోను పెట్టేశాడతను.

నారాయణరావు రిసీవర్ పెట్టేసి గంభీరంగా లేచి నిల బడ్డాడు. అప్పటివరకు పక్కనే వుండి మాటలు విన్న ఇన్‌స్పెక్టర్. "సర్! ఆరు లక్షలు...." ఇంకేదో అన బోయేలోగానే మాట్లాడవద్దని సైగచేశాడు నారాయణరావు.

ఎవ్వరితో మాట్లాడకుండా తీవ్రంగా ఆలోచిస్తూ తిరుగు తున్నాడు. స్పెషల్ స్క్వాడ్ ఒకటి కాన్వెంట్ దగ్గర నుంచి ఇన్వెస్టిగేషన్ మొదలు పెట్టింది. పెట్రోల్‌వాన్స్ సిటీ అంతా తిరుగుతున్నాయి. ఇంత బలగం వుండీ, పోలీస్ కమీషనరై వుండీ ఆరులక్షలు యిచ్చి బిడ్డల్ని కాపాడాలా? లేక....ఆలోచనల పరంపర అలా సాగి పోతూనే వుంది కమీషనర్ మనస్సులో.

5

సుబ్బారావు భోజనంచేసి వచ్చి వరండాలో నిలబడ్డాడు చల్లగాలికి. పక్కింటి వాకిట్లోంచి రెండుసార్లు దగ్గు విని పించింది సుబ్బారావుకు అదేమిటో తెల్సు. దానికి సమాధా నంగా ఓసారి దగ్గి,యింట్లోకి తొంగిచూశాడు. శారద వంట గది సర్దుతుంది. చకచక మెట్లెక్కి మేడమీదకు వెళ్ళాడు.

అప్పటికే సరళ మేడమీద కొచ్చింది. "ఏమిటి" అది

గాడు ఆత్రంగా.

"మేం యిప్పుడు రెండో ఆటకు పోతున్నాం!" అంది.

"అయితే?" విసుగ్గా అడిగాడు. అసలే ఎంతో ఉత్సాహంగా వచ్చినందుకు, సరళ సినిమాకు వెళ్తున్నాం అనే సరికి నీరసం వచ్చింది.

"మొద్దూ? నువ్వూ రాకూడదూ?"

"ఎందుకూ? నువ్వు మీ అమ్మా నాన్నలతో వెళితే, అక్కడకొచ్చి మీ ముగ్గురి మొహాలు చూస్తూ కూర్చోడానికా?" చిరుకోపంతో అడిగాడు.

సరళ నవ్వి "నువ్వు సినిమాకు రావద్దు. హాలుదగ్గరకు రా! సినిమా మొదలుపెట్టిన పావుగంటకు యేదో సాకుచెప్పి వచ్చేస్తాను. ఆ తర్వాత నీ యిష్టం!" అంది నెమ్మదిగా.

ఎగిరి గంతేసాడు సుబ్బారావు. "అలాగే తప్పకుండా వస్తాను. నువ్వుమాత్రం మర్చిపోకు" అన్నాడు ఉత్సాహంగా.

సరళ తియ్యగా నవ్వి, వెక్కిరించి వెళ్ళిపోయింది.

సుబ్బారావు మనసు ఆనందంతో ఉరకలు వేస్తోంది. ఎంతో కాలంగా యెదురుచూచిన శుభ గడియ ఈ రోజు రాబోతుంది. క్రిందకుదిగి వచ్చి కుర్చీలో కూర్చొని, పుస్తకం అందుకొని తిరగేయసాగాడు.

"తొమ్మిది కావొస్తుంది! వెళ్ళి పడుకోరూ?" శారద వంటింట్లోంచి వస్తూ అడిగింది.

"నువ్వెళ్ళి పడుకో! నా కొంచెం పని వుంది. అలా బజారుదాకా వెళ్ళి రావాలి" అన్నాడు తల తిప్పకుండానే.

శారద మంచంమీద పడుకొని, ఆ రోజు పేపరు తిరగేయసాగింది.

తొమ్మిదిన్నర ప్రాంతంలో పక్కింటి నుంచి దిషా కదలిన చప్పుడు విన్పించింది. కొద్దిసేపయ్యాక సుబ్బారావు

లేచి లుంగీమీద చొక్కా తొడుక్కొని, పర్సు జేబులో పెట్టుకొని. సిగరెట్‌పాకెట్, అగ్గిపెట్టె చేతిలో పట్టుకొని, తలుపుదగ్గరకొచ్చి చెప్పులు తొడుక్కొని వెనక్కు తిరిగాడు.

శారద భర్తవైపే చూస్తోంది.

"నేనలా సెంటర్ వరకు వెళ్ళివస్తాను. తలుపేసుకో!" అన్నాడు బయటకు నడుస్తూ.

వీధిలోకి వచ్చాక లైటు వెలుతురులో టైం చూసుకున్నాడు: తొమ్మిదినలభై అయింది. సరళ చెప్పిన సినిమా హాలు మైలు దూరం వుంటుంది. చిన్నగా నడిచి వెళితే పదింబావు అవుతుంది. కనీసం సినిమా పావుగంట గడిచాక కాని సరళ బైటకు రాదు. ముందుగా వెళ్ళి ఆ చుట్టు పక్కల అందరి దృష్టిలో పడడం కంటే నెమ్మదిగా నడచి వెళ్ళి సరిగ్గా సరళ వచ్చే సమయానికి చేరుకోవడం మంచి దనిపించింది.

సుబ్బారావు సినిమాహాలు దగ్గరకు వచ్చేసరికి పదీ పది అయింది. మామూలుగా సిటీలో అయితే అన్ని సినిమాలు తొమ్మిదిన్నరకే మొదలుపెడతారు. ఈ ప్రాంతం సిటీ ఔట్ స్కర్ట్స్ కావడంవల్ల ఇక్కడ పది గంటలకు మొదలుపెడతారు.

అప్పటికే సినిమాహాలు దగ్గర సందడి తగ్గింది. ఎవరో నలుగురైదుగురు రిక్షావాళ్ళు, ఒకరిద్దరు ఆటోవాళ్ళు తప్పించి మరింకెవ్వరూ లేరు.

సుబ్బారావు మరో సిగరెట్ పాకెట్ కొని, ఓరగా గేటువైపే చూడసాగాడు.

పది ఇరవై ప్రాంతంలో వచ్చింది సరళ. చకచక ముందుకు నడిచాడు సుబ్బారావు.

"ముందు యేదైనా రిక్షాపిలువ్!" అంది సరళ నెమ్మదిగా.

సుబ్బారావ్ రిక్షాను కేకేసాడు. బేరసారాలు మాట్లాడే సమయం కాదది. ఇద్దరూ ఎక్కి కూర్చున్నారు.

"రాంనగర్ కాలనీ పోనీ!" అని రిక్షావాడికి చెప్పి, "ఇంతకీ మీ అమ్మావాళ్ళకు ఏం చెప్పొచ్చావ్?" అడిగాడు నెమ్మదిగా.

"కడుపులో నొప్పిగా వుందన్నాను. నెల నెలా మామూలుగా వచ్చేదే అనుకున్నారు. వాళ్ళూ వస్తాం అన్నారు. నేనే సినిమా బాగుంటుందని, రిక్షా ఎక్కి ఇంటికి వెళతానని చెప్పి వచ్చాను" అంది నవ్వుతూ.

సుబ్బారావు మరింత దగ్గరగా జరిగి సరళ భుజంమీద చెయ్యి వేశాడు.

రాంనగర్ కాలనీ మొదట్లో దిక్షా దిగారు.

"ఇటెక్కడికి? మా ఇంటికా? మీ ఇంటికా?" అంది కోపంగా.

"కోప్పడకు డియర్. మీ ఇంటికి కాదు. మా ఇంటికీ కాదు. నా వెనకే రా! బ్రహ్మాండమయిన యిల్లు వుంది మనకు...."అన్నాడు మలుపుతిరిగి పక్కవీధిలోకి నడుస్తూ.

ఇద్దరూ మౌనంగా చేతిలో చెయ్యి వేసుకొని నడవ సాగారు. అసలే అమావాస్య రోజులు. నక్షత్రాల వెలుగు తప్ప మరేదీ లేదు.

పావుగంట తర్వాత ఓ రేకులషెడ్డు ముందాగి "లోపలికి రా!" అన్నాడు వరండాలోకి నడుస్తూ.

"ఎవరిల్లిది?" ఆశ్చర్యంగా అడిగింది సరళ.

"మనది కాదు. ఎవరో పరంధామయ్య అనుకుంటాను. ఆయన ఇక్కడ పిండిమిల్లు పెట్టాలని ఈ రేకులషెడ్డు కట్టించాడు. అంతా అయినాక మెషినరీ తెచ్చిపెట్టక ముందే 'హరీ' మన్నాడు. ఆయన పోయాక, కొడుకులు, దాయా

దులు ఆస్తి పంపకాల్లో పడ్డారు. దీన్ని పట్టించుకోవడం మానేసారు. సంవత్సరం నుంచి ఇది ఇలాగే వుంది. మనకు బాగా పనికొస్తుందని ఎన్నుకున్నాను. ఇక్కడి కెవ్వరూ రారు! సరేనా?"

"లోపలికి వెళదాం!" అంది సరళ చుట్టూ చూస్తూ.

"అలాగే! కాని తాళం వేసుంటుంది" అని క్షణం ఆలోచించి, చీకట్లోనే ఓ పెద్ద రాయి తెచ్చి, "ఒక్క దెబ్బతో ఈ తాళం విరగ్గొట్టేస్తాను. ఆ శబ్దం ఎవ్వరికీ వినిపించకుండా నువ్వోసారి 'దగ్గు' " అన్నాడు.

సరళ అతను చెప్పినట్లే చేసింది. ఒకే దెబ్బతో తాళం విరగ్గొట్టి లోపలికి వెళ్ళి తలుపు మూసారు.

కటిక చీకటిగా వుంది లోపల. సుబ్బారావు ఆలస్యం చెయ్యదల్చుకోలేదు. సరళను ఆత్రంగా పొదివి పట్టు కున్నాడు. అంతే! మరుక్షణంలో ఆ పట్టు విడిపోయింది. ఇద్దరూ చీకట్లోనే భయం భయంగా ఒకరి నొకరు చూసు కున్నారు. మళ్ళీ విన్పించింది, మూలుగు.

"ఎవరో మూల్గుతున్నట్లుంది! ...." చెవిలో భయంగా చెప్పింది సరళ.

సుబ్బారావు పిరికివాడు కాదు. తాళం వేసివున్న గది లోకి ఎవరు, ఎలా వచ్చారా? అని ఆలోచించలేదు. జేబు లోంచి అగ్గిపెట్టె తీసి వెలిగించాడు.

ఆ వెలుతురులో వాళ్ళిద్దరికీ కన్పించిన దృశ్యం చూచి కొయ్యబారిపోయారు. ఇద్దరు పిల్లలు. నోట్లో గుడ్డలు కుక్కి కాళ్ళు చేతులు కట్టేసి వున్నాయి.

సుబ్బారావు మరో అగ్గిపుల్ల వెల్గించి వాళ్ళ దగ్గరగా వెళ్ళాడు. ఇద్దరూ ఇంతింత కళ్ళు చేసుకొని భయంగా చూడసాగారు.

ఓ క్షణం సుబ్బారావుకు తను చూపిన సినిమాలు, చది విన కథలూ గుర్తుకొచ్చాయి. ఎవరో ఈ పిల్లల్ని ఎత్తు కొచ్చి ఇక్కడ దాచారు. వీళ్ళ తల్లితండ్రుల దగ్గర డబ్బు గుంజాక వాళ్ళకు ఈ అడ్రస్ చెబుతారు. రోజు గడిచాకో, రెండ్రోజులు గడిచాకో వాళ్ళ తల్లితండ్రులు వెతుక్కుంటూ వచ్చి పిల్లల్ని తీసుకెళతారు. అలాంటిదే ఈ బాపతు అనుకున్నాడు.

భయంగా చూస్తూన్న వాళ్ళ కళ్ళవైపు చూడగానే తెలుస్తుంది, వాళ్ళ నోట్లో గుడ్డలు తియ్యగానే వాళ్ళు చెయ్యబోయే మొదటి పనేమిటో. అందుకే సుబ్బారావు వాళ్ళ దగ్గరగా వెళ్ళి చెవిదగ్గర నెమ్మదిగా చెప్పాడు.

"బాబూ! మేము మీ కేమీ హాని చెయ్యం. మిమ్మల్ని మీ ఇంటిదగ్గర దింపుతాను. నోట్లో గుడ్డలు తీస్తాను. అరవకండి!" అన్నాడు కట్లు విప్పుతూ.

పిల్లలిద్దరూ అరవకుండా లేచినలబడ్డారు. కాని వాళ్ళ కళ్ళలో భయం ఇంకా పోలేదు.

"మీ నాన్నగారి పేరేమిటి?" సరళ అడిగింది.

"మా నాన్నగారు పోలీస్ కమీషనర్ నారాయణరావు గారు!" అన్నాడు పెద్ద కుర్రాడు.

గతుక్కుమన్నాడు సుబ్బారావు. అంతలోనే ధైర్యం తెచ్చుకొని, "మిమ్మల్ని, ఆటోగాని, రిక్షాగాని ఎక్కిస్తాను. ఇంటికి వెళతారా!" అడిగాడు.

ఇద్దరూ తల ఊపారు.

సరళ భయంతో సుబ్బారావు చెయ్యి పట్టుకొంది.

"ఏం భయంలేదు. వీళ్ళను ఆటో యెక్కించి అయిదు నిముషాల్లో వచ్చేస్తా! పాపం పిల్లలు భయపడతారు!" అన్నాడు ధైర్యం చెబుతూ.

"మళ్ళీ సినిమా వదిలే వేళవుతుంది!" అంది.

"అయిదునిమిషాల్లో వచ్చేస్తా! ఈలోగా తలుపేసుకో" అని పిల్లల్ని తీసుకొని చక చక బయటకు నడిచాడు.

రోడ్డుమీద కొచ్చేసరికి ఆటో వస్తూ కనిపించింది. కాని అందులో ఎవరో వున్నారు. సుబ్బారావు ధైర్యంచేసి ఆపాడు.

"సవారి వుంది" అన్నాడు డ్రైవర్ ఆటో ఆగగానే.

"ప్లీజ్ చాలా అర్జెంట్. వీళ్ళిద్దరూ పోలీస్ కమీషనర్ పిల్లలు. దారి తప్పిపోయారు. ఎలాగయినా వాళ్ళింటి ముందు దించి వెళ్ళండి" ప్రతిమాలుతూ డబ్బులు తీసి ఇవ్వబోయాడు.

కమీషనర్ పిల్లలనగానే డ్రయివర్ అదిరిపడి "వొద్దు సార్. మీరేమీ కిరాయి ఇవ్వొద్దు. నేను క్షేమంగా దిగవిడిచి వెళతాను" అన్నాడు ఇద్దర్నీ ఆటో ఎక్కించుకుంటూ.

సుబ్బారావు ఆటో నెంబరు నోటు చేసుకొని, ఆటో వెళ్ళిపోయాక చక చక వెనక్కి తిరిగి నడుస్తూ టైం చూసుకున్నాడు. పన్నెండు గంటలు కావొస్తుంది ఇంకా గంటకు కాని సినిమా వదలరు అనుకున్నాడు నడక వేగం హెచ్చిస్తూ.

6

టెలిఫోన్ మ్రోగింది.

నారాయణరావు రిసీవరుందుకొని, "హల్లో!" అన్నాడు.

"డబ్బు సిద్ధం చేశావా?"

"ఆ!"

"అక్కడి కొచ్చాక పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే నీ పిల్లల శవాలే దొరుకుతాయ్."

"అలాంటివేం చెయ్యను."

"గుడ్!" ఆ డబ్బు తీసుకొని ఫలానా చోటకు రమ్మని అయిదు నిముషాలు వివరించి, "సరిగ్గా అయిదు గంటల కల్లా అక్కడికిరా. డబ్బు అందగానే నీ పిల్లల్ని నీ కప్పగిస్తాను" రిసీవరు పెట్టేసాడతను.

నారాయణరావు నీరసంగా లేచి, సూట్ కేసులో పాత కాగితాలు సర్దసాగాడు.

"సర్!" ఇన్ స్పెక్టర్ అడిగాడు నెమ్మదిగా.

"నా దగ్గర యిప్పుడంత డబ్బులేదు. ఏం చెయ్యను? చూద్దాం. అక్కడికి వెళ్ళాక పరిస్థితి" అన్నాడు లేస్తూ.

"సార్!" పిలుపుతోపాటు "డాడీ?" అంటూ పిల్లలిద్దరూ లోపలికి దూసుకు వచ్చారు.

నారాయణరావు మొహం పిల్లల్ని చూడగానే విప్పారింది. భార్యాభర్త లిద్దరూ పిల్లల్ని అక్కున చేర్చుకున్నారు.

"బాబూ! మీరెలా వచ్చారు?" ఆశ్చర్యంగా అడిగాడు నారాయణరావు.

అక్కడే వున్న ఆటోడ్రయివర్ చెప్పాడు "మీ పిల్లలిద్దరు దారి తప్పారని, వీళ్ళను మీ ఇంటి దగ్గర దించమని ఎవరో వ్యక్తి వీళ్ళను రాంనగర్ కాలనీ దగ్గర ఎక్కించాడు" అన్నాడు.

అక్కడున్న పోలీసు బలగంలో 'టెన్షన్' తగ్గి క్యూరియాసిటీ పెరిగింది.

పావుగంట చర్చల తర్వాత రెండు జీపులు, రెండు వ్యాన్లు రాంనగర్ కాలనీ వైపు దూసుకుపోయాయి.

* * *

మరుసటిరోజు పేపర్లో మొదటిపేజీలో 'బాక్స్ కట్టిన వార్త' "రేకుల షెడ్డులో ప్రేమికుల దారుణహత్య!" □

గుడ్డి దర్బారు

వసుంధర సీరియల్

(గత సంచిక తరువాయి)

డిటెక్టివ్ వెంకన్నకు ఇద్దరు అసిస్టెంట్సు. ఒకామె పేరు సీతమ్మ. మరొకామె పేరు రాజమ్మ. వాళ్ళిద్దరూ సుమారు పదునెనిమిదేండ్ల ప్రాయం వాళ్ళు ఇద్దరికిద్దరూ చెప్పుకోదగ్గ అందగత్తెలు. వెంకన్న ఆఫీసుకు వెళ్ళడానికి

వాళ్ళో పెద్ద ఆకర్షణ అని కొందరంటారు. ఓసారి చూస్తే వాళ్ళ నుంచి చూపులు మరల్చుకొనడం కష్టం. అంతేకాక ఇద్దరి కిద్దరూ మహా చిలిపివాళ్ళు.

వెంకన్న తన అసిస్టెంట్స్‌తో సరసమాడినా, పొర పాటున భార్యమీద జోకు విసిరినా ఫోన్ మ్రోగుతుంది. ఫోన్ మ్రోగిందంటే అతడికి అక్షింతలు తయారయ్యా యని అసిస్టెంట్స్ జోక్ చేస్తారు.

ఇంట్లోంచి వచ్చే ఫోను ఎరుపు రంగుది. బయటినుంచి వచ్చే ఫోను నలుపు రంగుది.

వెంకన్నకు ఏ ఫోన్‌కాల్ వచ్చినా అది అసిస్టెంట్సిద్దరూ కూడా ఏకకాలంలో అతడితోపాటే వినడానికి సదుపాయం వుంది.

ఒకోసారి వినడంలో ఎవరయినా పొరపాటు పడ వచ్చు. కానీ ముగ్గురొకేసారి పొరపాటు పడడం అరుదు కదా - అందుకని వెంకన్న ఈ ఏర్పాటు చేశాడు. అదీ కాక కేసుకు సంబంధించిన విషయాలు మళ్ళీ మళ్ళీ అసి స్టెంట్స్‌కి డిక్టేట్ చేయడం వెంకన్నకు చిరాకు. అందుకని కూడా ఇలాంటి ఏర్పాటు చేశాడతను. కానీ ఈ ఏర్పాటు వల్ల ఒకోసారి అతడి అసిస్టెంట్స్ - వెంకన్నకూ, భార్యకూ మధ్య జరిగే సంభాషణ కూడా వినేసి అతణ్ని ఏడ్పిస్తుంటారు.

ఆ సమయంలో ఇంటి ముందు కారు ఆగగానే గౌరి, మిత్ర బృందం ఆఫీసు ప్రవేశ ద్వారంలోంచి లోపలకు వెళ్ళారు. వీళ్ళను చూడగానే వెంకన్న క్లయింట్సనే అను కున్నాడు. అందులోనూ బాబు, మోహన్ బాగా దెబ్బలు తిని వున్నారేమో - వాళ్ళకు అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా వుంది.

వాళ్ళేవో వివరాలు చెబుతారనుకుని సీతమ్మ, రాజమ్మ పెన్సిలు, పుస్తకంతో సిద్ధంగా వున్నారు.

వెంకన్న వాళ్ళని క్లయంట్సుని పలకరించినట్లు పలకరించాడు.

వాళ్ళతడికి ఆ యింటి అతిథుల్లా బదులిచ్చారు.

వాళ్ళంతా ఒకరి నొకరు అర్థం చేసుకునేందుకు కొంత సేపు పట్టింది. ఈలోగా పద్మావతీదేవి అక్కడి పరిస్థితి అర్థం చేసుకుని భర్తకు ఫోన్ చేసింది. అప్పుడు వెంకన్న అందర్నీ తీసుకుని లోపలకు వెళ్ళాడు.

అక్కడ పరస్పర పరిచయాలు జరిగాయి.

"నువ్వన్న మాట గౌరివి!" అన్నాడు వెంకన్న కుతూహలంగా.

గౌరి సిగ్గుతో తల దించుకుంది.

నాని నెమ్మదిగా ఆ రోజు తమకు జరిగిన అనుభవం చెప్పాడు. అది విని వెంకన్న ఆగకుండా అయిదు నిముషాలసేపు నవ్వాడు.

"ఎందుకలా నవ్వుతారు?" అంది పద్మావతీదేవి కోపంగా.

"నా అనుచరులను చూస్తూంటే నేను శ్రీరామ చంద్రుడినా అనిపిస్తోంది" అని మళ్ళీ నవ్వాడు వెంకన్న.

"మా ఊళ్ళో నా కెవ్వరూ ఎదురు నిల్వలేరు" అన్నాడు మోహన్.

"మీ వూరి సంగతి నాకెందుకు? ఇక్కడ నా అసిస్టెంట్సుని చూశావుగదా. ఆడపిల్లలు - వాళ్ళు చాలు నిన్ను పడగొట్టడానికి."

"అక్కా - బావగారికి వేళాకోళంగా వుంది" అన్నాడు మోహన్.

"లేదు తమ్ముడూ - ఆయన నిజమే చెబుతున్నారు" అంది పద్మావతీదేవి.

"మనిషికి బలం ఒక్కటే చాలదు. పోరాటాలకూ కొన్ని పద్ధతు లున్నాయి. కిటుకు లున్నాయి. ఈ మహా పట్నంలో దుర్మార్గాల నెదుర్కోవాలంటే నీ బలానికింకా జతపడవలసిన పాఠాలు అవసరం."

"బలమున్నవాడికి కిటుకులు తెలిస్తే-బాప్‌రే... అప్పుడు మోహన్ ప్రతాపం చూడాలి" అన్నాడు బాబు.

"అలా తొందర పడకండి. మీకు నేను అన్నీ నేర్పు తాను. అయితే ఈ పట్నంలో అన్నింటికీ మించి మీరు నేర్చుకోవలసిం దేమిటంటే తొందరపడి శత్రువు మీద చేయెత్తకూడదు. ఆవేశాన్ని ప్రదర్శించకూడదు. చేత్తో మనిషి పీకె కోస్తున్నా - ముఖంలో వంకాయ తరుగు తున్న భావం కనబడాలి" అన్నాడు వెంకన్న.

"మరేం చేయాలి?" అన్నాడు నాని.

"ముందు నా పథకం వినండి" అన్నాడు వెంకన్న.

అందరూ వినడం కోసం మౌనం వహించారు. వెంకన్న తన పథకం వివరించాడు.

"గౌరి కొడుకు వీరభద్రానికి కూడా కొంత శిక్షణ అవసరం. నా నాటకంలో వాడికి కూడా పాత్ర వుంది. నిజం చెప్పాలంటే వాడిదే ముఖ్యమైన పాత్ర" అన్నాడు వెంకన్న.

"పసివాడు - వాడివల్ల ఏమవుతుంది?" అంది గౌరి కంగారుగా.

"తండ్రివద్ద ఎలా మసలాలో ముందునుంచీ వాడికి శిక్షణ ఇవ్వకపోతే ఎలా?" అన్నాడు వెంకన్న.

"అదెలా సాధ్యం?" అంది గౌరి.

వెంకన్న నవ్వుతూ తన జేబులోంచి ఓ మాస్కు తీసుకుని ముఖానికి తగిలించుకుని సరిగ్గా అడ్జస్టు చేసుకున్నాడు. అంతే - అతకు గోపాలకృష్ణగా మారిపోయాడు.

గౌరి అతని వంకే ఆశ్చర్యంగా చూసింది.

"బాబుకు నన్ను-వాడి తండ్రిగా పరిచయం చేస్తే నేను వాడికి నాతో ఎలా మసలాలో శిక్షణ ఇస్తాను. గోపాలకృష్ణ అలవాట్లు నాకు బాగా తెలుసు. ఈ విషయమై ఊళ్ళోని ఓ వృద్ధజంట నాకు సాయం చేస్తానని మాట ఇచ్చారు. ముందు నా దగ్గర కొంత మాలిమి అయినాక అప్పుడు బాబు నిజంగా తండ్రివద్దకు వెళ్ళి వుంటాడు" అన్నాడు వెంకన్న.

27

కృషికి మించింది ఏమీలేదు.

సరిగ్గా ఆరంటే ఆరు వారాల్లో గౌరి, మిత్రబృందం అన్ని విద్యల్లోనూ ఆరితేరారు.

వారి పట్టుదలకు, శ్రద్ధకు వెంకన్నకే ఆశ్చర్యం కలిగింది. అతడి కిప్పుడు వారి సామర్ధ్యంపట్ల నమ్మకం కుదిరింది.

నాని అట్టే ఇల్లు కదిలేవాడు కాదు. కానీ బాబు, మోహన్ తరచుగా పట్నంలో తిరిగి వస్తుండేవారు. మోహన్‌కయితే ఎవరిమీదనైనా తన బల ప్రతాపం చూపించాలని సరదా వుండేది. తన శక్తి వృధా అయిపోతున్నదనీ ఏవరితోనయినా దెబ్బలాడాలనీ కుతూహలపడుతూండేవాడు. రోజూ జనం బాగా ఎక్కువగా వున్నచోటికి వెళ్ళి అక్కర్లేని గొడవల్లో తలదూర్చి వస్తూండేవారు బాబు, మోహన్.

ఒక రోజున కూరల బజార్లో ఏదో గొడవవుతోంది.

ఓ సన్నటాయన పదిమందిమీద ఎగిరెగిరి పడుతున్నాడు. అప్పుడు మోహన్ విషయం కూడా ఏమిటో తెలుసుకోకుండా ఆ సన్నటాయన భుజం మీద చేయివేసి "ఊదితే ఎగిరిపోయేలా వున్నావు - ఎందుకలా ఎగుర్తావు? నీలాంటివాడికి కోపం మంచిది కాదు" అని సలహా యిచ్చాడు.

ఆ సన్నటాయన ఏదో అనబోయి బలిష్టమైన మోహన్ శరీరం చూసి భయపడి గొడవ మానుకుని వెళ్ళిపోయాడు.

"మనమంటే జనం భయపడుతున్నారు" అంటూ సంతోషంగా అన్నాడు బాబుతో.

"మరికాస్త భయపెడదాం పద!" అన్నాడు బాబు.

ఇద్దరూ కలిసి ఓ సినిమా హాలు దగ్గర ఆగారు.

అక్కడ ఓ జేబుదొంగను పట్టుకుని నలుగురు తంతున్నారు. ఆ దొంగకి పెదాలు చిట్లి రక్తం వస్తున్నది.

మోహన్ ఆ నలుగుర్నీ ఆపి "నలుగురు కలిసి ఒకణ్ణి తంతున్నారు. ఒక్కడు నలుగుర్ని తన్నడం యెలా ఉంటుందో చూస్తారా?" అన్నాడు.

మోహన్ వాటం చూస్తే అన్నంత పనీ చేసేలా గున్నాడు. వాళ్ళతన్ని చూసి భయపడి ఆ దొంగను వదిలి వెళ్ళిపోయారు. ఆ దొంగ పోతూ పోతూ ఓ సారి వీళ్ళ కాళ్ళమీద పడి మరీ పోయాడు.

"జనాన్ని భయపెట్టడమే కాదు. డైలాగులు కూడా బాగా చెబుతున్నావు నువ్వు" అంటూ మిత్రుణ్ణి మెచ్చుకున్నాడు బాబు.

ఇద్దరూ అక్కణ్ణించి యింకా నాలుగడుగులేనా వేశారో లేదో—బ్లాక్ మార్కెటింగ్ కారణంగా సినిమా హాలువద్ద గలాటా ప్రారంభమయింది. జనం రెండు గుంపులుగా

చేరి కొట్టుకుంటున్నారు.

బాబువంక చూపి గర్వంగా నవ్వాడు మోహన్ "నిజంగా మన ప్రతాపం చూపించాల్సిన సమయం వచ్చింది. పద!"

మోహన్ మళ్ళీ నాలుగడుగులు వెనక్కి వేసి "అసలు గొడవేమిటోయ్" అంటూ అక్కడ నిలబడివున్న ఒకతని భుజం మీద వెనుక నుంచీ చేయి వేశాడు.

ఆ వ్యక్తి విసురుగా వెనక్కి తిరిగాడు.

అతన్ని చూసి మోహన్ ఉలిక్కిపడ్డాడు.

అతను టైగర్!

ఒక్కసారి మోహన్ కళ్ళముందు ఆ నాడు తను దెబ్బలు తింటున్న దృశ్యం మెదిలింది. అయితే అతడి కిప్పుడు ఆవేశం కలుగలేదు. భయం!

తను చేయివేసిన తీరుకు టైగర్‌కు కోపం వచ్చిందని ముఖం చూస్తే తెలిసిపోతుంది. అందులోనూ మోహన్ వంక అతడు మరీ కోపంగా చూస్తున్నాడు.

అయితే మోహన్ బుద్ధి చురుగ్గా పనిచేసింది "గురూజీ నమస్కారం" అంటూ చేతులు జోడించాడతను "ఆహాహా ఏమి కండలు మీవి. నేనూ మీకులా తయారవ్వాలంటే నేనేం చేయాలి?" అన్నాడతను.

టైగర్ ముఖంలోని కోపం తగ్గలేదు.

"నేనూ మీ జాతివాణ్ణే గురువుగారూ" అంటూ మోహన్ తన కండలు పొంగించి చూపాడు—"కానీ నా వళ్ళు—మీ ముందు తీసికట్టే! బలమైన శరీరం యెక్కడ కనిపించినా భుజంతట్టి మెచ్చుకోకుండా వుండలేను. మిమ్మల్ని చూస్తూంటే మాత్రం అంతటితో ఆగాలనిపించడం లేదు. నామీద దయుంచి మీరు నాకు మీ ఫోటో ఒకటిప్పిస్తే

రోజూ ఏకలవ్యుడిలా పూజ చేసుకుంటాను."

టైగర్ ముఖంలో కోపం మాయమయింది—"నిజంగా నీకు నా ఫోటో కావాలా?" అన్నాడు.

మోహన్ తలాడించాడు.

"అయితే పక్కనే స్టుడియో వుంది. పద—పోయి తీయించుకుందాం" అన్నాడు.

బాబు, మోహన్ అతన్ని అదేపనిగా పొగుడుతూ ఫోటో స్టుడియోకు వెళ్ళారు. టైగర్‌కి ఫోటో తీయడమయ్యాక "గురువుగారూ! మిమ్మల్ని చూడగానే నాకులా అభిమాను లయ్యే వాళ్ళు చాలా మంది వుంటారు. నా మాట విని నాలుగైదు ఫోటోలు జేబులో పెట్టుకుని తిరుగుతూండండి" అన్నాడు మోహన్.

టైగర్ ఛాతీ వుబ్బింది. అతను స్టుడియో అతనితో "పది కాపీలు బస్టుసైజు. డబ్బు వీళ్ళిస్తారు. వీళ్ళకు ఒక్కటే కాపీ—మిగతా తొమ్మిదీ నావి" అన్నాడు.

టైగర్ వెళ్ళిపోయాక "ఈ రోజు మనకు చాలా ఆముదం అయినట్లుంది" అన్నాడు బాబు.

"ఏం చేస్తాం—దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేయాలని బయల్దేరాం. కానీ టైగర్ని చూస్తూంటే భయం చేస్తోంది" అన్నాడు మోహన్.

"ఒకవేళ టైగర్ దుష్టుడు కాదేమో!" అన్నాడు బాబు.

"టైగర్ దుష్టుడు కాకపోతే కథే లేదుగదా" అన్నాడు మోహన్.

"ఈ ఫోటోల డబ్బు....?"

"తప్పదు మరి. జరిగిందంతా యింట్లో చెప్పాలి"—అన్నాడు మోహన్.

28

డిటెక్టివ్ వెంకన్న జరిగింది విని యిద్దర్నీ బాగా మందలించి "మిమ్మల్ని టైగర్ బృందంలో ప్రవేశపెట్టా లని నేననుకుంటూంటే మీరస్తమానూ వెళ్ళి వాళ్ళ కళ్ళ బడుతున్నారు. నేనేం చేసేది?" అన్నాడు.

"ఆ టైగర్ అంటే నాకు అంతులేని కసి. ఆవేశం. వాణ్ణేదో చేసేయాలన్న కోరిక నాలో బలంగా వుంది అయితే వాడు నిజంగా కళ్ళెదుట పడగానే గుండెలవిసిపోతు న్నాయి. చేతులు లేవడంలేదు" అన్నాడు మోహన్.

"అందుకేనా పొగిడి ఫోటో అడిగావు" అన్నాడు వెంకన్న.

"ఫోటో యెందు కడిగానో మీకు తెలియదు. అందుకో పెద్ద కారణముంది. నేను మీరనుకున్నంత తెలివి తక్కువ వాణ్ణికాదు" అన్నాడు మోహన్.

రెండు రోజులు పోయాక వెంకన్న ఓ విచిత్రం చూశాడు.

గది గోడకు ఓ అట్ట. ఆ అట్టమీద బస్టుసైజు ఫోటో ఒకటి అంటించబడి వుంది. ఆ ఫోటో టైగర్‌ది. మోహన్ ఆ ఫోటోను ఇష్టం వచ్చినట్లు గుద్దేస్తున్నాడు. అతడు రెండు చేతుల్నీ వుపయోగిస్తున్న విధానానికి వెంకన్న అచ్చెరు వందాడు.

"ఏం చేస్తున్నావ్?" అడిగాడు వెంకన్న.

"నా కసినంతా ఈ ఫోటో మీద తీర్చుకుంటున్నాను."

"అందువల్ల ప్రయోజనం?" అన్నాడు వెంకన్న నవ్వుతూ.

"వాణ్ణి కొట్టడానికి ధైర్యం పెరుగుతోంది" అన్నాడు

మోహన్.

"వెరీగుడ్! దెన్ ప్రొసీడ్ ...." అన్నాడు వెంకన్న.

ఆ ఫోటో యెప్పుడు కనబడినా చేయి విసరడం అల వాటైపోయింది మోహన్‌కి. ఒకరోజు పిటీ బస్‌లో తిరుగు తూండగా మోహన్‌కి టైగర్ కనిపించాడు. అతను మోహన్‌ని చూడలేదు. అలవాటు ప్రకారం మోహన్ తన చేయి అతడి మీదకు విసిరాడు. చివరి క్షణంలో ప్రమాదం పసికట్టిన బాబు చటుక్కున చేయి పట్టుకుని ఆపకపోతే అక్కడ ఓ పెద్ద గొడవ జరిగి ఉండేదే?

"అసలైన మిత్రుడివి నువ్వే—సరైన సమయానికి నా ప్రాణాలు రక్షించావు" అంటూ మోహన్ బాబును మెచ్చు కున్నాడు.

"ప్రాణాలు రక్షించడమా! నేనింకా టైగర్ కళ్ళబడ కుండా ఆపానని అనుకుంటున్నాను" అని "ఇంకా నీకు టైగర్ అంటే భయం పోలేదా?" అన్నాడు బాబు.

"టైగర్ అంటే నాకు భయమా—పద చూద్దువుగాని" అన్నాడు మోహన్. ఇద్దరూ కలిపి వెంటనే యింటికి వెళ్ళి పోయారు. మోహన్ టైగర్ ఫోటో వద్దకు వెళ్ళి రెండు చేతులతో కపితీరా కొట్టడమే కాక కాళ్ళతో కూడా తన్ని "టైగర్—ఇప్పుడేమంటావ్?" అంటూ వికటాట్టహాసం చేశాడు.

"చిన్న పిల్లాడిలా ఫోటో ఆటలేమిటి?" అన్నాడు బాబు.

"ఈ రోజిది నీకు ఆటల్లాగే అనిపించవచ్చు. కానీ చూస్తూ వుండు. ఒకరోజు టైగర్ ఈ ఫోటోస్థానంలో వుంటాడు" అన్నాడు మోహన్.

అప్పుడే అక్కడికి ప్రవేశించిన వెంకన్న "టైగర్

స్థానం విషయం యెలాగున్నా—ఈ రోజుతో మీకీ ఇంట్లో స్థానం లేదు" అన్నాడు.

"ఏం జరిగింది?" అన్నాడు బాబు కంగారుగా.

"నువ్వు, మోహన్, నాని—మీ ముగ్గురూ నేను చెప్పిన యింట్లోకి మకాం మార్చండి. ఇక మన పథకం ప్రారంభించాలి. మీ వేషాలు పూర్తిగా మారిపోవాలి. మీ క్రాపులు మారిపోవాలి. ఇప్పుడున్న ఈ పల్లెటూరి వేషం మీకు పనికి రాదు. న్యూ ఢిల్లీ నుంచి పొట్ట చేతపట్టుకుని వచ్చారు మీరు. అలాగని అందరికీ చెప్పుకోవాలి. ఆ తర్వాత ఎప్పటి కప్పుడు నేను నా కార్యక్రమం మీకు ఎలాగో అలా తెలియ జేస్తూంటాను" అన్నాడు వెంకన్న.

"మీ రెలా చెబితే అలా?" అన్నాడు బాబు.

అప్పుడు వెంకన్న మిత్రులు ముగ్గుర్నీ ఓ గదిలోనికి తీసుకుని వెళ్ళాడు.

అరగంటలో వారి రూపాలు పూర్తిగా మారిపోయాయి.

గౌరి తన మిత్రుల వంక ఆశ్చర్యంగా చూసి "మీరు మీరేనా?" అంది!

"దేవీ—నీ అభిప్రాయం కూడా చెప్పు" అన్నాడు వెంకన్న.

"వీళ్ళను గుర్తించడం కష్టంగానే వుంది. కానీ ఇప్పుడే బాగున్నారు" అంది పద్మావతీదేవి.

"బాగోగుల సంగతికేంలేగానీ—బాగా పరిచయమైన మీరే వీళ్ళని గుర్తించలేనప్పుడు—ఎప్పుడో ఒకటి రెండు సార్లు మాత్రం చూసిన టైగర్ వీళ్ళని గుర్తించడం అసాధ్యమే—అందులోనూ రూపశిల్పి వెంకన్న కదా!" అన్నాడు వెంకన్న.

29

రైల్వేస్టేషన్లో ఫస్ట్‌క్లాసు వెయిటింగ్ రూంలో కూర్చు న్నాడు గోపాలకృష్ణ. అతడి పక్కన నీలం రంగు సూట్ కేసు ఒకటి వున్నది.

గోపాలకృష్ణ పేరు యింకా పోలీసు రికార్డులోకి వెళ్ళ లేదు. బాధ్యతా నిర్వాహణలో సర్వసమర్థుడైన ఓ పోలీ సాఫీసరు కొడుకుగా డిపార్టుమెంట్లో అతడికిప్పటికీ ఇంకా యింతో అంతో గౌరవం కూడా వున్నది. అందువల్ల వినా యకరావు తన రహస్య పత్రాల రవాణాకు గోపాలకృష్ణను ఉపయోగించుకుంటున్నాడు.

ఇప్పుడు గోపాలకృష్ణ వద్ద వున్న సూట్‌కేసులో వినా యకరావుకి సంబంధించిన అతిముఖ్యమైన రహస్య పత్రా లున్నవి. ఆ సంవత్సరం తన ముఠా ఏయే రోజుల్లో ఏయే కార్యకలాపాల్లో పాల్గొంటుందో మరో ముఠాకు తెలియ బరుస్తూ వినాయకరావు వ్రాసిన వివరాలవి. రెండో ముఠా వినాయకరావు ముఠాకు అనుబంధ సంస్థ వంటిది. ఆయన తెచ్చిన బంగారం మత్తు పదార్థాలకు ఈ ముఠా ద్వారానే డబ్బు వస్తుంది.

సుమారు పది సంవత్సరాలుగా గోపాలకృష్ణ ఈ రవాణా కొనసాగిస్తున్నాడు. పొరుగూరిలోని ఓ మనిషి కతడా సూట్‌కేసు అందించి తిరిగి అలాంటిదే వెనక్కు తెచ్చుకో వలసి వుంటుంది. ఆ సూట్‌కేసులో డబ్బు వుంటుంది. డబ్బు అంటే చిన్న మొత్తం కాదు. నలభై—యాభై లక్షల వరకూ వుండవచ్చును.

తనకు తెలియకుండానే గోపాలకృష్ణ ఈ వ్యవహారంలో కీలకపాత్ర వహిస్తున్నాడు.

ట్రయిన్ రావడానికింకా నలభై నిముషాల వ్యవధి

వుంది. గోపాలకృష్ణ ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఆ సమయంలో అక్కడికో అందమైన అమ్మాయి వచ్చింది. చూడ్డానికి డాషింగ్ గర్ల్‌గా వుంది. ఆమె వెంకన్న అపిస్టెంటు రాజమ్మ అని చెప్పినా గుర్తించడం కష్టం. ఆమె చేతిలో గోపాలకృష్ణ వద్ద నున్న సూట్ కేసుకంటే పెద్ద సూట్ కేసు వుంది. ఆమె పక్కన ఆరేళ్ళ కుర్రాడున్నాడు. అతడు వీరభద్రం అని వేరే చెప్పనక్కర్లేదు.

రాజమ్మ తన సూట్ కేసును గోపాలకృష్ణ సూట్ కేసు మీద పెట్టి—పైన సూట్ కేసుమీద ఏదో బటన్ నొక్కింది.

తమాషా ఏమిటంటే అదొక ప్రత్యేకమైన సూట్ కేసు. సరిగ్గా గోపాలకృష్ణ వద్దనున్న సైజు సూట్ కేసే మరొకటి అందులో వున్నది. ఈ సూట్ కేసు ఆ సూట్ కేసు చుట్టూ ఒక ఫ్రేంగా వున్నది. బటన్ నొక్కగానే ఫ్రేం కాస్త వదులవుతుంది—కొద్దిసేపు మాత్రం. అప్పుడా సూట్ కేసుని క్రిందకు నొక్కితే....

ఇప్పుడు అదే జరిగింది.

గోపాలకృష్ణ సూట్ కేసు ఆ ఫ్రేంలోకి లాగబడింది. ఆ ఫ్రేంలోని సూట్ కేసు బయటకు వచ్చేసింది. మళ్ళీ ఫ్రేం బిగుసుకుపోయింది. ఎటొచ్చీ ఇందాకా పైన వుంచిన సూట్ కేసు ఇప్పుడు అడుక్కు వెళ్ళిపోయింది. ఇదంతా జరగడానికి పట్టిన సమయం కొద్ది క్షణాలుమాత్రం!

అప్పుడే ప్లాట్ ఫారంమీద ఒక ప్రకటన వినబడింది. ట్రయిన్ అరగంట లేటుట.

రాజమ్మ విసుగ్గా తన సూట్ కేసు తీసుకుంది. అప్పుడు గోపాలకృష్ణ ఆమెవంక చూశాడు. ఆమె చేతిలోని సూట్ కేసు తన చేతిలోని సూట్ కేసుకంటె చాలా పెద్దది. అందువల్ల అతడికామె గురించి ఎటువంటి అనుమానమూ రాలేదు.

రాజమ్మ అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

ఈలోగా ఆరేళ్ళ వీరభద్రం నెమ్మదిగా గోపాలకృష్ణను సమీపించి—"డాడీ! ట్రయినెప్పుడొస్తుంది?" అనడిగాడు ముద్దుగా.

గోపాలకృష్ణ ఉలిక్కిపడి ఆ కుర్రాడివంక చూశాడు.

"ఏమన్నావూ?" అన్నాడు గోపాలకృష్ణ ఆశ్చర్యంనుండి తేరుకుంటూ.

"ట్రయినెప్పుడొస్తుంది డాడీ!" అన్నాడు వీరభద్రం మళ్ళీ.

"ట్రయినింకా గంటదాకా రాదుకానీ నేను నీకు డాడీ ఏమిటి?" అన్నాడతను కంగారుపడుతూ.

"అదేంటి డాడీ—నువ్వు కాకపోతే ఇంకెవరు నా డాడీ?"

"ఎవరు చెప్పారు నేను డాడీ అని!" గోపాలకృష్ణ చుట్టూ చూస్తూ వాడిని గద్దించి అడిగాడు.

"అమ్మ!"

"ఏదీ మీ అమ్మ?"

"నాకు తెలియదు—"

"ఎక్కడుంది మీ అమ్మ?"

"నాకు తెలియదు—"

గోపాలకృష్ణ విసుగ్గా—"నువ్వెవరో-నాకు తెలియదు-అవతలకు ఫో—" అన్నాడు.

దాంతో ఆరేళ్ళ వీరభద్రం ఏడుపు లంకించుకున్నాడు.

ఇది చాలామందిని ఆకర్షించింది. జనం చుట్టూ మూగారు. బాబుని బుజ్జగించి విషయం అడిగి తెలుసుకున్నారు.

"అమ్మ వచ్చిపోయింది. ఊళ్ళు చూపిస్తానని నాన్న

ఇక్కడకు తీసుకొచ్చాడు. ఇప్పుడు నేనెవరినో ఎరుగనంటు న్నాడు" అన్నాడు వీరభద్రం ఏడుస్తూ.

జనంలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. పెళ్ళాం పోగానే కొడుకును వదిలించుకోవాలనుకోవడం దుర్మార్గమని అక్కడున్న కొందరు తీర్మానించారు.

"నాది దుర్మార్గం అంటారేంటయ్యా—ఈ కుర్రాడిదే పచ్చి మోసం!" అన్నాడు గోపాలకృష్ణ.

ఆ కుర్రాడు నాటకమాడుతున్నాడంటే అక్కడున్న వాళ్ళెవరికీ నమ్మ బుద్ధికాలేదు.

అప్పుడు గోపాలకృష్ణ విసుగ్గానూ, కోపంగానూ— "మీకు తెలియదేమో—నా కసలు పెళ్ళే కాలేదు—" అన్నాడు.

దాంతో అక్కడున్న జనం తెల్లబోయారు.

అప్పుడే సరిగ్గా ఆ జనం మధ్యనుంచి వచ్చాడో ముస లాయన. గోపాలకృష్ణవంక గుచ్చిగుచ్చి చూస్తూ— "బాబూ—నువ్విక్కడున్నావేంటి? ఇక్కడీ గొడవేంటి? నువ్వు ఎస్పీ వీరభద్రంగా రబ్బాయివి కదూ?" అన్నాడు.

గోపాలకృష్ణ తేలిగ్గా నిట్టూర్చి—"మీ రెవరో నాకు తెలియదు. కానీ నేనెవరో ఇక్కడున్న వాళ్ళందరికీ చెప్పి నన్ను రక్షించారు" అన్నాడు.

"నీకు తెలియకపోయినా—నేనూ, మీ నాన్నా బాగా స్నేహితులం. ఆయన నీ పెళ్ళికి ఆహ్వానం కూడా పంపాడు. ఏదో కారణంవల్ల పెళ్ళికి రాలేకపోయాను. మర్నాడు వచ్చి సారీ చెబుదామనుకున్నాను. కానీ నా దురదృష్టం—పెళ్ళి నాటి రాత్రి పోయాడాయన ..." అంటూ నిట్టూర్చాడు ముసలాయన.

"ఇతనికి పెళ్ళయిందా—మరి కాలేదంటాడేం?"

జనంలో మళ్ళీ గుసగుసలు ప్రారంభమయ్యాయి.

గోపాలకృష్ణకు ఏం చెప్పాలో తెలియలేదు. ముసలాయన వచ్చి తన్ను రక్షించాడనే అనుకుంటే—మరింత ఇబ్బందిలో పడేశాడు.

"నాకు పెళ్ళయింది. కానీ పిల్లలు లేరు—" అన్నాడు గోపాలకృష్ణ ఇబ్బందిగా మొహంపెడుతూ.

"మరైతే ఈ బాబు ఎవరు?"

"ఎవడో మోసగాడు—"

అంతవరకూ వెనుకనున్న ముసలాయన ముసలావిడ ఒకామె అప్పుడు ముందుకు వచ్చింది. బహుశా ఆమె ముసలాయన భార్య అయుండాలి. ఆమె చటుక్కున వీరభద్రావన్ని ఎత్తుకుని—"ముక్కుపచ్చలారని ఈ బాబును మోసగాడననడానికి నీకు నోరెలా వచ్చిందయ్యా?" అంది నిష్ఠూరంగా.

"ఇలాంటి కష్టం మీకూ వస్తే అప్పుడు తెలుస్తుంది" అన్నాడు గోపాలకృష్ణ.

"అసలు విషయమంతా ఈ బాబు నడిగితే తెలిసిపోతుంది గదా—" అని—"బాబూ—నువ్వూ మీ నాన్నా ఎప్పుడు బయల్దేరారు?" అంది ముసలావిడ.

"అమ్మ దేవుడి దగ్గరకు వెళ్ళిపోయింది రోజూ అమ్మకోసం యేడుస్తున్నాను. డాడీ ఏమో ఈ వేళన్నాడూ—మనం ఊరికెడుతున్నాం—నీకు మమ్మీని చూపిస్తాను—అన్నాడు. నా బట్టలన్నీ నేనే పెట్టెలో సర్దుకున్నాను. నన్ను రోజూ ఆడించే కోతి బొమ్మను కూడా డాడీ పెట్టెలో వేశాడు. నా కిష్టమైన పాపిన్సు కూడా పెట్టెలో వుంచాడు. ఇప్పుడు నే నెవర్నో తెలియదంటున్నాడు—" అంటూ వీరభద్రం మళ్ళీ ఏడ్చాడు.

"ఎంత ఘోరం? ఎంత ఘోరం?" అన్నారొకరు.

"అన్నీ అబద్ధాలు—వీణ్ణి నే నెప్పుడూ చూడలేదు—" అన్నాడు గోపాలకృష్ణ.

"అయితే ఓ సారి నీ సూట్ కేస్ చూపించు. నిజం తెలుస్తుంది—" అన్నాడు ముసలాయన కాస్త కోపంగా.

"నేను చూపించను. నాకా అవసరం లేదు—" అన్నాడు గోపాలకృష్ణ.

ఇది వినాయకరావు రహస్యాలు బయటపెట్టడానికి పన్నబడిన యేదైనా శత్రువ్యూహం కానీ కాదుగదా అని అతడనుమానించాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ సూట్ కేస్ తెరవకూడదనుకున్నాడు.

అయితే అక్కడి పరిస్థితి కాసేపట్లో ఎలా మారిపోయిందంటే—గోపాలకృష్ణ ఆ కుర్రాణ్ణి తన కొడుకనైనా అంగీకరించాలి. లేదా జనమే బలవంతాన సూట్ కేసు తెరిపించేలాగున్నారు.

అతను కొద్దిక్షణాలు ఆలోచించాడు.

తను ఆ కుర్రాణ్ణి వదుల్చుకోవడం ఎంతైనా అవసరం.

అదీకాక పెట్టెలో వున్న కాగితాలు ఎవరికీ అనుమానాన్ని కలిగించవు అందులోనిది రహస్యభాషవలన ఎవరికీ అర్థమూ కాదు.

చివరికతను విసురుగా సూట్ కేస్ తెరిచి ర్రమాన్పడి పోయాడు.

"నా కోతిబొమ్మ—నా కోతిబొమ్మ—"

వీరభద్రం ఉత్సాహంగా అరిచాడు.

"బొమ్మ కాదురా—నేనే కోతినయ్యాను—" అనుకున్నాడు గోపాలకృష్ణ.

అందులో కోతిబొమ్మ మాత్రమే కాక బాబు బట్ట

లున్నాయి. వాడు చెప్పిన పాపిన్సు కూడా వున్నాయి.

ముసలాయన గోపాలకృష్ణ భుజంమీద చేయివేసి—"చూడు బాబూ—భార్య పోయిన విరక్తిలో నీకీ బాబు అంటే అయిష్టత యేర్పడి వుండవచ్చు. సంసార జీవిత మంటేనే ఏహ్యాభావం కలిగివుండవచ్చు. కానీ ఇంతకాలం అల్లారుముద్దుగా పెరిగిన ఈ ముక్కుపచ్చలారని పసివాణ్ణి నడిరోడ్డుమీద వదలిపెట్టాలనుకోవడం మాత్రం మాటల్లో వర్ణించలేనంత ఘోరం—" అన్నాడు.

ముసలావిడ బాబును గుండెలకు హత్తుకుని—"మా కెవ్వరూ లేరు. నువ్వు అంగీకరిస్తే—ఈ బాబును మేము పెంచుకుంటాము—" అంది.

"నాకు డాడీయే కావాలి—డాడీ లేకపోతే నేనుండ లేను—" అన్నాడు వీరభద్రం ఏడుపు కంఠంతో.

"ఎవడ్రా నీ డాడీ?" అరిచాడు గోపాలకృష్ణ.

"ఆవేశపడకు బాబూ—ముందు ఇంటికి పోదాం పద—" అన్నాడు ముసలాయన.

ఆయన పసివాళ్ళు దేవుడిచ్చిన వారాలనీ, ఆ వరం అరుదైనదనీ గోపాలకృష్ణకు చెప్పాడు. ముసలావిడ బాబు ముఖంలోని అమాయకత్వాన్ని పొగుడుతోంది. గోపాలకృష్ణకు మాత్రం వాడి ముఖంలో పచ్చి మోసగాడు కనిపిస్తున్నాడు. పెరిగి పెద్దవాడైతే వాడే మవుతాడో?

అప్పటికింక తప్పనిసరై గోపాలకృష్ణ తన సూట్‌కేస్ తీసుకుని ఆ వృద్ధదంపతుల ఇంటికి వెళ్ళాడు.

ముసలాయన పేరు జయరామయ్య. ముసలావిడ కామాక్షమ్మ. వారికి డబ్బుకి లోటులేదు. ప్రస్తుతం ఏ పనీ లేదు. ప్రశాంతజీవనం గడుపుతున్నారు.

వారిది చాలా పెద్ద ఇల్లు. ఆ ఇల్లు మరీ ప్రశాంతంగా

వుండిపోయిందని వారి బాధ.

అక్కడ కాసేపున్నాక గోపాలకృష్ణ వెళ్ళిపోయాడు.

"డాడీ వెళ్ళిపోతే ఇంక రాడు. రోజూ నాకు డాడీయే అన్నం పెట్టాలి. డాడీయే స్నానం చేయించాలి. డాడీయే బట్టలు వేయాలి—" అంటూ వీరభద్రం గట్టిగా ఏడుపు లంకించుకున్నాడు.

"ఇవన్నీ చేయడానికి నేనేమైనా నీ నౌకర్ననుకున్నావా?" అంటూ గోపాలకృష్ణ వాడిని గదిమాడు.

"మరి అమ్మ వున్నప్పు డిలాగెందుకనలేదు?" తండ్రి కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నాడు వీరభద్రం.

గోపాలకృష్ణ ఆశ్చర్యంగా వాడి వంక చూశాడు.

ఎవరీ కుర్రాడు? చూడ్డానికెంతో అమాయకంగా కనబడుతున్నాడు. కానీ ఇన్ని మాటలెప్పుడు నేర్చాడు? ఎక్కడ నేర్చాడు? వీణ్ణి తనమీదకు ఎవరు ఉసిగొలిపారు? ఇందుకు వాళ్ళాశించే ప్రయోజన మేమిటి?

వీరభద్రం కొనసాగించాడు—"అమ్మ అనేదీ—డాడీ చేత సేవలు చేయించుకోవడం కోసం తాతగారే నా రూపంలో పుట్టారుట. అందుకని నాకు తాతగారి పేరే పెట్టారుట—"

"ఏమిట్రా—నీ తాత పేరు?" విసురుగా అన్నాడు గోపాలకృష్ణ.

"వీరభద్రం—"

గోపాలకృష్ణ బ్రమాన్పడి వాడి వంకే చూస్తూండిపోయాడు.

"అమ్మ అనేదిగా—నన్ను తిడితే తాతగార్ని తిట్టినట్లే—నన్ను కొడితే తాతగార్ని కొట్టినట్లే—నన్నేడిపిస్తే తాతగార్నేడిపించినట్లే — గుర్తుంచుకో!" అని—

"మాట్లాడవేం డాడీ—నువ్వలా చూడొద్దు. నువ్వలా చూస్తూంటే నాకు ఏడుపు వస్తోంది మళ్ళీ—" అన్నాడు వీరభద్రం.

గోపాలకృష్ణ వాడిని చటుక్కున యెత్తుకుని ముద్దు పెట్టుకుని వెంటనే ఏదో తప్పుపని చేసినట్లు కిందకు దింపేశాడు.

"మీ రిద్దరూ ఇక్కడే వుండండి బాబూ—మా కెంతో సంతోషంగా వుంటుంది—" అన్నాడు జయరామయ్య.

"మీరు మీ సంతోషం గురించే ఆలోచిస్తున్నారు. నా సంతోషం మా టేమిటి?" అన్నాడు గోపాలకృష్ణ. అతను బయటకు వెళ్ళడానికి సిద్ధపడ్డాడు.

"డాడీ—నువ్వు తొందరగా వచ్చేసేయ్. నువ్వొచ్చే దాకా నేనింకేమీ తినను—" అన్నాడు వీరభద్రం.

"సరేలే—" అని గోపాలకృష్ణ కదలబోయాడు.

"అరే—డాడీ—నీ ఉత్తరం నా దగ్గర మర్చిపోయావు—" అంటూ వీరభద్రం జేబులోంచి ఓ కాగితం తీసి గోపాలకృష్ణకు ఇచ్చాడు.

"ఉత్తరమా?" అంటూ ఆశ్చర్యంగా అందుకుని చదివి వులిక్కిపడి వీరభద్రం వంక చూశాడు. వాడు అమాయకంగా తండ్రివంకే చూస్తున్నాడు.

ఉత్తరంలో—"బాబు జాగ్రత్త—నిను వీడిని నీడ!" అని వుంది.

30

గోపాలకృష్ణ తిన్నగా బయల్దేరి వెళ్ళి వినాయకరావుకు జరిగింది చెప్పాలని అనుకున్నాడు. కానీ అలా చేయడానికి అతడికి భయం వేసింది.

జరిగిందానికి వినాయకరావు మండిపడతాడు.

గోపాలకృష్ణ ముందు తన ఇంటికి వెళ్ళాడు. అప్పుడతను అక్కణ్ణించి వినాయకరావుకు ఫోన్ చేసి జరిగింది చెప్పాడు.

వినాయకరావు అంతా విని "ఇట్సాల్‌రైట్ - డోంట్ వర్రీ" అన్నాడు.

ఆయనలా అనగానే గోపాలకృష్ణకు కలిగిన ఆశ్చర్యమింతా అంతా కాదు - "నావల్ల జరిగిన పొరపాటుకు నేను చాలా బాధపడుతున్నాను" అన్నాడతడు విచారంగా.

"పొరపాటు జరిగినందుకు బాధపడి లాభం లేదు. పొరపాటెలా జరిగిందో తెలుసుకోవాలి. నీ మీద నాకు పూర్తి నమ్మకముంది. ఆ ప్రయత్నంలో వుండు. అవసరమైతే టైగర్ సాయం తీసుకో" అన్నాడు వినాయకరావు.

గోపాలకృష్ణకు నమ్మకం చాలలేదు. "నిజంగా నా పొరపాటును మన్నించారా?" అన్నాడతను మళ్ళీ.

"నమ్ముకున్నవాళ్ళ పొరపాట్లు నాయకులు మన్నించకపోతే ఇది ఇండియా ఎందుకవుతుంది?" అన్నాడు వినాయకరావు ఫోన్ పెట్టేస్తూ.

గోపాలకృష్ణకు ఉత్సాహం వచ్చింది. అతను డ్రైక్లీనింగుషాపుకు వెళ్ళాడు.

అక్కడ ఇప్పుడు గోపాలకృష్ణ కూర్చోవడం లేదు. షాపు కూడా కొంచెం పెద్దదయింది. నలుగురు పనివాళ్ళు వ్యవహారాలు చూస్తున్నారు. గోపాలకృష్ణను చూస్తూనే వారతడికి నమస్కరించారు. గోపాలకృష్ణ హుందాగా నమస్కారం అందుకుని తన రహస్య మందిరానికి వెళ్ళాడు. అక్కడ టైగర్ తదితరులు వున్నారు.

గోపాలకృష్ణ టైగర్‌కు జరిగిందంతా చెప్పాడు.

టైగర్ కోపంగా "అయితే వెంటనే వెళ్ళి ఆ కుర్రాడ్ని

చంపేయాలి" అన్నాడు.

"అందువల్ల ప్రయోజనం?" అన్నాడు గోపాలకృష్ణ.

"ఆ కాగితాలవల్ల పెద్దబాస్ బ్రతుకు బయట పడుతుంది...."

గోపాలకృష్ణ నవ్వాడు.

"ఎవరికయినా పెద్దబాస్ బ్రతుకు బయట పెట్టడం అంత సులభంకాదు. నే నాయనకు జరిగినదంతా చెప్పాను. ఆయన ఏమీ కంగారు పడలేదు సరిగదా – టైగర్ సాయం తీసుకుని ఏం జరిగిందో పరిశోధించమన్నాడు" అన్నాడు గోపాలకృష్ణ.

"ఇందులో ఏం పరిశోధిస్తాం?" అన్నాడు టైగర్.

"మనకు ఎవరో శత్రువులు బయల్దేరారు. వాళ్ళెవరో తెలుసుకోవాలి. చాలా అర్జంటు" అన్నాడు గోపాలకృష్ణ.

"ఎస్ బాస్!" అని "ఇలాంటి సమయాల్లో మీకు వుత్సాహం అవసరం! కొత్తపిట్టని చూడమంటారా?" అన్నాడు టైగర్.

"ఎక్కడ?"

"అక్కడే!"

"సరే – కానీ కొత్త పిట్టంటే ఇలాంటివాటికి కొత్త అయిన పిట్టే కావాలి. అప్పుడే రంజుగా వుంటుంది" అన్నాడు గోపాలకృష్ణ.

"టైగర్‌కి చెప్పారుగా – సరిపోతుంది–" అన్నాడు టైగర్.

గోపాలకృష్ణ క్షణం ఆగి "ఈ పని చలానికి మాత్రం చెప్పొద్దు. గుర్తుందిగా–వాడి పిట్టలు ప్రమాదాన్ని తెస్తాయి" అన్నాడు.

"అలాంటి పని చేయను బాస్! మంచి కాలేజీ గువ్వను

తెస్తాను. తర్వాత ఏ ప్రమాదమూ వుండదు" అన్నాడు టైగర్.

గోపాలకృష్ణ నిరుత్సాహపడితే వినాయకరావుకు నష్టం. అతనెప్పుడూ ఉత్సాహంగా వుండటం టైగర్ బాధ్యత.

వినాయకరావు అనుచరుల్లో గోపాలకృష్ణకు ప్రత్యేక స్థాన ముంది.

పట్నానికి బాగా అవతల నిర్జన ప్రాంతంలో ఓ వెదురు కర్రల భవంతి ఉంది దాన్ని బాంబూహౌస్ అంటారు వినాయకరావు అనుచరులు. వినాయకరావు ఆడపిల్లలతో ఖుషీ చేయడం కోసమని అది కట్టించాడు. అందులో అన్ని సదుపాయాలూ వుంటాయి.

టైగర్ - "అక్కడే" అంటే బాంబూహౌస్ అని అర్థం. గోపాలకృష్ణకు అది తెలుసు. అతడు ఏటా నాలుగయిదు సార్లయినా అక్కడ మజా చేస్తూంటాడు. వినాయకరావు గోపాలకృష్ణకు మాత్రమే ఇచ్చిన ప్రత్యేకమైన సదుపాయ మిది. ఆయన అనుచరుల్లో ఇంకెవ్వరూ అక్కడ మజా చేయడానికి వీల్లేదు.

ఆ బాంబూహౌస్‌ని ఎప్పుడూ ఇద్దరు సమర్థులైన కాపలావాళ్లు పరిరక్షిస్తుంటారు.

టైగర్ వెళ్ళిపోయాక గోపాలకృష్ణ మనసంతా ఆ అనుభవం మీదకు పోయింది. అతను ఫోన్ కాల్‌కోసం ఎదురు చూస్తూ షాపులోనే వుండిపోయాడు.

సాయంత్రానికి వచ్చింది అతడు ఎదురు చూస్తున్న ఫోన్‌కాల్.

31

గోపాలకృష్ణ బాంబూహౌస్‌కు చేరుకునేందుకు ఎంతో సేపు పట్టలేదు. అక్కడ అతన్ని చూస్తూనే వాచ్‌మెన్

శల్యూట్ చేశారు.

గోపాలకృష్ణ లోపలకు వెళ్ళాడు. పడక గదిలో ప్రవేశించాడు.

ఆ వెదురు కర్రల ఇంట్లో అంతమంచి పడకగది వుంటుందని వూహించడం ఎవరికయినా కష్టమే!

గదిలో ఓ కుర్చీలో ఓ యువతి కట్టివేయబడి వుంది. ఆమె పేరు రోజా.

ఆమె చూడ్డానికి అప్పుడే చెట్లనుంచి కోసిన రోజా పుష్పంలా వుంది. ఇంకా పరీక్షించి చూస్తే తను మరి కాసేపట్లో వాడి, నలిగిపోతానని ఆ పుష్పానికి తెలుసునని కళ్ళు చెబుతున్నాయి.

గోపాలకృష్ణ ఆమెను చూసి - "అరే నన్ను చూసి గౌరవంగా లేచి నిలబడలేదేం?" అని "అయ్యో పాపం - నిన్ను కుర్చీకి కట్టేశారా?" అంటూ ఆమెను సమీపించి - "ఈ బంధాలంటే నాకు చాలా చిరాకు. ఇప్పుడే నిన్ను బంధ విముక్తురాల్ని చేస్తాను" అంటూ ఆమె కట్లు విప్పి "ఊఁ ఇప్పుడు లేచి నాకు దణ్ణం పెట్టి మళ్ళీ కూర్చో!" అన్నాడు,

రోజా అలాగే చేసింది. ఆమె ఆపాదమస్తకమూ వణికి పోతోంది.

"అప్పుడే ఆగిపోయానని ఆశ్చర్యపడుతున్నావా? నేను నిన్నింకా పూర్తిగా బంధవిముక్తురాలిని చేయలేదు. ఐ మీన్-వంటికి బట్టలు కూడా బంధాలేనని నా అభిప్రాయం. కానీ అందుకు కాసేపు ఆగాలి. ఎందుకంటే నాకు దీపం అంటే యిష్టం. దీపంలాంటి నిన్ను దీపకాంతిలోనే అనుభవించాలి. అయితే దీపం అందం వెలుతురులో తెలి యదు. అందుకని ఇంకాస్త చీకటి పడనీ" అంటూ అత

డామెకు ఓ పుస్తకాన్ని అందించాడు. ఆమె దానివంక చూపింది.

"మగవాణ్ణి సుఖపెట్టడం ఎలా?" అని వుంది ఆ అట్ట మీద.

ఆమె కంగారుగా అతడివంక చూస్తూ లేచి నిలబడింది.

అతడి చేతిలో కత్తి వుంది.

"కూర్చో!" అన్నాడతను.

ఆమె కూర్చుంది.

"చదువు" అన్నాడతను.

ఆమె పుస్తకం తెరిచింది.

"ఆడదాన్నెలా సుఖపెట్టాలో నాకు తెలుసు. అందుకే నేనే పుస్తకమూ చదవడం లేదు. నువ్వు పుస్తకం చదువుతూండు. నేను నీ ముఖంలో భావాలు చూస్తూంటాను" అన్నాడు గోపాలకృష్ణ.

రోజా పుస్తకంలోకి చూస్తోంది.

ఆమెకు అక్షరాలు కనిపించడం లేదు. వళ్ళంతా భయం. తన కిప్పుడు ఏం జరుగుతుంది?

ఆమె చాలా అమాయకురాలని గోపాలకృష్ణకు అర్థమయింది.

అతడికి వుత్సాహం పెరిగింది. తనకీరోజు అపూర్వానుభవం రాపిపెట్టి వుందనుకున్నాడు.

"పేజీ తిరగడం లేదు...." అన్నాడు గోపాలకృష్ణ గద్దిస్తూ.

ఆమె అతడి వంక చూసింది. గోపాలకృష్ణ చేతిలోని కత్తి తళ తళ మెరుస్తున్నది.

ఆమె కంగారుగా చక చక పేజీలు తిప్పసాగింది.

"ఆగు!" అన్నాడు గోపాలకృష్ణ "పేజీలు వెనక్కి తిప్పి మళ్ళీ మొదటి పేజీ దగ్గరకు రా" అన్నాడు.

ఆమె అలాగే చేసింది.

"నీలో నువ్వు చదువుకోవడం కాదు. ఇప్పుడు నాకు వినబడేలా పైకి చదువు" అన్నాడు గోపాలకృష్ణ.

రోజాకు అప్పటికి అందులోని అక్షరాలు కనిపించాయి. ఆమె దీనంగా అతడి వంక చూసి - "ప్లీజ్! నేను చదవలేను...." అంది.

గోపాలకృష్ణ చేతిలోని కత్తిని గాలిలోకి ఎగురవేసి పిడిని చేత్తో పట్టుకుని "వన్, టూ, త్రీ అంటాను, చదవడం మొదలుపెట్టు" అన్నాడు.

అతడి కంఠం కఠినంగా ధ్వనించింది.

రోజా బెదురుగా అతడివంక చూసి మళ్ళీ అక్షరాల వంక చూసింది.

ఆ అక్షరాలింకా బెదిరిస్తున్నాయామెను. పరువైన ఆడపిల్ల ఏకాంతంలో చదువుకునేందుకు కూడా సిగ్గుపడే విషయాలవి. తానిప్పుడు ఒక అపరిచిత యువకుడి ముందు చదవాలి—

"వన్.... టూ...."

రోజా శరీరంలో సన్నని వణుకు ప్రారంభమైంది. అతడు చేతిలోని కత్తితో ఆమెను సమీపించి - "త్రీ" అన్నాడు.

ఆమె గట్టిగా చదవడం ప్రారంభించింది.

32

గౌరి నిప్పుడు గుర్తించడం కష్టం.

ఆమె ధరించిన జీన్సు కానీ, బాబ్డ్ హెయిర్‌గా మారిన జడ కానీ అందుకు కారణం కాదు. డిటెక్టివ్ వెంకన్న

చేసిన మేకప్‌వల్ల ఆమె ముక్కు కాస్త వంకరయింది. పళ్ళు కాస్త ఎత్తుగా వున్నాయి.

ఆమె అందమయిన యువతి అని యిప్పుడెవరూ అనుకోరు.

గౌరి మెడలో కెమేరా ఒకటి వ్రేలాడుతోంది.

అంతవరకూ ఎక్కడున్నదో కానీ కనుచీకటి పడుతూండగా గౌరి బాంబూహౌస్ ముందు ప్రత్యక్షమయింది.

ఒక కాపలావాడు గేటుకు బయట వున్నాడు. మరొకడు లోపల తిరుగుతున్నాడు.

"ఇంటికొకడు, ఇంటిచుట్టూ కంచెకొకడు—మొత్తం ఇద్దరన్నమాట కాపలా—" అని నవ్వుకుంది గౌరి. ఆమె నెమ్మదిగా మొదటి వాచ్‌మన్ని సమీపించింది. వాడామెవంక ఆశ్చర్యంగా చూశాడు.

గౌరి వాడివంక చూసి నవ్వింది.

"ఎవర్నువ్వు? ఈ ఏకాంత ప్రదేశంలోకెలా వచ్చావ్?" అన్నాడు వాడు.

"నీ ఫోటో తీసుకోవడంకోసం ఇంతదూరం వచ్చాను" అంది గౌరి.

"నా ఫోటోకోసమా? ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు వాడు. తనలో ఆ అమ్మాయి నాకర్షించిన లక్షణాలేమున్నాయో అర్థం కాలేదు వాడికి.

గౌరి వాడివంక నవ్వుతూ చూసి—"ఈ కెమేరాలో అమితాబ్ బచ్చన్‌కీ, ఎన్టీరామారావుకీ ఫొటోలు తీశాను. నువ్వు మూడోవాడివి—" అంది.

వాచ్‌మన్ తనకు పట్టిన అదృష్టానికి మెలికలు తిరుగుతూ—"మా ఆవిడకు కూడా ఫోటో తీస్తావా?" అనడిగాడు.

"తప్పకుండా తీస్తాను. నేను వాచ్‌మన్ల జీవితం మీద ఓ వ్యాసం రాస్తున్నాను. అందుకు ఫోటోలు కావాలి. వ్యాసం ఏ పత్రికలోనైనా పడితే నాకు డబ్బులొస్తాయి—" అంది గౌరి.

"మరి నాకు?"

"నీ ఫోటో పేపర్లో పడుతుంది. ఈ రోజుల్లో ఫోటో పేపర్లో పడడ మంటే మాటలా?" అంది గౌరి.

వాచ్‌మన్ చాలా సంతోషించాడు. వాడు ఫోటోకోసం రకరకాల పోజు లిచ్చాడు.

కాసేపు గౌరి వాణ్ణి పోజులు బాగోలేదని మార్పించి ఏడ్పించింది. ఆఖరున—"నీ పోజులు బాగానే వున్నట్లు న్నాయి. కానీ నీ టోపీ మూలంగా అన్నీ పాడైపోతు న్నాయి. నీకు నచ్చిందేమోకానీ నీ టోపీ నాకు నచ్చలేదు" అంటూనే కెమేరా క్లిక్‌మనిపించింది.

అంతే—వాచ్‌మన్ టోపీ నేలమీద పడిపోయింది. కెమేరాలోంచి సన్నని మెరుపు రావడం వాచ్‌మన్ కళ్ళ బడింది.

"బాప్‌రే!" అన్నాడు వాడు.

గౌరి ముఖం గంభీరంగా అయిపోయింది—"నేను చెప్పినట్లు చేయి. లేకపోతే ఇప్పుడు నీ టోపికి గురిపెట్టి నట్లే కెమేరాను నీ గుండెకు గురిపెట్టాల్సి వుంటుంది—" అన్నదామె.

వాచ్‌మన్ కంగారుగా—"నేనేం చేయాలి?" అన్నాడు.

ఆమె ఓ ప్లాస్టిక్ తాడు చుట్ట వాడిమీదకు విసిరింది—"నేను పక్కకు వెడుతున్నాను. కెమేరా నీకే గురిపెట్టబడి వుంటుంది. లోపలున్న రెండో వాచ్‌మన్ని పిలిచి ఈ తాళ్ళతో కట్టేయాలి. వాడికేం చెబుతావో నాకు తెలియదు.

నా ఉనికి గురించి మాత్రం చెప్పకూడదు" అని పక్కగా వెళ్ళింది.

వాచ్‌మన్ చప్పట్లు కొట్టి రెండోవాణ్ణి పిలిచి తన చేతి లోని తాడు చూపించి—"ఇది చూశావా?" అన్నాడు.

"చూశాను—ఏం?" అన్నాడు రెండోవాడు.

"దీంతో నిన్ను కట్టేశాననుకో—ఇంకా మిగుల్తుం దంటావా — సరిపోతుందంటావా?" అన్నాడు మొదటి వాచ్‌మన్.

"మిగుల్తుంది—"

"మిగలదు—వందరూపాయలు పందెం—"

మాటామాటా రాగా పందేనికి దిగాడు రెండోవాడు. మొదటివాడు రెండోవాణ్ణి కట్టేశాడు. తాడు ఇంకా చాలా మిగిలిపోయింది.

"చూశావా—నేనే నెగ్గాను. వందరూపాయ లియ్యి."

అప్పుడు గౌరి మళ్ళీ అక్కడ ప్రత్యక్షమయింది. ఆమెను చూసి రెండో వాచ్‌మన్ ఆశ్చర్యపడ్డాడు. గౌరి మొదటివాడి వంక తీవ్రంగా చూసి—"ఆ మిగిలిన తాడు నీకు చుట్టబెట్టుకో—లేదా—ఫోటో తీస్తాను" అంది.

మొదటివాడు ఆదరాబాదరాగా తాడు తనకు చుట్టబెట్టు కున్నాడు.

రెండోవాడి కిదేమీ అర్థంకాలేదు—"ఆడపిల్ల ఫోటో తీస్తానంటే బెదిరిపోతానంటావేంటిరా—నాలుగు తన్నక" అంటూ వాడు కేకలు పెట్టసాగాడు.

గౌరి ఇద్దరి కట్లూ కట్టుదిట్టం చేసి బాంబూహౌస్‌లో ప్రవేశించింది. ఆమె పడకగదిలో అడుగుపెట్టే సమయానికి సరిగ్గా అప్పుడే దీపం వేశాడు గోపాలకృష్ణ.

"చదివింది చాలు—ఇప్పుడు ప్రాక్టికల్సు" అన్నాడు

గోపాలకృష్ణ.

రోజా కళ్ళలో నీళ్ళున్నాయి. అప్పుడే వెలిగిన దీపం వెలుగురేఖల్ని ఆమె కన్నీళ్ళలోకి కూడా ప్రసరింపజేసింది.

మంచందగ్గర వున్నాడు గోపాలకృష్ణ.

గౌరి గుమ్మం దగ్గరే వుండి స్విచ్ ఆఫ్ చేసింది.

టిక్కుమన్న శబ్దం గోపాలకృష్ణకు వినిపించింది. అతను చిరాగ్గా—"ఎవరది?" అని అరిచాడు.

"చీకటి తప్పుకు పూనుకుని చీకట్లో దీపం వెలగిస్తావేం? అందుకే కావాలని నీకోసం చీకటిని సృష్టించాను—" అంది గౌరి.

"ఎవర్నువ్వు?"

"కంఠం తెలియడంలా—ఒక ఆడదాన్ని—"

"ఎవరు కావాలి—నీకు?"

"ఒక మగాడు—"

గోపాలకృష్ణ మౌనం వహించాడు. ఏం జరిగిందో, ఎవరొచ్చారో ఆకళింపు చేసుకుందుకు ప్రయత్నిస్తున్నాడతను.

గౌరి దీపంవేసి గదిలో అడుగుపెట్టింది. ఆమె రూపం చూస్తూనే గోపాలకృష్ణ హతాశుడై పోయాడు.

"నీకు మగాడు కావలసొచ్చాడా?" వెటకారంగా అన్నాడతను.

"నీకు ఆడది కావలసి రాగా లేనిది నాకు మగాడు కావలసొస్తే ఆశ్చర్యమేముంది?" అంది గౌరి.

"నీ మొహం చూస్తే ఉమ్మాలని కూడా అనిపించదు."

గౌరి రోజా వంక తిరిగి "నీ పేరు రోజా అని నాకు తెలుసు. అతడి ముఖం చూస్తే ఉమ్మాలనైనా అనిపిస్తుందా నీకు" అని వెటకారంగా అడిగింది.

ఆమె యెవరో—ఏం ధైర్యం చూసుకుని—తన వాసానికి వచ్చి తననే ఎదిరిస్తోందో గోపాలకృష్ణకు అర్థం కావడం లేదు. అయితే అతడి మనసు రోజాపట్ల లగ్నమై వుంది. అందుకని గొడవ పెంచదల్చుకోలేదు.

అతడు నెమ్మదిగా—"నువ్వంటే నా కిష్టంలేదు. వెళ్ళు యిక్కణ్ణించి!" అన్నాడు.

"సరిగ్గా యిదే మాటలు నీతో అనాలని రోజా అనుకుంటోంది. నువ్విక్కణ్ణుంచి వెళ్ళిపోతావా?" అంది గౌరి.

అప్పుడు తీశాడు గోపాలకృష్ణ—జేబులోంచి—తళతళ మెరిసే పిడిబాకు!

"రోజాకు చేతకానిది నాకు చేతనౌను. నువ్వు ఇక్కణ్ణించి వెడతావా—నేను బయటకు పంపించాలా!" అన్నాడతను గౌరివంక క్రూరంగా చూస్తూ.

"మరీ అంతలా ఆగ్రహించకు బాస్! నే నొక జర్నలిస్టుని. ఎక్కడెక్కడి వింతలూ పరిశోధించి పత్రికలకు వార్తలు పంపుతూంటాను. ఈ బాంబూహౌస్ నాకు నచ్చింది. ఒక్కటంటే ఒక్క ఫోటో తీసుకుని వెళ్ళిపోతాను" అని అతడి సమాధానం కోసం ఎదురు చూడకుండా "ఆహా—ఆ బల్లమీద కూజా యెంత బాగుంది? బయటే యింత బాగుంటే ఫోటోలో ఇంకెంత బాగుంటుందో?" అంటూ కెమేరా క్లిక్ మనిపించింది.

అక్కడ మెరుపు మెరిసినట్లయింది.

గాజు కూజా ముక్కలై నేలమీద పడింది.

గోపాలకృష్ణ చేతిలోని బాకు క్రిందపడింది.

"ఏమిటలా చూస్తున్నావ్? పరాయి ఆడదాని జోలికి వెళ్ళినపుడు గాజు కూజా పగలడం ఇది రెండోసారేమో" అంది గౌరి.

"ఎలా తెలుసు నీకు?" అన్నాడు గోపాలకృష్ణ. గౌరి పగులగొట్టిన ఖరీదైన ఫ్లవర్ వాజును అతను మరిచి పోలేదు.

"నాకు నీ గురించి జరిగినవీ. జరగబోయేవీ కూడా తెలుసు. నాకు తెలియకుండా నువ్వేమీ చేయలేవు" అంది గౌరి.

"ఎవర్నువ్వు?"

"విను పీడని నీడ!" అంది గౌరి.

గోపాలకృష్ణ మళ్ళీ ఉలిక్కిపడ్డాడు. అదే పేరు.... తను యెక్కడో విన్నాడు.... బాబు తనకు ఇచ్చిన ఉత్తరం....

"మిస్ రోజా! నేనింకా అతడికి చాలా చెప్పాలి. అతడింకా అలా అలా ఉలిక్కిపడుతూండాలి. కాబట్టి నువ్వు వెళ్ళిపోవడం మంచిది" అంది గౌరి.

రోజా తటపటాయించింది.

"నీకేమీ భయంలేదు. ఎవరూ నిన్ను అడ్డగించరు. కొంత దూరం వెళ్ళాక నిన్ను పట్నంలో చేర్చడంకోసం ఒక ఆటోరిక్షా కూడా ఎదురు చూస్తూంటుంది. నిర్భయంగా వెళ్ళు" అంది గౌరి.

రోజా అక్కణ్ణించి ముందు నెమ్మదిగా నాలుగడుగులు వేసింది. ఆ తర్వాత ఒక్క పరుగులో అక్కణ్ణించి వెళ్ళి పోయింది.

"మై డియర్ ఫ్రెండ్! నాకు బ్రాందీ కావాలి, ఇస్తావా?" అంది గౌరి.

"ఎందుకు?"

"బ్రాందీ యెందుకని నువ్వు నన్నడుగుతున్నావా? నువ్వసలు మగాడివేనా?" అంది గౌరి.

"నీ కెందుకూ అనడుగుతున్నాను" అన్నాడు గోపాలకృష్ణ.

"బ్రాందీ యెవరికైనా ఒకందుకే—తాగడానికి!" అంది గౌరి.

"నువ్వు తాగుతావా?" అన్నాడు గోపాలకృష్ణ.

"ప్రశ్నలు తర్వాత—అడిగిన దివ్వు" అంది గౌరి.

"ఇవ్వకపోతే?"

"ఇందాక ఫ్లవర్ వాజ్‌కు తీశాను కదా—అలాగే నీకూ ఫోటో తీస్తాను" అంది గౌరి.

గోపాలకృష్ణ అసహాయంగా ఆమె వంక చూసి "ఏం కావాలి నీకు? ఎందుకొచ్చావిక్కడికి?" అనడిగాడు.

గౌరి మాట్లాడలేదు.

"ఆ కుర్రాడిని నా కంటగట్టింది నువ్వే కదూ?"

గౌరి మాట్లాడలేదు.

"ఏం కావాలి నీకు?" మళ్ళీ అడిగాడు గోపాలకృష్ణ.

"నాకు నువ్వు కావాలి. నువ్వే కావాలి!...." అంది గౌరి.

"ఎవర్నువ్వు?"

"ఎన్నిసార్లు చెప్పాలి—? నేను—నిను వీడని నీడను!"

"నాకు నువ్వంటే యిష్టంలేదు—" అన్నాడు గోపాలకృష్ణ.

"మిస్టర్ గోపాలకృష్ణా! నాకు నీ యిష్టంతో నిమిత్తం లేదు. నువ్వు రోజా ఇష్టంమీదనే ఆమె నిక్కడికి తీసుకొచ్చావా? బలాత్కారం మగవాళ్ళకే జన్మహక్కు కాదు—" అని—"త్వరగా బ్రాందీ తీసుకుని రా—" అందామె.

గోపాలకృష్ణ కదల్లేదు.

"త్వరగా అన్నానా!" అంటూ కెమెరా క్లిక్ మని పించింది గౌరి. వెంటనే చిన్న మెరుపు మెరిసిన ట్లయింది.

గౌరి గురిచూపి నేలమీద పడివున్న బాకుపిడిని కొట్టిన ట్లుంది. ఆ బాకు పిడి ఆధారంగా బొంగరంలా గిరగిరా శరవేగంతో తిరుగుతున్నది.

గోపాలకృష్ణ ఆ దృశ్యం చూసి అదిరిపోయాడు. అతడు కూడా శరవేగంతో ఆ గదిలోంచి పక్కగదిలోకి వెళ్ళి బ్రాందీ బాటిల్ తెచ్చాడు.

అప్పటికి గౌరి ఆ పక్కనున్న రెండు గ్లాసుల్లో ఓ గ్లాసులో తన జేబులోంచి ఓ సీసా తీసి అందులోకి రెండు చుక్కలు వంచింది. ఆ గ్లాసులో రెండు చుక్కలు పడినప్ప టికీ—అది రంగులేని ద్రవం కావడంవల్ల—ఏమీ తెలి యడం లేదు.

గోపాలకృష్ణ బాటిల్ నుంచి బ్రాందీ రెండు గ్లాసుల్లోకి వంచి పోశాడు. గౌరి అతడికి ఓ గ్లాసు ఇచ్చి—"ముందు నువ్వు తాగు—" అంది.

గోపాలకృష్ణ క్రింద పడివున్న పిడిబాకువంక చూశాడు. అదింకా గిరగిరా తిరుగుతూనే వుంది.

గోపాలకృష్ణ మాట్లాడకుండా తన గ్లాసులోని బ్రాందీని గటగటా తాగేశాడు.

33

"శభాష్ గౌరీ!" అన్నాడు వెంకన్న.

గౌరి సిగ్గుపడుతూ తల వంచుకుంది.

"నే ననుకున్న కంటే ఎక్కువ ధైర్యసాహసాలు ప్రదర్శించావు. చాకచక్యం చూపించావు. ఇప్పటికి నీ విష

యంలో నాకూ నమ్మకం కలిగింది—" అన్నాడు వెంకన్న.

వెంకన్న తన పథకం గురించి చెప్పాడు. అదృష్టం అన్నివిధాలా వారికి కలిసివచ్చింది.

"మన ప్రభుత్వం ఒక సి బి ఐ మనిషిని విదేశాలు పంపించ నున్నది. అందుకు సమర్థుడైనవాడు నాగరాజు ఒక్కడే! అయితే నాగరాజు గురించి విదేశాల్లో కొంత సమాచారం వుంది. కానీ అతడు సమర్థుడైన గూఢచారి కావడంవల్ల అతడినే గూఢచారిగా పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ కారణంగా నాగరాజు చనిపోయినట్లు ప్రపంచాన్ని భ్రమింప చేయదల్చుకున్నది ప్రభుత్వం. ఇదీ మనకు కలసివచ్చిన అదృష్టం—" అన్నాడు వెంకన్న.

"అంటే?" అంది పద్మావతీదేవి.

"ఒక హత్య జరుగుతుంది. ఆ హత్యను పోలీసులు నిరూపిస్తారు. హంతకుడు తప్పించుకుని పారిపోతాడు...." అన్నాడు వెంకన్న.

"ఇందులో మన అదృష్టం ఏమిటీ అంటున్నాను—" అన్నదతడి భార్య.

"హంతకుణ్ణి నేను సరఫరా చేస్తానంటే పోలీసులు అంగీకరించారు. హంతకు డెవరో తెలుసా?....—మన మోహన్!" అన్నాడు వెంకన్న.

పద్మావతీదేవి ఆశ్చర్యంతో నోరు తెరిచింది.

"అప్పుడే మొత్తం ఆశ్చర్యమంతా పడిపోకు. మోహన్ పారిపోయి వినాయకరావు ఆశ్రయం సంపాదిస్తాడు ." అన్నాడు వెంకన్న.

"ఇది సాధ్యమేనా?" అంది పద్మావతీదేవి.

"ఎందుకు కాదు?" అన్నాడు వెంకన్న.

మోహన్ దొంగతనం కోసం నాగరాజు యింట ప్రవేశిస్తాడు. పరిస్థితులు కలిసిరాక హంతకు డవుతాడు. కాకతాళీయంగా వినాయకరావు ఇంట ప్రవేశిస్తాడు. వినాయకరావతణ్ణి తప్పక ఆదరిస్తాడు. అక్కడే బాబు, నాని కూడా ప్రవేశపెట్టబడతారు. వాళ్ళు ముగ్గురూ కలిపి వినాయకరావుకు సంబంధించిన తిరుగులేని ఆధారాలు సంపాదించాలి. వినాయకరావుకూ, గోపాలకృష్ణకూ దూరాన్ని పెంచాలి.

"అన్నింటిలోకీ ముఖ్యమైనది—గోపాలకృష్ణకు అన్ని వైపుల నుంచీ మార్గాలు మూసుకుపోవాలి—" అన్నాడు వెంకన్న.

"మంచి మనసుతో ఈ పనికి పూనుకున్నారు. మీ కార్యక్రమం విజయవంత మవుతుంది—" అంది పద్మావతీదేవి. తర్వాత ఆమె ఆలోచిస్తూ—"అది సరే—మీరు ప్రస్తుతం గోపాలకృష్ణ నేంచేస్తారు?" అంది.

"అతను మంచి నిద్రలో వుంటాడు. ఉదయమే ఫోన్లో హెచ్చరిక! అతడి జేబులో రోజాతో కలిపి వున్న ఫోటో ఒకటి వుంటుంది. దాని నెగెటివ్ ఖరీదు—యాభై వేలు. బ్లాక్ మెయిలింగ్ ప్రారంభమవుతుంది—" అన్నాడు వెంకన్న,

"కానీ బాంబూహౌస్‌కు ఫోన్ వున్నట్లు లేదు—" అంది గౌరి.

"ఆ మాటకొస్తే అతడి జేబులో మాత్రం ఫోటో యెక్కడిది? నీ ఆలోచనల పదును చూడడం కోసమని అలాగన్నాను—" అన్నాడు వెంకన్న.

"ఇంతకీ గోపాలకృష్ణ నేం చేయాలో చెప్పలేదు మీరు—" అంది పద్మావతీదేవి.

ఫారము - 4

1. ప్రచురణ స్థలము	:	హైద్రాబాదు-29.
2. ప్రచురణ కాలము	:	మాస పత్రిక
3. ముద్రాపకుని పేరు	:	శ్యామ దామోదర రెడ్డి.
జాతీయత	:	భారతీయుడు.
చిరునామా	:	హైద్రాబాదు-29.
4. ప్రచురణ కర్త పేరు	:	-డిటో-
జాతీయత		
చిరునామా		
5. సంపాదకుని పేరు	:	-డిటో-
జాతీయత		
చిరునామా		
6. వార్తాపత్రికపై యాజమాన్యము గల వ్యక్తులు, భాగస్తులు	:	శ్యామ దామోదర రెడ్డి 3-4-554, నారాయణగూడ, హైద్రాబాదు-29
పేర్లు, చిరునామాలు	:	(సోల్ ప్రొప్రయిటరు)

శ్యామ దామోదర రెడ్డి అయిన నేను, పై తెలిపిన వివరములు నాకు తెలిసినంత వరకు, నేను విశ్వసించి నంత మేరకు సత్యమైనవని. ఇందు మూలముగా ప్రకటించు చున్నాను.

తేది 1-3-84

శ్యామ దామోదర రెడ్డి
(ప్రచురణకర్త సంతకం)

"అతన్ని మనమేదో చేయడ మెందుకూ? అతనేం చేస్తాడో మనం చూద్దాం!" అన్నాడు వెంకన్న.

34

మర్నా డుదయం ఎనిమిదింటికి గోపాలకృష్ణకు మెలకువ వచ్చింది. అతడు బాంబూహౌస్‌లోనే వున్నాడు. వంటికి ఏదో గుచ్చుకుంటున్న ట్లనిపించి లేచి వులిక్కిపడ్డా డతను.

అతడి కౌగిలిలో అంతవరకూ వున్నది ఒక ఎలుగు బంటి! అంటే ఒక రాత్రంతా తానలా పడుకుని వున్నాడన్న మాట!

గోపాలకృష్ణ కంగారుగా దూరంగా జరిగాడు. అప్పటి కతడి మత్తు పూర్తిగా వదిలిపోయింది.

అది నిజం ఎలుగుబంటి కాదు. స్టఫ్డ్ యానిమల్! బాంబూహౌస్‌లో ఓమూల వుండేది.

గోపాలకృష్ణ మెదడు పనిచేయడం ప్రారంభించింది. క్రమంగా అతడికంతా గుర్తు వచ్చింది. నిను వీడని నీడ నంటూ తన నిబ్బందిపెట్టిన ఆ కురూపి ఆడదే ఇదంతా చేసింది.

గోపాలకృష్ణ బాంబూహౌస్‌లోంచి బయటపడ్డాడు.

బయట వాచ్‌మన్ లిద్దరూ అతడికి శల్యూట్ చేశారు.

ఆ కురూపి ఆడది వచ్చినపుడు వీళ్ళేం చేస్తున్నారు? రోజా ఇంట్లోంచి పారిపోతూంటే వీళ్ళేం చేస్తున్నారు?

అతడు వాళ్ళనేదో అడగాలనుకుని మళ్ళీ ఊరుకున్నాడు. ఆ ఆడది తన్నే ఫూల్ చేసింది. వీళ్ళొక లెక్కా?

గోపాలకృష్ణ కారెక్కాడు. కారుకు సరిగ్గా సగం దూరంలో రోడ్డుకు అడ్డంగా ఇద్దరు మనుషులు పడుకుని వున్నారు. వాళ్ళకు కూడా భయంలేదేమో—కారు వేగంగా